# మళ్ళీ రైలు తప్పిపోయింది

నవల

## గొల్లపూడి మారుతి రావు




శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 50



# మళ్ళీ రైలు తప్పిపోయింది

## గొల్లపూడి మారుతీరావు



**ఒక విశేషం:** ఎమెస్కో సీరీస్ లో ప్రచురితమైన ఈ నవలకు సంబంధించి ఒక మధురమైన జ్ఞాపకం ఉంది. నవల చదివిన ఒక అభిమాని 1971లో ఒక ఉత్తరం వ్రాశారు - కింద సంతకం పెట్టకుండా తన అభినందనని తెలుపుతూ. 30 సంవత్సరాలపాటు ఆ అభిమాని ఎవరో నేను గుర్తుపట్టలేక పోయాను. 2001లో నా షష్టిపూర్తి సంచికని ప్రచురిస్తూ భరాగో గారు గుర్తుపట్టారు. - ఆయన ప్రముఖ రచయిత మధురాంతకం రాజారాం..!! - **మారుతి రావు.**

ఒకరాత్రి..!! విజయవాడ జంక్షన్‌లో జీవితంలో రెండోసారి రైలు తప్పిపోయిన రేషన్ గుమాస్తా ‘చంద్రుడు‘ బతుకు మబ్బు తెరల్లో పారాడుతున్న కథ!

మధ్య మధ్య ఫ్లాష్ బాక్‌ల కలనేతతో కొంగ్రొత్త పద గుంభనలతో అల్లిన భావబంధుర మనోవైజ్ఞానిక నవల..!

రచనాకాలం: 1970

## 1

ఆ రాత్రికి రావలసిన ఆఖరి రైలు కూడా వచ్చేసింది, కానీ రుక్కు, తల్లీ, కొడుకూ రాలేదు. విజయవాడ ప్లాట్ ఫారమంతా పిచ్చివాడిలాగ పచార్లు ప్రారంభించాడు. ఇక తెల్లవారితేకానీ మద్రాసు ప్రయాణం సాగదు. మరి పన్నెండు గంటల జాగరణ. తన కూతుర్ని తీసుకురాని రైలు మీదా, పంపించని అల్లుడి మీదా విసుక్కున్నాడు.

రైల్వే ప్లాట్ ఫారమంతా గందరగోళంగా ఉంది. వెళ్ళే ప్రయాణికులూ, వచ్చేవాళ్ళూ, కంగారుగా పరుగులెత్తే వాళ్ళూ, ఆరాటపడేవాళ్ళూ ఏదో గమ్యం తెలీని ప్రయాణానికి, జీవితం ఆశగా, ఆబగా సిద్ధపడుతానంటుంది.

అప్పుడే చిన్న జల్లు పడింది.

తలంటు నీళ్ళు పోసుకున్న పసిపాపలాగ స్వచ్ఛంగా మెరుస్తున్నాడు చంద్రుడు.

చంద్రుడి వయసు నలభై పైన. మీద వెలుగుతున్న చంద్రుడిలాగే అతని జీవితమూ వెలుగునీడల కలనేతగా సాగింది. ఇప్పుడిక త్వరగానే చంద్రుడి జీవితంలో సాయంకాలం ప్రారంభమయింది.

ఇక ఈ రాత్రి ఇలా గడవాల్సిందే ఏమీ తోచక కొత్తగా కట్టిన వంతెన మెట్లెక్కాడు. విజయవాడ వింతగా దివ్వెల తోరణంలాగ కనిపించింది.

ఎదురుగా ప్లాటుఫారమ్ మీద నీలిరంగు చీరని అందరి మధ్యా గుర్తు పట్టాడు. ఆ చీరకి కనీసం పన్నెండు సంవత్సరాల తన సంసారిక జీవితం తెలుసు. అమ్మాయిని కాపరానికి పంపుతున్నప్పుడు అపురూపంగా తులసి కొనిపించుకున్న చీరె. తన కోసం కళ్ళు

ఆందోళనతో వెతుకుతున్నాయి. ఆ కళ్ళలో భయం, ఆందోళన అంత దూరానికి కనిపించకపోయినా ఊహించుకోగలిగాడు. చంద్రుడు అంతకన్నా ఇన్నేళ్ళ కాపురంలో ఏం చూడగలిగాడు తను?

తులసి ఏడవగలదు. చాలా అందంగా కన్నీరు కారుస్తుంది. కార్చే కన్నీటినీ కంట తడిపెట్టుకునే ఇల్లాలినీ అభిమానించడం అలవాటు చేసుకున్నాడు ఇపుడిక.

చీకటి చిక్కబడింది. ఊరంతా దీపాల వెలుగులో మరింత ఎర్రగా కనిపిస్తూంది. అంత వెలుగు చంద్రుడు చూడలేదు. అందువల మెట్లు దిగిపోయాడు.

దగ్గరికి వచ్చాక, "ఎక్కడికి వెళ్ళారూ?" అంటూ పలకరించింది తులసి.

"ఏం?"

"కాఫీ తాగుతారని."

అప్పుడే ఎవరికి చెప్పిందో ఏమో - చల్లారిపోయిన కాఫీ పట్టుకుని - చల్లారిపోయిన జీవితం గడిపే ఓ ముసలి మొహం ఎదురుగా నిలబడింది. కాఫీ మీదా, తులసి మీదా విరక్తి కలిగింది.

"ఎన్నిసార్లు చెప్పాను, నా గురించి అలా పనులన్నీ నెత్తిన వేసుకోవద్దని! - నన్నేదో ఉద్ధరిస్తున్నట్టు ఈ పన్లు చెయకపోతే ఏం?"

"అదేమిటండీ ఆ మాత్రం...?"

"చప్, లోపలికి పోయి కూచో!"

వెయిటర్‌ని బతిమాలి రెండోతరగతి గదిలో ఆమె కూర్చోడానికి అనుమతి సంపాదించాడు చంద్రుడు. తన నలభై అయిదేళ్ళ జీవితంలోనూ తను ఆ గదిలో పదోవంతు స్థలంలో ఎన్నడూ కాపరం చెయ్యలేదు. అలాంటి విశ్రాంతి వద్దంటుందేం మొద్దు?

తులసికి కన్నీళ్ళు వచ్చాయి. అమ్మయ్య - ఇది పాత ప్రపంచమే!

మంగళసూత్రం కట్టిన మొదటి క్షణంలో, మొదటిసారి తన చేతి వంటని తినిపించే మొదటి రోజు కాపురంలో, జరగదనుకున్నా పూర్వ క్షణాలు కలసివచ్చి తల్లి అయిన క్షణాల్లో కసిరినప్పుడు, కొట్టినపుడు, తిట్టినప్పుడు - ఎప్పుడూ తులసి కళ్ళు చెమ్మగిలుతూనే ఉన్నాయి.

ఏదో భయాన్నుంచీ, బాధనుంచీ, అసంతృప్తి నుంచీ, కసినుంచీ ఆటవిడుపు అలా వెదుక్కున్నాడు చంద్రుడు. ఆమెని సాధించి ఆమె పడే దుఃఖం పట్ల సానుభూతి చూపడం అతనికి చాలా ఇష్టమైన పని.

చంద్రుడికి చాలా ఇరుకుగా, తనని గుర్తించకుండా ఉండే గడబిడ ప్రపంచంలో బ్రతకడమంటే సరదా. పదిమంది కలిసే చోట్లూ సినిమాహాళ్ళూ బాగా రద్దీగా ఉన్న మూడో తరగతి రైలు పెట్టెలూ అతన్ని తరుచు ఆకర్షించే స్థలాలు. అవకాశం ఉంటే - రూపాయి టిక్కెట్టు సినిమా చూస్తే అతనికి తోచదు. విశాలంగా ఉన్న సముద్రతీరానికి వెళ్ళి కూర్చోవడమంటే అతనికి భయం. చాలా ఖరీదయిన, పెద్ద ఇంపాలా కారులో తిరిగే గొప్పవాళ్ళని చూసి అతను చాలా జాలిపడేవాడు - చుట్టూ అంత తీరికనీ, వైశాల్యానీ ఉంచుకుని వాళ్ళంతా ఎట్లా బ్రతుకుతున్నారా అని. చాలా సార్లు చంద్రుడు తనకి అందమయిన భార్య దొరికినందుకు వెయ్యి దేముళ్ళకి మొక్కుకున్నాడు. అందమయిన భార్యలు ఏదో మైనారిటీ తరగతి మనుష్యులని అతని నమ్మకం.

చంద్రుడికి విశాలమయిన ఆకాశం మీద విసిరేసినట్టు పడివున్న చంద్రుడంటే తగని జాలి.

ప్లాట్‌ఫారం చివరికి వచ్చి నిలబడ్డాడు. దూరంగా షెడ్‌లో ఇంజన్లు అలసిపోయిన జీవితాల్లాగ ఆవిర్లు వదులుతూ నిలబడ్డాయి. అక్కడక్కడా తప్ప ఎక్కడా దీపాల్లేవు అటు వేపు. అంతా నల్లరంగు కుంచెతో గీసిన చిత్రంలాగ ఉంది. మధ్య మధ్య వెలుగుచారలు.

అందుకే అదంతా తనకు తెలిపిన ప్రపంచంలాగ కనిపించింది. ఎవరో కాకీ బట్టలాయన అటువేపు వచ్చాడు.

"భీమవరం నుంచి రైలు ఎప్పుడొస్తుంది సార్?" అన్నాడు. అలవాటయిన అణకువతో.

"తెల్లారే దాకా బండిలేదు."

వెనక్కి తిరిగి నడిచాడు. పదడుగులు వేసేసరికి దడదడా శబ్దం చేసుకుంటూ ఏదో రైలు ప్లాట్‌ఫారం మీదకి దూసుకు వచ్చింది. నిద్రపోతున్న సైన్యం మేల్కొన్నట్టు ఒక్కసారి ప్లాట్‌ఫారమ్ అంతా లేచింది.

రేగిన పుండు మీదనుంచి ఈగల్లాగ పెట్టెలనుంచి ప్రయాణికులు చెదిరిపోతున్నారు. ఆసక్తితో ఆవరించుకుంటున్న కొత్త ఈగల్లాగా కొందరు తోసుకు జొరబడుతున్నారు. దూరానికి చచ్చిపోయిన కొండ చిలవని మీదపడి తింటున్న చీమల్లాగ అన్ని వేపుల్నుంచీ ప్రయాణికులు రైలు చుటూ మూగారు.

మధ్య మధ్య "సోడా, కూల్ డ్రింక్!" అనే శ్రవణానందకరమయిన ధ్వనులు వినిపిస్తున్నాయి. పిల్లలు ఏడుస్తున్నారు. పెద్దలు కేకలు వేస్తున్నారు. కుర్రాళ్ళు ఈలలు వేస్తున్నారు. ఆడవాళ్ళు సిగ్గుపడుతున్నారు. అబ్బాయిలు దారి తప్పి పోతున్నారు. అమ్మాయిలు దారి వెతుక్కుంటున్నారు. చీరలు రెపరెపమంటున్నాయి. కళ్ళు మిలమిలలాడుతున్నాయి. చేతులు గలగల మంటున్నాయి

"జస్టెమినిట్"లూ, "థాంక్యూ సోమచ్"లూ వినిపిస్తున్నాయి.

జనం మధ్యకి వచ్చేశాడు చంద్రుడు. గుర్తుపట్టలేనంతగా ప్రజలలో కలిసిపోయాడు. ఇప్పుడు సుఖంగా ఉంది.

ఫస్ట్‌క్లాసు కంపార్ట్‌మెంటు దగ్గర చాలా మంది గుమిగూడారు. ఆ జనం మధ్య ఎవరయినా సొమ్మసిల్లిపోయారేమో అనుకున్నాడు చంద్రుడు. కానీ లేదు. చాలా ఖరీదయిన పెట్టెల్ని లోపల్నుంచి నలుగురయిదుగురు కూలీలు దింపుతున్నారు. అవి ఖరీదయిన మనుషులవని తెలియడానికి గాను తేలికగా ఉన్నా, ఇద్దరేసి పోర్టర్లు దింపుతున్నారు.

ఆ పెట్టెల వెనక ఓ సీతాకోక చిలుక బయటికి వచ్చింది. ఆ క్షణానికి ఎదురు చూస్తున్నట్టు కంపార్టుమెంటుకి ఎదురుగా నిలబడ్డ ఒకరిద్దరు పెద్దలు కారం తిన్న నోళ్ళు చప్పరించినట్టు గాలి పీల్చారు. నల్లద్దాల కళ్ళజోడు వెనకనుంచి మొదటిసారి ఈ ప్రపంచాన్ని చూస్తున్నట్టు విచిత్రంగా ప్లాట్‌ఫారం అంతగా గమనించింది ఆవిడ. ఎర్ర రంగు చీర, కెంపువన్నె బ్లౌజు, ఎర్రగా చేపల్లాగ మెలికలు తిరిగిన ఫ్రేములో గాగుల్స్, ఎర్రటి జల్తారు చెప్పులు - ఎర్రటి కంపార్టుమెంటులోంచి - అగ్ని శిఖలాగా బయటికి వచ్చింది. ఆ అందాన్ని అంతా గౌరవిస్తున్నట్టు క్షణకాలం నిశ్శబ్దమయారు. ఎవరో ముందుకు వచ్చి ఏదో ఇంగ్లీషులో అన్నారు. పొడుగాటి పమిట గాలికి ఎగిరేలాగ ప్లాట్‌ఫారమ్ మీదకి దూకింది ఆమె. శరీరంలోని వంపులన్నీ ఆ ఉదుటికి అలిసినట్టు ఊగాయి. అది చాలా వీరోచితమయిన కృత్యమయినట్టు అంతా ప్రశంసా పాత్రంగా ఆమెను గమనిస్తున్నారు. ఆమె వెనక నల్లటి కోటుతో మరొకాయన దిగాడు. జుత్తు దాదాపు ఊడిపోయింది. ప్లాట్‌ఫారమంతా లైట్ల వెలుగున్నా అతనూ గాగుల్స్ పెట్టుకున్నాడు. మెడకి ఓ ట్రాన్సిస్టరూ, కెమెరా, ఒక ఫ్లాస్కు - ఇలాంటి వేవో రకరకాలు వేళ్ళాడుతున్నాయి. బరువయిన శరీరం నల్లటి కోటునీ, వెనుక ఉన్న తెల్లటి చొక్కానీ తోసుకువస్తూ పెద్ద పొట్ట - అధికారానికి, సోమరితనానికి చిహ్నంలాగా కనిపించింది.

ప్లాట్‌ఫారం మీదకి దిగి తనకోసం వచ్చిన వాళ్ళని ఒక్క చిరునవ్వుతో పలకరించాడు. తరువాత పరివారం పరివారమంతా కదిలింది. అదేదో వింతలాగా చూస్తూ నిలబడిపోయాడు చంద్రుడు. ఎందుకో ఆ దృశ్యం తనని చాలా ఆకర్షించింది. అంత తీరిక, అంత ప్రత్యేకతా అతణ్ణి భయపెట్టే సామాన్య గుణాలు. కాని వీళ్ళిద్దరూ ఏంచేతనో అతణ్ణి ఆకర్షించారు.

దొరగారి కుక్కపిల్ల అందంగా ఉందికదా అని ఎవరో కిందకి వంగి అరటిపండు అందించారు. అది తనకి అవమానంగా భావించి కుక్కపిల్ల అతని వేలు కరిచింది. ఆ పెద్దమనిషి కుక్కలాగ మూలిగాడు.

చాలామంది లుంగీలతోనూ, బనీన్లతోనూ భోజనానికి పరిగెత్తుతున్నారు. కొందరు తమ ఇళ్ళల్లో వంటింట్లో ఉన్నట్లుగానే తువాళ్ళతో, మరచెంబుల్తో పచార్లు చేస్తున్నారు. ఒక అరవాయన - అరవం అర్థంకాదని రూఢిగా తేల్చుకుని - ఒక పోర్టర్‌ని అరవంలో తిడుతున్నాడు. అవి ఫస్ట్‌క్లాసు ప్యాసింజరు తిట్లు కనక మౌనంగా భరిస్తున్నాడా పోర్టరు.

వెయిటింగ్ రూములు మనుషులతో నిండుతున్నాయి - వెజిటేరియన్ కాంటిన్‌లో మసాలా గారె వాసన గుప్పుమంది - భోజనం పొట్లాలు తింటున్న కుర్రవాడిని - ఆకలితో గమనిస్తోంది కుక్క.

ఈ రైలు మెయిలంటూ గుర్తుచేస్తోంది, మైకులో మొగకంఠం గల ఆడమనిషి ఒకావిడ. మరేదో ఫ్లాట్‌ఫారం మీద గంట మ్రోగితే - సగం తింటున్న పూరీని కుక్కమీద విసిరేసి ఒక మిల్రటీ మనిషి చటుక్కున రైలెక్కేశాడు. రైలు ఎంతకీ కదలక పోయేసరికి - ఆప్యాయంగా పూరీ తింటున్న కుక్కని గుర్రుగా చూస్తూ నిలబడ్డాడు.

రైలు - కిటకిటలాడే మనుషులతో - ఎన్నో ఈగల్ని కడుపులో పెట్టుకుని ఆయాసపడుతున్న బల్లి లాగ నిలబడింది.

వెయిటింగ్ రూంలోకి తొంగిచూస్తే - ఎదుటి ప్రయాణికుల అమ్మాయిల చేతుల్లో ఎగిరే ఆటబొమ్మని చూస్తూ తులసి కనిపించింది. దాని దృష్టంతా ఎగిరే ఆటబొమ్మ కాళ్ళ మీద ఉంది. కాళ్ళు కదుపుతూ డాన్స్ చేస్తోంది బొమ్మ.

ఆ అమ్మాయిని పిలిచి - 'కీ' ఇచ్చి బొమ్మని నడిపించింది తులసి. ఆ బొమ్మ బాగోలేదని ఆ అమ్మాయెవరో ఏడుస్తోంది. మరీ ముతకగా ఉన్న ఓ ముసలావిడ - తల్లి కాబోలు - అమ్మాయిని ఓదార్చబోయింది. అమ్మాయి ఏడుస్తోంది.

"చూడమ్మా - బొమ్మ ఎంచక్కా నడుస్తోందో!" అంది తులసి ఆ అమ్మాయిని దగరకు తీసుకుని.

"నాకదంటే డోకు - నడిస్తే గొప్పేం?" అంది అమ్మాయి.

"గొప్పేనమ్మా - మరి నాకు కాళ్ళు లేవుగా? నేను చూడు నడుస్తున్నానా??" అంది తులసి.

పాప ఆశ్చర్యంగా తులసి కాళ్ళని గమనిస్తోంది. తులసి కూర్చున్న ఖరీదయిన మూడు చక్రాల బండినీ, ఖరీదయిన మూడు చక్రాల బండిమీద బీదరికం మూర్తీభవించినట్టు కూర్చున్న తులసినీ ఆశ్చర్యంగా గమనిస్తోంది.

ఆ మాటలకి గదిలో అంతా తులసివేపు చూశారు. కాని, తులసి సిగ్గుపడలేదు.

"ఛీ! చవట పీనుగు!" అనుకున్నాడు చంద్రుడు.

పాపని బండిమీదకి ఎక్కించుకుని గదంతా తిప్పింది. జాలిగా అంతా తులసినే చూశారు. ఎవరినోటంటా మాట రాలేదు. పాప ఏడుపు సంతోషంగా మారింది.

"ఈ అవలక్షణం ఒకరి దుఃఖాన్నయినా పోగొట్టగలిగిందా భగవాన్! " అనుకుంది తులసి.

ఈ కుంటితనానికి ఈ చిన్న ప్రయోజనమయినా ఇవాళ కలిసొచ్చింది. నవ్వుకుంది. ఆ నవ్వులో దుఃఖం ఉంది కాబోలు - కళ్ళు తడిశాయి.

ఆమెకి కనిపించకుండా పక్కకి తప్పుకున్నాడు చంద్రుడు. ఆమె దుఃఖం, ఆమె కుంటితనం, తన బీద బ్రతుకు - జీవితంలో నిరాడంబరతని గుర్తుచేస్తోంది. తనకి లభించిన ఇరుకు బ్రతుకులోనే నిండుదనం ఉన్నదనిపిస్తుంది

చంద్రుడు జీవితంలో కొనుక్కున్న చాలా ఖరీదయిన వస్తువు తులసి కూచున్న మూడు చక్రాలబండి. ఆమెను అతను తిట్టే తిట్లలో కన్నా - ఆమూడు చక్రాలబండి కొనడానికి అతను పడ్డ శ్రమలో ఆ సంసారంలోని తియ్యదనం ఎక్కువ అర్థమవుతుంది.

ఎవరయినా ఏబ్‌స్ట్రాక్ట్ పెయింటర్‌ని చంద్రుడి జీవితాన్ని చిత్రించి చూపించమంటే - మరీ రద్దీగా ఉన్న బస్‌స్టాండో రైలు కంపార్ట్‌మెంటో వేసి - దాని మధ్య అందమయిన మూడు చక్రాల బండి వేస్తాడు. ఆ చిత్రం వాళ్ళ జీవితాల్నీ, భార్యా భర్తల స్వరూప స్వభావాల్నీ చెప్పక చెపుతుంది.

రెండు చేతులనిండా అదిమి పట్టుకున్నా జారిపడేటన్ని ఆపిల్ పళ్ళని పట్టుకుని ఇటువేపే నడుస్తోంది - ఇందాక రైలుపెట్టెలోంచి దిగిన సీతాకోకచిలుక. ఆమె చుట్టూ మనుషులున్నారు. పక్కని భర్త ఉన్నాడు. ముందు పోర్టర్లున్నారు. కాని, ఆపిల్ పళ్ళని తొణికేలా పట్టుకు నడిచే నాజూకుతనాన్ని ఆమె వదులుకోదలచుకోలేదు.

ఆమె గాగుల్స్ తీసేసింది. పెద్ద కళ్ళు. జాలరి వలలోంచి గెంతి బయట పడడానికి తన్నుకులాడుతున్న మెరిసే చేపల్లాగ ఉన్నాయి. పెదాలకి ఇప్పుడు అందం పెరిగింది. ఆ పెదాల్లో పట్టుదల, పొగరు మరింత కొట్టవచ్చినట్టు కనిపించింది. తన ముందునుంచి వెళుతుంటే చంద్రుడు పక్కకి తప్పుకు నిలబడ్డాడు. దగ్గరగా వచ్చినప్పుడు చెవిదగ్గర పెద్ద పుటుమచ్చ కనిపించింది.

ఒక్క క్షణం తుళ్ళిపడ్డాడు. అలాంటి పుట్టుమచ్చ ఎక్కడో ఎప్పుడో చూసిన గుర్తు.

కాని, - ఇటు తిరిగితే, - "ఎటు డార్లింగ్?" అంటూ ఆవిడా ఆగి ఇటు చూసింది. ఇప్పుడు ఆ కోలముఖం మరీ గుర్తుపట్టించింది. ఆ అమ్మాయి తనకి తెలుసు!! ఎక్కడో చూశాడు. ఎప్పుడో ఆమెతో మాట్లాడాడు కానీ, ఆ వ్యక్తిపేరు గుర్తురావడం లేదు.

పాత జ్ఞాపకాలతో అలసి పోయిన మనస్సు గుంజాటన పడుతోంది.

ఆ పొగరూ, ఆ కోలముఖం, ఆ కళ్ళూ - చెవి దగ్గర అంత పుట్టుమచ్చా - అవును - ఇరవై సంవత్సరాల వెనక్కి పోయింది మనస్సు. ఇప్పుడు గుర్తుకు వచ్చింది - ఆవిడ పేరు - వలజ! - అవును - వలజే!

ఆశ్చర్యంగా, ఆతృతగా ఆమెను మరొక్కసారి చూడాలని ఉత్సాహపడబోయేసరికే ఆమె మాయమయింది.!!

***

## 2

**చోడవరానికి** ఆరుమైళ్ళ దూరంలో ఒకానొక పల్లెటూళ్ళో నలభై అయిదేళ్ళ క్రితం శ్రీరామ నవమినాడు ఓ కుర్రాడు పుట్టాడు. వాళ్ళ నాన్న బడిపంతులయినా కొడుకు తాసిల్దారు కావాలని ఆ రోజుల్లో కలలుకనేవాడు. కాని, ఆ కలలు ఆయన మూడేళ్ళే కని ఒకరోజు కలలు కంటూనే కళ్ళు మూశాడు. బడి పంతులు ఆనవాయితీ ప్రకారం అందమయిన కలల్నీ, అచ్చమయిన దారిద్ర్యాన్నీ - తాసిల్దారు కావలసిన కొడుక్కీ, ముప్పై అయిదేళ్ళ పెళ్ళానికీ వారసత్వంగా అప్పగించి పోయాడు. అంతవరకూ అప్పల నరసింహంగారంటే ఆ ఊళ్ళో అందరికీ ప్రాణం - ఆ ఊళ్ళో ఓ రామమందిరం కట్టించాడాయన - బీదవాడు కనక. వాళ్ళ నాన్న ఆయనకో ఇల్లిచ్చి పోతే ఆ ఇంటిని బడిచేసి - ఆ ఊరి పిల్లలందరికీ పాఠాలు చెప్పాడు.కాని తన కొడుక్కి చెప్పడానికి వేళ మించిపోయిందతనకి.

బడి తెరిచిన మొదటి రోజుల్లో ఆయన దగ్గర పాఠాలు నేర్చుకున్న కుర్రాళ్ళు ఎదిగి ఆ ఊరికి కరణమూ, మునసబూ అయి - ఆయన కన్ను మూశాడనగానే ఆ ఇంటిని ఆదుకునే దెలాగా అని మీమాంసలో పడ్డారు. తాహతులేని సాయం, అవసరంలేని ఆదా నేర్పలేదు పెద్దాయన బ్రతికున్నన్నాళ్ళూ. ఆ ఇల్లాల్ని నూతికి నీరు తోడుకోడానికి వచ్చే పార్వతిదేవిగానే ప్రజలు ఎరుగుదురు, ఇప్పుడావిడ వీధి చూడడంలేదు. కొడుకు అన్నం కలిపి తినిపిస్తేనే తినే స్థితిలో ఉన్నాడింకా. స్నేహితులంతా గింజుకులాడారు. ఆఖరికి ఒకాయనకి ఆలోచన తట్టింది.

సాయంకాలం ఎప్పుడన్నా ఆ ఇంటికి ముందు నుంచి నడిచేటప్పుడు - గంధర్వులు ప్రత్యక్షమయినట్టు - పార్వతమ్మ పాట చెవులబడేది. ఆ గొంతు తియ్యదనం రుచి పరోక్షంగా పల్లె పల్లెంతటికీ తెలుసు. ఆమె గొంతులో మమతల మాధుర్యమంతా రాశీ భూతమయినట్టు తోచేది. ఆ పల్లె పల్లెంతటికీ ఆమె ఓ కనిపించని దేవత. పార్వతమ్మ దగ్గర పాత హార్మోనియం కూడా ఉంది. ఎప్పుడయినా తీరిక కలిగితే వచ్చిన కీర్తనలు వాయించుకునేది. ఆమె గొంతులో త్యాగయ్య స్వచ్ఛంగా, పారవశ్యంతో పలికేవాడు.

ఆ తియ్యదనానికి విలువ కట్టకపోయినా, ఆ పాటలయినా పిల్లలికి నేర్పితే - ఆ మిషమీద వాళ్ళిద్దర్నీ సాకవచ్చునని పెద్దలు భావించారు. ఆడవాళ్ళని పంపించి ఆమె చేత సరేననిపించారు.

ఎప్పుడో మధ్యాహ్నం పూటో సాయంత్రమో నలుగురయిదుగురు పిల్లలు ఆమె చుట్టూ చేరేవాళ్ళు. మరిచిపోయిన పిళ్ళారి గీతాలు, సరళీ స్వరాలు, జంటస్వరాలు, మళ్ళీ ఆ పాత హార్మోనియం మీద పలికించేది పార్వతమ్మ గొంతు గంధర్వగానం చేస్తున్నా - హార్మోనియం జీవితంలోని అపశ్రుతిని అపస్మారంగా పలుకుతుండేది. ఆమె సంగీతానికి ఏకలవ్య శిష్యుడు రామచంద్రుడు. ఆ చిన్న గుడిసెలో ఆమె గొంతు తీపినే ఊపిరిగా పోసుకుని పెరిగాడు చంద్రుడు. ఆ పాటలో అతనికి చెప్పరాని దైన్యమూ ఆపుకోలేని దుఃఖమూ ధ్వనించేవి. ఎందుకో అతనికి అర్థం చేసుకునే వయస్సు చాలదు. అయినా ఒక్కోసారి తల్లి తొడమీద తల ఆనించుకుని అలా పాట వింటూ పడుకునేవాడు. ఆ పాట విశాలంగా ఆకాశంలో తేలిపోతున్నట్టుండేది కాదు. ఇరుకుగా, సంకుచితంగా ఉన్న జీవితాన్ని సర్ది చెపుతున్నట్టుండేది. స్వేచ్ఛగా, నిరాటంకంగా సాగేది కాదు - నిరాడంబరంగా, సాధువుగా వినిపించేది.

ఆ హార్మోనియం పెట్టె, అపురూపమయిన ఆ కంఠంలో ఓదార్పు మధ్యనుంచి - తాసిల్దారు కావలసిన అబ్బాయి బ్రతుకు పన్నెండేళ్ళు గడిచింది. సంగీతం చెప్పుకునే అమ్మాయిలు పెళ్ళిళ్ళు చేసుకుని అత్తవారిళ్ళకు వెళ్ళిపోయారు.

పల్లెటూరి జీవితం గిడసబారి గజిబిజి అయింది. పదేళ్ళ కిందటి పెద్దల వితరణ పాతబడిపోయింది. పార్వతమ్మకి సాయం చేసేందుకు సానుభూతితో పెద్దలు ప్రారంభం చేయించిన ఈ వ్యాసాంగం ఇప్పుడామెకు వృత్తిగా, వ్యాపకంగా స్థిరపడింది. ఇప్పుడు సంగీతం పాఠాలు వెదుక్కోవలసిన అవసరం ఏర్పడింది. వయస్సు ముదిరింది. గొంతు తేలికయి, తీపి పలుచనయింది.

ఆ రోజుల్లో పల్లెకి అసింటా ఓ టూరింగ్ సినిమా హాలు వెలిసింది. వేలం వెర్రిగా ప్రజలు వచ్చేవారు. సతీసావిత్రి, దశావతారాలూ, భక్తప్రహ్లాదలాంటి బయస్కోపుల్ని విరగబడి చూసేవారు. దాని యజమాని కాంతయ్యగారని వ్యవసాయం ఎదురు తిరిగిన ఓ మోతుబరి. కాంతయ్యగారు చిన్నప్పటినుంచీ జులాయి కోరు. తిరుగుళ్ళు మరిగి, వాళ్ళనాన్న చచ్చిపోయేదాకా ఆగి, ఆయన అటుపోగానే పొలాన్ని అమ్మి, కలకత్తావెళ్ళి - ఒక చిన్న టూరింగు సినిమాకి సరంజామా అంతా కొనుక్కుని వచ్చాడు. వ్యవసాయం పోతే పోయింది కాని, వ్యాపారం బాగా కలిసివచ్చింది. బాగా డబ్బు చేసుకున్నాడు. డబ్బుతోపాటు ఖరీదయిన జబ్బులూ కలిసివచ్చాయి. అప్పుడిక ఇక్కడికి వచ్చి దాదాపు స్థిరపడ్డాడు. ఆయన పెళ్ళాం అర్థంకాని దేదో రోగమొచ్చి హఠాత్తుగా చచ్చిపోతే.. మిగిలిన ఒక్కగానొక్క అమ్మాయిని అతిగారాబంగా పెంచడానికి అయిదుగురు మనుషుల్ని పెట్టాడు. మితి మీరిన డబ్బు ముసలాడిలో రోగంగా ప్రతిఫలించినట్టు, కూతురులో పొగరుగానూ, అనవసరమయిన 'కొవ్వు'గానూ కూడదీసుకుంది. గిడసబారిన జొన్నకంకిలాగ ఎర్రగా, బిరుసుగా, నిండుగా, నిటారుగా పెరిగింది వలజ. (ఆ రోజుల్లో ఆయన్ని ఆశ్రయించుకుని బ్రతికిన కొందరు 'కవిగాళ్ళు' ఆ అమ్మాయికి శబ్దార్థ చంద్రిక వెదికి అలాంటి నామకరణం చేయించారు "వలజ అనగా మంచి చూపుగల యాడుది" అని అర్థం. లఘు శబ్దార్థ దీపిక) కాంతయ్యగారు ఆ అమ్మాయి కోసమని గుర్రాన్ని తెప్పించి గుర్రపు స్వారీ నేర్పించారు. మంచి జీనుతో గుర్రం ఠీవిగా నిండుగా ఉండేది. నౌకరు వలజని ఎక్కించి పల్లె అంతా తిప్పుతుంటే కోతి గుర్రం మీద ఎక్కి సర్కసు చేస్తున్నట్టుండేది. శరీరం వయస్సుకి మించి పెరిగి - మాట - ఆ శరీరంలోంచి ఏమూలనుంచో వస్తున్నట్టుగా సన్నగా కీచుమంటూ ఉండేది కాని, వలజవి అందమయిన కళ్ళు. పేరుకు తగ్గట్టు బాణంలాగ దూసుకుపోయేటట్టు చూసేది.

ఓ రోజు గుర్రపుస్వారీకని పల్లెలోకొచ్చి పార్వతమ్మ పాట వింది వలజ. ఆ సాయంకాలమే తండ్రి దగ్గరికిపోయి మారాం చేసింది పాట నేర్చుకుంటానని. మరునాడే పార్వతమ్మ కోసం కాంతయ్యగారు గుర్రబ్బగ్గీ పంపిస్తే ఊరంతా విరగబడి చూశారు - రాజాంతఃపురం నుంచి ముత్యాలపల్లకీ వచ్చినట్టు. కాని, పార్వతమ్మ కదల్లేదు. బయటికి పోయి పాఠం చెప్పే అలవాటు లేదని కబురు పంపింది కాంతయ్యగారు నల్లమందు నిషాలో ఈ మాట విని నల్లత్రాచయిపోయారు. "సంగీత పాఠాలు చెప్పుకొనేదానికి ఇంత నీలుగా?" అన్నారు.

కాని పల్లెటూరిలో పాతమనుషులు కొందరు ఆ కుటుంబం మర్యాద తెలియజేయగా, కాస్త నిలదొక్కుకుని - డబ్బు ఆశ చూపించారు. కాని, పార్వతమ్మ కదల్లేదు. పార్వతమ్మ కాదంటున్న కొద్దీ కాంతయ్యగారికి పౌరుషమూ, వలజకి ఆమె దగ్గిరే సంగీతం నేర్చుకోవాలన్న పట్టుదలా పెరిగాయి.

కాంతయ్యగారు చండశాసనుడనీ, తల్చుకుంటే పార్వతమ్మను 'చెర' బట్టగలడనీ - అప్పటి బయస్కోపు భాషలో పల్లెటూరి ప్రజలంతా చెప్పుకున్నారు. అదో 'అభినవ బాలనాగమ్మ' కథలాగ ఆ నోటా ఆ నోటా ఊరంతా పాకింది.

ఆ రోజుల్లోనే ఊరికి మరోవేపు మరో టూరింగు సినిమా వెలిసింది. అదీ ముమ్మరంగా డబ్బు చేసుకోవడం ప్రారంభించింది. ప్రజలు సగానికి సగం అటు మళ్ళిపోతున్నారు. కాంతయ్య చండశాసనుడేమో కాని తెలివి తక్కువ వాడేం కాదు. ఊరంతా ఈ విషయం పాకకపోతే వాళ్ళు అనుకున్నంతపనీ చేసేవాడేమోకాని, తీరా నలుగురికీ తెలిశాక తను ఏదైనా చేస్తే వ్యాపారం దెబ్బతింటుందని గ్రహించాడు. అందుకని 'షాక్ టాక్టిక్స్' ఉపయోగించి ప్రజలలో వ్యాపించిపోయిన తన దుర్మార్గాన్ని 'కాష్' చేసుకున్నాడు. ఒకరోజు గుర్రబ్బగ్గీలో అమ్మాయితో సహా వచ్చి - ఊళ్ళోని పెద్దల్ని పోగు చేసి - వాళ్ళని వెంటబట్టుకుని పార్వతమ్మ ఇంటికి వచ్చాడు. ఆమెకు అతివినయంగా నమస్కారం చేసి అర్ధనూటపదహార్లు గడపమీద ఉంచి తనకూతురికి ఇంటి దగ్గరే పాఠం చెప్పమని వేడుకున్నాడు.

ఊరు ఊరంతా ఈ కథని మరింత ముచ్చటగా చెప్పుకున్నారు. పులి అని భయపడ్డ జంతువే పిల్లి అయిపోయిందని, అది పార్వతమ్మ మహిమేనని అంతా మరీ మరీ అనుకున్నారు.

ఈ కథకు మరింత ప్రచారాన్ని ఇప్పించాడు కాంతయ్య - నలుగురు మనుషుల్ని పురమాయించి తన్మూలంగా పార్వతమ్మ నిజాయితీకి పరపతి పెరిగినట్టే. కాంతయ్య ఔదార్యానికి ఆదరణ వచ్చింది కాంపిటీషన్ టూరింగ్ సినిమాకి వెళ్ళే మనుషులు కూడా ఈ ఆదరణని 'పేట్రనయిజ్' చేశారు. క్రమంగా జనం అంతా అటునుంచీ అటు మళ్ళిపోయారు. నెలరోజులు తిరగకుండా టూరింగ్ హాలు ఎత్తించేశాడు కాంతయ్య.

అప్పుడు వలజకి ఎనిమిదేళ్ళు.

## 3

**మంత్రిగారు వెళ్ళిపోయాక** వెనక మిగిలిపోయిన హంగుదార్లలాగ ప్రయాణికులంతా ఎవరి సర్దుబాట్లు వాళ్ళు చేసుకుంటున్నారు. రైలు వెళ్ళిపోయాక, అధికార్లని వదిలించుకున్న ఉద్యోగుల మార్పులూ, బదిలీ అయిన భర్తల తాత్కాలిక ఎడబాటుకి తపనపడే ఇల్లాళ్ళూ, క్యాంపువెళ్ళిన మంత్రిగారినుంచీ తాత్కాలికంగా విముక్తి పొందిన సెక్రటరీలూ వ్యాపారస్తుల వాటాదార్లూ వెకేషన్‌కి ఇంటికి వెళుతున్న ప్రియురాళ్ళూ, ఆఫీసర్లూ గుమాస్తాగాళ్ళూ, బంట్రోతులూ, బ్రోకర్లూ, లాయర్లూ, రౌడీలూ, రంగేళీలూ, నాటకాలవాళ్ళూ, నాటురకం రైతులూ, రేషన్ ఉద్యోగులూ, బ్రోతల్ కంట్రాక్టర్లు, పోరంబోకులూ, బోడిముండలూ, కిరాయి మనుషులూ, కిలాడీ పురుషులూ సమకాలీన సాంఘిక జీవనానికి సజీవ ప్రతిబింబంలాగ ఉంది విజయవాడ రైల్వేస్టేషన్. చంద్రిగాడు గాంధీ కొండమీద కొక్కిరాయిలాగ కనిపిస్తున్నాడు.

చంద్రుడికి ఆకలి వేస్తోంది. అంతా అయిపోయిన, కాంటిన్ ప్లేట్లలో అడుగున మిగిలిపోయిన రెండు పూరీల్ని కొనుక్కుని ఆకలిని చంపుకున్నాడు. తులసి ఒక పూట భోజనం చెయ్యదు. వాళ్ళాయన కోపం తగ్గించాలని భగవంతుడికి మొక్కుకుని - రాత్రివేళ భోజనాన్ని దాదాపు ఆరేళ్ళ కిందటే మానేసింది. చంద్రుడి కోపం మాట దేవుడెరుగు కాని, అతనికి ఖర్చుమాత్రం తగ్గింది.

"తినకపోతే ఏడవమను వెధవ పీనుగుని" అని చాలాసార్లు అనుకున్నాడు చంద్రుడు. - అలా తన కసిని వెల్లడించుకోడానికి భార్య ఒక 'అవకాశం'గా దొరికినందుకు సంతోషిస్తూ, అదేకాని అందమయిన, కాళ్ళున్న భార్య అయితే ఆ మాట అనగలడా!

రైల్వే ప్లాట్ ఫారమ్ మేడ మొదటి అంతస్తులో ఇంకా అలజడిగా ఉంది - కాంటిన్‌లో "పొటాటో కర్రీ - చిప్స్ - సాస్ - డబుల్ కర్డ్" అని ఎవరో అరుస్తున్నారు. ఒకరిద్దరు పోర్టర్లు, ఒక తెల్లబట్టలు వేసుకున్న నల్లఫ్యూన్ పరిగెత్తుతున్నారు.

ఆ ఫ్యూన్‌ని ఆపి అడిగితే, "ఏమి సార్! ఉంగళుకు ఏమి తెరియుం? - పెద్ద ప్రొడ్యూసర్ దా మేడమీద దిగిరి. ఏర్ కండిషన్డ్ రూంలో ఉంటారు నెంబరు ఫోర్టీన్." అన్నాడు.

చంద్రుడికి అర్ధమయింది. ముందు ఉన్న బట్టతల గల పొట్టి మనిషి ప్రొడ్యూసర్.

"ఆయనతో ఉన్న ఆడమనిషి?"

"ఏమిసార్! అట్టా అడుగుతారు. ఆమె మిసెస్‌దా"

"వేలుపిళ్ళే!" అని ఓ బొంగురు గొంతు మేడమీంచి పిల్చింది ఫ్యూన్ గడగడలాడుతూ, "వస్తును సామీ!" అంటూ పరిగెత్తాడు.

చంద్రుడికి ఆసక్తి మరీ ఎక్కువయింది. తను ఎరిగిన వలజకీ, ఇప్పటి వలజకీ మధ్య - తనకు తెలియని పదహారేళ్ళు పైబడిన చరిత్ర ఉంది.

ఈ వ్యవధి ఆమె శరీరాన్ని మరింత పెంచిందనిపించింది. వలజ వయస్సు అధికారాన్ని రెట్టించి, అందన్ని మరింత కుదించింది.

కాంటిన్ డబ్బాలోంచి విస్తరాకుల్ని ఏరుకుని మెతుకుల్ని తింటున్న బిచ్చగాళ్ళమీద ఉన్నట్టుండి ఓ నల్లటి మేనేజరు రూళ్ళ కర్రతో విరుచుకుపడ్డాడు. ఎవరి నడుమో ఫెళ్ళుమంది. కెవ్వుమని అరిచాడు రివటలాగ ఉన్న బిచ్చగాడు. మరో దెబ్బ పడబోతే దండం పెట్టి కాళ్ళుపట్టుకున్నాడు.

"దొంగలంజకొడుకా! ప్లాట్‌ఫారం పాడు చేస్తావా - విసరాకుల్ని బయటికి లాగి?" అని తిడుతున్నాడు మేనేజరు."తమ ఆకలికి విస్తరాకులయినా వినియోగపడలేదే!` అని బెంగటిల్లిపోయి చూస్తున్నారు దూరంగా పారిపోయిన బిచ్చగాళ్ళు. "ఏం చేస్తారు సార్ వాటిని? పోనీ తిననివ్వండి. పూర్ క్రీచర్స్" అన్నాడొక ముసలి ప్రయాణికుడు.

"మీకేం సార్! మీరలాగే చెపుతారు. ఆ పుల్లి విస్తరాకులు గవర్నమెంటు ప్రాపర్టీ. సీమపందులకి ఆ వేస్టంతా బ్రహ్మాండమయిన ఫుడ్ ఆ వేస్ట్‌కి టెండర్లు పంపి కాంట్రాక్టు తీసుకున్నవాళ్ళున్నారు." అన్నాడాయన.

ప్రశ్న వేసిన ముసలాయన పందులకు మారుగా బిచ్చగాళ్ళకు అవకాశం ఇమ్మని ఎలా చెప్పాలో తెలీక బిక్కచచ్చిపోయాడు.

ప్లాట్‌ఫారం మీద రద్దీ మరింత తగ్గిపోయింది. మరేదో రైలు కోసం ఎదుటి ప్లాట్‌ఫారం మీద మనుషులు కూడుకుంటున్నారు. విజయవాడలోని రాత్రి జీవితానికి చాటు తెరపట్టినట్టు గాంధీ పర్వతం గంభీరంగా నిలబడింది....

చంద్రుడు ఏమీ తోచక తన బరువు చూసుకున్నాడు - బరువు తూచుకునే మిషన్ ఎక్కి - ఏభై తొమ్మిది కేజీలు. వెనక పొడుగాటి వాక్యం ఉంది. "సమస్యలపట్ల సమగ్రమయిన ఆకళింపు, సమన్వయం గల వ్యక్తిత్వం - ఔదార్యంగల హృదయం" - అంతా శుద్ధ అబద్ధం - సమస్యల్ని సమన్వయించుకోగలిగితే - ఆ మేడమీద ఏర్ కండిషన్డ్ రూంలో తను ఉండవలసింది. హృదయం ఉంటే తులసిని మరింత అభిమానించ వలసింది. తనంటే తులసి భయపడిపోతుంది తన మాటంటే వణుకుతుంది. కాని, తనకోసం ప్రాణమయినా ఇస్తుంది. తమ సంసారంలో ఈ అన్యోన్యత ఇంతవరకు `వన్‌వే ట్రాఫిక్` గానే ఉంది.

బట్టతల ప్రొడ్యూసర్ బయటికి వెళుతున్నాడు. చంద్రుడు పరికించి చూసి రిచ్చపోయాడు. అతణ్ణి ఎక్కడో చూసినట్టుంది. ఆ పొడుగాటి ముకు, లోతుకు పోయిన చీపికళ్ళు, విశాలమయిన నుదురూ - ఆ పొట్టమాత్రం కొత్తం.

బయటకి వెళ్ళే మెట్లవరకూ చెయ్యి పట్టుకు నడిచి వచ్చింది వలజ. అసలు ఆమె ఉనికిని కూడా గమనించకుండా నడిచిపోతున్నాడు ఆయన. వెనక ఒక తడిక బుట్టతో వేలు పిళ్ళే.

"త్వరగా తిరిగి రా డార్లింగ్! ఒంటరిగా వెయిట్ చేయలేను," అంటోంది వలజ -

"ఊఁ" అన్నాడో, తల ఊపాడో కాని, మెట్లు గబగబా రెండేసి ఎక్కాడు. అతని వెనకే మరెవరో పెద్దమనిషి పరిగెడుతున్నాడు. చూస్తుండగానే కుడివైపు తిరిగి వంతెనమీద మాయమయాడు.

వలజ ముఖంలో ప్రయాణపు బడలిక కనిపించింది - తాజాగా తయారు చేసిన మిఠాయి మీద ఈగల్లాగ - ఆమె చుట్టూ ఇద్దరు ముగ్గురు పోర్టర్లు - అంగరక్షకుల్లాగ నడుస్తున్నారు.

ఆమె నడకలో నిర్లక్ష్యం ఉంది. అది అనుభవం వల్లనో, అవసరం వల్లనో తెచ్చిపెట్టుకున్నట్టుగా ఉంది కాని, స్వచ్ఛమైనదిగా లేదు.

రెండడుగులు ముందుకువేసి ఆమె దృష్టిలో పడేటట్టు నడిచాడు చంద్రుడు. ఆమె దృష్టి పడిందో, పడిజారిపోయిందో కాని ఆమె పలకరించలేదు. అయినా, ఆశ్చర్యపడలేదు చంద్రుడు. మాసిన పాతపంచ, నలిగిన నల్లటి చొక్కా, క్రాపింగూ, కళ్ళజోడూ ఆమెకి పదహారేళ్ళ కిందటి పరిచయాన్ని గుర్తుచెయ్యకపోవచ్చు. అయినా అప్పటి వ్యక్తి ఇలా తటస్థ పడతాడని ఆమెకి ఆ క్షణంలో తోచక పోవచ్చు.

ఆమె మేడమెట్లు ఎక్కేచోట పలకరించాలని తొందర పడ్డాడు చంద్రుడు. గబగబా పది అంగల్లో రెండు పక్క స్థంభాలు దాటి - మెట్ల వారకి వచ్చిపడి నిలబడ్డాడు. ఆమె దగ్గరకి రాగానే కొన్ని సంవత్సరాలుగా సన్నిహితంగా ఉన్న వ్యక్తిని ఎలా పలకరించాలో తెలీక తత్తరపడిపోయాడు చంద్రుడు.

చివరికి 'మేడమ్' అన్నాడు - ఆఫీసర్ల భార్యల్ని పిలవడానికి అలవాటు పడిన భాషలో.

కొందరిని ఎదుటి వ్యక్తి నేలకి తొక్కి పలకరిస్తే, కొందరిని ఎదుటివ్యక్తి ఆకాశానికి ఎత్తి నిలబెడతాడు.

"రిక్షా కడతావురా అబ్బీ!" అంటే -

"కడతా బాబూ!" అంటాడు రిక్షావాడు.

"టైమెంతయింది సార్!" అన్నారో -

"ఎవడు చెపుతాడయ్యా!" అనొచ్చు.

"మేడమ్" అనడంలో ఆమె ఔన్నత్యాన్ని గుర్తుచేసి నట్టయింది. ఆ పిలిచినవాడు తన స్థాయి తనే నిర్ణయించుకున్నట్టయింది.

"యస్?" అంది కళ్ళు ఇటు తిప్పి - నగిషీలు చెక్కిన కూజాలో ఎక్కడో మిలమిలలాడుతున్న చేపల్లాగ మెరిశాయి కళ్ళు. ఆ కళ్ళలో ఠీవికి వణికిపోయాడు చంద్రుడు. ఆ నీడలో పంచెకట్టుకు వణికిన ఓ నలభై ఏళ్ళ ముసిలి గొంతు - ఏదో కోరికను కోరే నౌఖరు గొంతులాగ ధ్వనించింది. ఆమె పక్కన ఇంకా పరివారం ఉంది. - ఇట్లా ఆమెను ఆపడం వాళ్ళు సహించనట్టూ తెలుస్తోంది. ఆమె ఆగకపోతే అతణ్ణి రెక్క పట్టుకు బలంగా పక్కకి తోయాలన్నంత ఉద్వేగం ఆ మనుషుల్లో కనిపించింది.

ఆమె ప్రశ్నకి సమాధానం రాకపోయేసరికి - ఆమె ఒక్క క్షణం ఆగి చరచరా మెట్లు ఎక్కింది. అంతవరకూ ఆమెలో ఉన్న నిలకడకీ, ఇప్పటి వేగానికీ అక్కడ ఉన్న వాళ్ళంతా ఆశ్చర్యపోతుండగానే, ఆమె మేడమీదకి మాయమయింది.

ఆ ప్రపంచంలో అడుగు పెట్టడానికీ - ఆ ప్రపంచంతో సంబంధాన్ని గుర్తు చేసుకోడానికీ తనకి అర్హత లేదని మొట్టమొదటిసారిగా గ్రహించాడు చంద్రుడు. ఏదో కానిపని చేసినట్టు జీవితంలో మొదటిసారిగా కుంచించుకుపోయాడు (కానిపని చేయలేని పాపానికి ఈ స్థితిలో ఉన్న చంద్రుడు!)

డీసిల్ ఇంజను అరుస్తూ గుండెల్ని చీల్చుకుపోతున్నట్టు ఇరవై గూడ్సు పెట్టెల్ని తీసుకు ముందుకు సాగిపోయింది. ఆ వేగానికి ప్లాట్‌ఫారమంతా గడగడలాడింది. నిద్రలేచిన దొరగారి కుక్క ఫస్ట్ క్లాసు వెయిటింగ్ రూంలోంచే అరుస్తోంది

"మీరు నిద్రపోరా?" అని అడిగింది తనకోసమే కనిపెట్టుకు చూస్తున్న తులసి.

"నా సంగతి నీకెందుకు? నువ్వు పో!" అన్నాడు చంద్రుడు.

"మీతో మాట్లాడాలి. ఒక్కసారి ఇలా రండి!" అంది తులసి. వెయిటింగ్ రూంలోంచి బయటికి వచ్చి - రూం పక్కనే పొడవాటి బల్లమీదకి ఆహ్వానించింది భర్తని.

మాటల్లో భార్య చూపే ఆప్యాయతకి అలసిపోయాడు చంద్రుడు. "ఇంతరాత్రి ఏం మాట్లాడతావు, నోరు మూసుకు నిద్రపోక!" అన్నాడు విసుగ్గా కూచుంటూ.

పక్కనే హిగ్గిన్ బాదమ్స్ స్టాల్ మూస్తున్న పెళ్ళికాని కుర్రాడు - ఆ దంపతుల ఆప్యాయతకి విస్తుపోతూ చూశాడు.

"మనం రాయ్‌వెల్లూరు వెళ్ళకపోతేనేం?" అంది తులసి, ఆయన చెయ్యిమీద చెయ్యివేసి.

అలా చెయ్యి వెయ్యడం చంద్రుడికి నచ్చదు. భార్యాభర్తల ఆప్యాయతలు మానసికం అనీ, వాటికి ఇలాంటి బాహ్యమైన గుర్తులు అనవసరమనీ అతని నమ్మకం. అయితే ఈ నమ్మకం ఇంకా బలపడకముందే అతనికి రుక్కు తల్లి పుట్టేసింది. ఇలాంటి ఆప్యాయతలు 'ప్రియురాళ్ళ' ట్రేడ్ ట్రిక్స్ లాంటివని అతని నమ్మకం. (అతని దృష్టిలో భార్యవేరు, ప్రియురాలు వేరు.)

"మనం వెనక్కి పోదామండీ! మద్రాసూ వద్దు. రాయ్‌వెల్లూరూ వద్దు. నాకేదో భయంగా ఉంది" అని మళ్ళీ అంది.

"ఏం? చచ్చిపోతావని భయమా!"

అలాంటి మాటలకి ఆమె మనస్సు కలుక్కుమనడం ఎన్నాళ్ళ కిందటో మానేసింది.

పైపెచ్చు "అంత అదృష్టమా నాకు?" అంది అదేదో తేలిక విషయంలా.

"నోరు ముయ్యవే! - నీకేం కాదు; నువ్వేం కావు. లోపలికి వెళ్ళిపడుకో, మళ్ళీ ఇలాంటి నసుగుళ్ళు పెడితే చంపేస్తాను."

ఇవి ఆమె జీవితంలో మధురక్షణాలు. చంద్రుడు ప్రకటించే అతిసుకుమారమయిన భావాలకి ఇవి మచ్చుతునకలు, ఇలా అంటే అతను చాలా మృదువుగా మాట్లాడినట్టూ లెక్క. అంతకంటే నాజూకు. మృదుత్వం అతను నేర్చుకోలేదు.

ఆ మాటల్ని విని అతని హృదయాన్ని చదవడం ఆమె పదహారేళ్ళుగా నేర్చుకుంది.

పెళ్ళయిన కొత్తలో - చంద్రుడికి మరీ కావలసిన ప్రాణమిత్రుడు చచ్చిపోతే - ఇంటికి వచ్చి "ఆ వెధవ చూశావ్ ? - చెప్పాచెయ్యకుండా చచ్చిఊరుకున్నాడు. వాడెప్పుడూ అంతే! దొంగ రాస్కెల్" అన్నాడు - ఒక పక్క కళ్ళనీళ్ళు వస్తుంటే "అయ్యో! చచ్చిపోయాడే!" అని ఏడ్చేకన్నా, ఈ బాధ మరింత గుండెను తడిచేసింది తులసికి.

నిద్రరాక - పొగాకు కాడ చుట్టుకుంటున్న ఓ రైతు దగ్గర ఒక తొడ తీసుకుని చుట్ట చుట్టి వెలిగించాడు చంద్రుడు. సామాన్లు తీసుకెళ్ళే బండిమీద మోకాలు ఆనించి, విశ్రాంతిగా చుట్టని నాలుగు పీల్పులు పీల్చాడు. గుండె వెచ్చబడింది. తిమ్మిరి ఎక్కినట్టున్న తల సర్దుకుంది. కాస్త హుషారు వచ్చింది. మరో పీల్పు పీల్చేలోగా ఎవరో పోర్టరు తనని వెదుకుంటూ వచ్చాడు.

"ఇందాక దొరసాని గారిని పలకరించిన పెద్దమనిషి మీరుగదండీ?" అన్నాడు.

తలూపితే -

"అమ్మగారు - ఇదిమ్మన్నారు" అని ఓ కాగితం మడిచి చేతిలో పెట్టాడు.

నివ్వెరపోతూ మడత విప్పితే, ముత్యాలకోవలాంటి వ్రాత తెలిసింది. అదెవరిదో గుర్తే వలజ దస్తూరి మాత్రం ఏమీ మారలేదు.

"మేడమీదకి రా!" అని రాసింది.

చుట్టపారేసి, మూతి ఒకటికి రెండుసార్లు తుడుచుకుని - ఫ్లాట్ ఫారం చివరి వరకూ వెళ్ళి కొళాయి దగ్గర అయిదారుసార్లు పుక్కిలించి ఉమ్మేసి, జుత్తు సరిచూసుకుని, అధికారి దగ్గరకి ప్రమోషన్ కోసం వెళ్ళే గుమస్తాలాగ సిద్ధపడి మేడమెట్లెక్కాడు.

వెళ్ళనక్కరలేదన్న అభిమానాన్ని - చిన్ననాటి స్నేహితురాల్ని కలవాలన్న ఉబలాటం అలా జయించింది.

గది తెలుసుకోవడం అంత కష్టం అనిపించలేదు. పద్నాలుగో నెంబరు గదిలో దీపాలు వెలుగుతున్నాయి. ఒకరెక్క తెరిచి ఉంచింది కావాలని. చంద్రుడు తలుపు దగ్గరికి వెళ్ళి నిలబడగానే లోపల ఆమె చిరునవ్వు కనిపించింది. మెత్తటి పరుపుమీద కూచుని ఒళ్ళో తలగడా వేసుకుని కాళ్ళాడిస్తోంది.

"రా లోపలికి," అంది.

లోపలికి వచ్చాక - కుర్చీ చూపించింది. ఏదో అపురూపమయిన బొమ్మని చూసినట్టు ఆశగా, విచిత్రంగా అతణ్ణి గమనించి "అందరి మధ్యా నన్నలా పలకరిస్తావేం - బ్రూట్!" అంది అంతులేని ఆత్మీయత, ఆపేక్షా నిండిన కంఠంతో.




ఒకరాత్రి..!! విజయవాడ జంక్షన్‌లో జీవితంలో రెండోసారి రైలు తప్పిపోయిన రేషన్ గుమాస్తా 'చంద్రుడు' బతుకు మబ్బు తెరల్లో పారాడుతున్న కథ!

మధ్య మధ్య ఫ్లాష్ బాక్‌ల కలనేతతో కొంగ్రొత్త పద గుంభనలతో అల్లిన భావబంధుర మనోవైజ్ఞానిక నవల..!

రచనాకాలం: 1970

****

(గత సంచిక నుంచి తరువాయి)

4

***నీతి బాహ్యుడు తన 'అవినీతి'లో ఒక 'నీతి'ని ఏర్పరచుకొంటాడు. దారి తప్పినవాడు తన 'తప్పుడుదారి'లో ఒక నడవడి నిర్దేశించుకుంటాడు ఆరునూరయినా, ఆ ధోరణి మార్చుకోడు.*** కాంతయ్య దుర్మార్గుడే కావచ్చు. నీతిబాహ్యుడే కావచ్చు. పరోక్షంగా తన వ్యాపారాన్ని నిలబెట్టిన పార్వతమ్మ గడప తొక్కనయినా తొక్కలేదు. గడప తొక్కలేదంటే అసలే రాలేదని కాదు. ఎప్పుడయినా అమ్మాయిని అక్కడ దింపిపోటానికో, ఆమెను వెంటబెట్టుకుపోటానికో వచ్చేవాడు. గడపలోనే నిలబడి అణకువగా చెయ్యెత్తి నమస్కరించేవాడు. కుశలం అడిగేవాడు. పండగకి శిష్యురాలిచేత పార్వతమ్మకీ, అబ్బాయికీ కొత్తబట్టలు పంపేవాడు.

అతను అప్పుడప్పుడు అక్కడికి రావడానికి గ్రామీణులు కొత్త అర్థాలు తియ్యకపోలేదు. అయితే పార్వతమ్మకి ఇదివరకటివాళ్ళ సదభిప్రాయం ఎంత ఉపయోగించిందో ఇప్పటి దూషణా అంతే బాధించింది. కాకపోతే, పల్లెల్లో పిల్లలెవరూ పాఠం చెప్పుకోవడం లేదు. ఆమెకీ శక్తి తగ్గిపోతూ వచ్చింది. అదీకాక వలజ పాఠానికి పదిమంది ఇచ్చే జీతం ఇస్తున్నాడు కాంతయ్య. ఆ అమ్మాయి వచ్చినప్పుడు వస్తుంది. లేనప్పుడు లేదు. ఈ విధంగా ఆ అవ్యవస్థలోనే ఒక వ్యవస్థను నిర్ణయించుకుంది పార్వతమ్మ. కొడుకు పెద్దవాడవుతున్నాడు ఇక

ముందు ముందు చదువు సమస్య రానున్నదని తెలిసు. చదువు అంటకపోతే బ్రతుకు సాగదనీ తెలుసు. ఇప్పుడిక - భర్తపోయిన ఇన్నాళ్ళకి మళ్ళీ, తన నిస్సహాయత గుర్తుకొచ్చి ఎప్పుడేనా రహస్యంగా భోరుమనేది. ఆ ఇల్లు తమదే అయినా, ఇప్పుడు కూలిన స్థితిలో ఉంది. పోగా, అది పాఠశాలకు భర్త వదులుకున్నాక వెనక్కి తీసుకోడం చాతకానూ లేదు, అటు ఆలోచించనూలేదు.

చంద్రుడు చదువుకి చోడవరం పోవలసి వచ్చేది. అదో బ్రహ్మ ప్రయత్నం. అయినా మరో గత్యంతరం లేదు. ఇక్కడినుంచీ కాపరం కదిపితే, రోజు గడిచే మార్గం లేదు. ఇలాగయినా ఎన్నాళ్ళు గడుస్తుందన్న నమ్మకం లేదు. తన అర్థతో ఇప్పటికి లేదనుకోకుండా రోజు గడుస్తున్నది. ఈ ఆలోచనతో పార్వతమ్మ నలిగిపోయింది. శరీరంలోని అలసట కంఠానికి పాకి, కంఠం ఆస్కారం కూడా ఈ జీవితానికి కరువవుతుందేమోనన్న బెంగ క్రమంగా రుగ్మత అయి మంచం పట్టింది పార్వతమ్మ. ఆ రోజుల్లో వలజ వస్తే - ఏదో వచ్చీ రానట్టు పాటపాడి, ఆ పిల్లచేత పాడించేది. నానాటికీ పార్వతమ్మ పరిస్థితి మరీ దిగనాసిల్లిపోయింది. తన కంఠం స్వాధీనం కాదేమో నన్న భయం ఎక్కువయింది. ఆ భయంతో, ఆ నీరసంలోనే కంఠాన్ని కసిదీరా పూరించి పాడబోయేది. గొంతువిచ్చుకోక కన్నీళ్ళు వచ్చేవి. కసిగా గొంతు చించుకునేది. భోరుమని ఏడ్చేది.

ఒక రోజు చీకటిపడేవేళకి చంద్రుడు పుస్తకాలు పట్టుకుని ఇంటికి చేరేవేళకి - ఎన్నడూ లేనిది గుమ్మంలో కూచుని పార్వతమ్మ వెర్రిమొర్రి రాగాలు తీస్తోంది. "చూడు చంద్రా! నా సంగీతం పాడవలేదు." అంటూ కొడుకుని చూసి మరింత రెట్టించింది. అలా రెండూ ఝాములవరకూ పాడిపాడి అలసి సొమ్మసిల్లిపోయింది, ఆ తర్వాత ఆమెకి పిచ్చెక్కిందన్నారు. సరాసరి కాంతయ్యగారి దగ్గరికి పరిగెత్తుకుపోతే ఆ రాత్రికి రాత్రి బగ్గీ ఇచ్చీ, పాతిక రూపాయలు చేతులో పెట్టి వైద్యానికి పంపించారు.

పార్వతమ్మ ఆసుపత్రిలో ఉన్న రోజుల్లో కాంతయ్యే దేవుడయ్యాడు. వలజ కూడా ఒకటికి రెండుసార్లు వచ్చి చూసి పోతుండేది. సంగీతం పాఠాలతోపాటు ఆమెకి చదువు చెప్పడానికి ఇంగ్లీషు వచ్చిన పంతులు ఒకాయన వస్తుండేవాడు. ఆ ఇంగ్లీషు చదువూ, రోజూ చూసే సినిమాల ప్రభావమూ ఏకమయి - వలజని విచిత్రంగా తయారుచేశాయి. ఆ ప్రాంతంలో ధనం వల్ల కాకపోయినా ఒక కొత్త వ్యాపారానికి ఆద్యుడుగా పాతుకుపోయిన తండ్రి ప్రత్యేకత తండ్రిలోకన్న కూతురిలో ఎక్కువగా కనిపించేది. ఆ రోజుల్లో చంద్రుడిని 'చాంద్' అని పిలిచేది వలజ. ఆ ఆప్యాయత కూడా అధికారంతో లొంగదీసుకున్న ఆప్యాయతలాగే ఉండేది కాని, ఎక్కువ హృదయానికి సంబంధం కనిపించేది కాదు. మొదట్లో చదువుకి, తనతోపాటు ట్యూటర్ దగ్గరికి రమ్మనేది చంద్రుడిని. కాని, తల్లికి అది ఇష్టంలేదు. కాగా, తండ్రి స్వభావమూ ఏమూలో రక్తంలో జీర్ణించుకుపోయింది. తనది కానిది, ఆస్కారం లేనిది కలుగజేసుకుని పుచ్చుకోవడం మంచిది కాదు అనుకునేవాడు తనమాట వినలేదని నెలరోజులు మాటలు మానేసింది. తెలివితేటల్లో, చదువుల్లో, సాహసంలో తనకంటే తక్కువవాడనే భావం ఆమె ప్రతీమాటలో ధ్వనించేది.

"నువు ఫూల్‌వి. నీకు ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకోలేదు" - అని చదువు విషయంలో నిందించినా, ఆ మాటలో ఎన్నో సంవత్సరాల ఆత్మీయత, అన్ని సంవత్సరాలూ పెంచుకున్న అహంకారం కూడా కనిపించేవి.

అయినా 'చాంద్' అంటే అపేక్ష, జాలి ఆమెకి. బలవంతాన లాక్కొచ్చి ఎన్నో సినిమాలు చూపించింది. దెబ్బలాడి, తిట్టి, ఏడ్చి అతనిచేత రొట్టెలు తినిపించింది. అలాంటి రోజుల్లోనే పార్వతమ్మ మతి చలిస్తే ఆమె పట్ల జాలికంటే, స్వాభిమానంతో తలమునకలయిన ఈ చంద్రుడిని ఆకలి చావునుంచి ఎలా రక్షించాలా అని సతమతమయిపోయేది వలజ.

"ఇడియట్! ఏడుస్తూ కూచుంటే ఏమొస్తుంది? నాన్నగారు వస్తారు. చదువు. తర్వాత చూద్దాం." అంటే, చంద్రుడు ససేమిరా అంగీకరించలేదు. అంగీకరించడని ఆమెకీ తెలుసు.

ఒక పక్క పిచ్చితో తల్లి ఆసుపత్రిలో ఉండగానే ఒకరోజు ఒక పిచ్చి ఆలోచనతో అతని ఇంటికి వచ్చింది వలజ.

"పోనీ నన్ను పెళ్ళిచేసుకో! మా నాన్నగారు నీకు కట్నం ఇస్తారు. ఆ డబ్బుతో చదవచ్చు" - అంది.

ఆ మాటకి బెదిరిపోయాడు చంద్రుడు.

ఆ ఇద్దరిలో ఒకరికి అధికారంచేత, మరొకరికి అభిమానం చేత లోకజ్ఞానం అబ్బవలసినంత అబ్బలేదు. అందుకని, ఓ సాయంకాలం అదేదో ఆటలో పందెంలాగ పెళ్ళిగురించి మాట్లాడుకుని ఇద్దరూ మరిచిపోయారు.

ఆ తర్వాత మరో సలహాకి తలవంచాడు చంద్రుడు. ఆ సలహా ప్రకారం కాంతయ్యగారి సినిమా హాలులో టిక్కెట్లు అమ్మే గుమాస్తా ఉద్యోగానికి కుదురుకున్నాడు. జీవితం ముప్పై. అదిన్నీ స్పెషల్ జీతం అది. అందరికీ అంత ఇవ్వరు.

అయినా ఆ ఉద్యోగం ఇప్పించినందుకే వలజకి కృతజ్ఞత చెప్పబడితే - తాచుపాములాగ లేచి, బుసగొట్టి -

"నువ్వు కావాలనుకుంటే - ఈ సినిమా హాలంతా నీకు పట్టం కట్టేవారు నాన్నగారు. నువ్వు ఫూల్‌వి. అందుకనే గుమాస్తా గిరీ దేవేంద్ర పదవి అనుకుని సంతోషిస్తున్నావు!" అంది.

"నిజంగా నాకిది చాలు."

"నా కిది చాలదు. గెటవుట్?" అని అరిచింది వలజ వెర్రెత్తి - వెళ్ళి టికెట్లు చింపే గదిలో కూర్చుంటే - అంతా అయాక గదిలో జొరబడి తలుపు వేసి - అతని ఒళ్ళో తలపెట్టుకు ఏడ్చింది. ఎందుకేడుస్తోందో అర్థంకాక, తలుపు కొట్టిన వాళ్ళకి మరి నాలుగు అర్థరూపాయి టిక్కెట్లు అమ్మి బయటకు వచ్చాడు. వాళ్ళు నవ్వుతుండగానే కనీసం వాళ్ళ కర్థమయినంతయినా అర్థంచేసుకోకపోయినందుకు మళ్ళీ తిట్టింది! ప్రేమను చూపించబోయి, దాన్ని గ్రహించలేనందుకు కించను దాచుకోలేకపోయి - ఆ రోజుల్లో అలా విలవిలలాడేది వలజ.

'నీ దగ్గర బ్రతికే ఆడది ఏడవక తప్పదు," అని చివరికి అనేసింది కూడాను.

చంద్రుడికి ఉద్యోగం దొరికిన మరిరెండు నెలలకు పార్వతమ్మ రాగలిగింది. ఆ రోజులో చంద్రుడు పొందిన సంతోషం అంతా ఇంతాకాదు. అంత సంతోషం కూతురు పుట్టిన రోజుల్లో కూడా అనుభవించలేదు అతను.

అయితే, ఆ సంతోషం ఎంతోకాలం మిగల్లేదు. - మరో నెలరోజులకే ఆరోగ్యం పాడయి, జబ్బు తిరగబెట్టి - ఆ జబ్బులోనే కన్నుమూసింది పార్వతమ్మ.

## 5

అదేదో క్రొత్త ప్రపంచంలాగ కనిపించింది చంద్రుడికి. మంచులాంటి ఆ వాతావరణంలో మల్లె చెండులాగ కనిపించింది వలజ. వంటిని చుట్టుకుని పైజమా, జుబ్బా మాత్రమే ఉన్నదని వదులుగా కదిలే వక్షోజాలూ, గాలికి కాలిమీద రెపరెపా కదిలే ఉల్లిపొరలాంటి బట్టా సాక్ష్యం చెప్పింది. వాటిమీద జల్తారు అంచు కుట్టిన తెల్లటి నైటు గౌను; విరబూసిన జుత్తు; జుత్తుకి అక్కడా అక్కడా పాతజ్ఞాపకాల్లాగ వేలాడుతూ మల్లెపువ్వులు, కాళ్ళకి ఖరీదయిన జల్తారు చెప్పులు, ఆభరణాలన్నీ తీసేసింది. ఇప్పుడు నిరాడంబరంగా, నిండుగా, నిజంగా కనిపించింది. ఆమెని చూసి దిమ్మెర పోయాడు చంద్రుడు. ఒక్క క్షణం అతనికి తులసి గుర్తుకొచ్చింది. మనస్సులో ఇద్దరినీ తల్చుకున్నాడు. వయస్సు ఇద్దరిదీ ఒకటే అయినా ఇక్కడి వయస్సు ఉదయాన్ని సూచిస్తుంటే, అక్కడి వయసు అప్పుడే ఉదయం సంధ్య వేపు తలవాల్చింది. ముప్పై ఎనిమిదీనూ ఇరవై అయిదునే స్ఫురింపజేస్తోంది వలజ.

పక్కనే టేబులు మీద అప్పుడే పూర్తయిన ఖరీదయిన భోజనపు అవశేషాలు కనిపించాయి. మిగిలిపోయిన ఆపిల్ ముక్కలూ, వదిలేసిన ఐస్ క్రీమ్ చూడగానే అరగంట క్రితం తను తిన చల్లారిన పూరీలు గుర్తుకొచ్చాయి.

భోజనం మీది అతని దృష్టి గమనించి, "చాంద్! భోజనం చేస్తావా?" అంది.

ఆ పిలుపులో ఎన్నో ఏళ్ళ కిందటి ఆపేక్ష ఉన్నా, అప్పటి హోదా, అహంకారం ధ్వనించలేదు. అనుభవం అహంకారాన్ని లోబరుచుకుని అపేక్షకు అందాన్ని తెచ్చిపెట్టింది.

"నువ్విప్పుడు ఎంతో బాగున్నావు!" అన్నాడు చంద్రుడు అనుకోకుండా.

"అలాగా! ఈ మాట లెప్పుడు నేర్చుకున్నావు? ఇరవై ఏళ్ళ క్రిందట రావే ఇవన్నీ!" అంది.

సిగ్గుపడిపోయాడు. మాటమార్చి - "చెప్పు భోజనం చేస్తావా? ఆయనెలాగూ ఇక రారు. ఈ భోజనం వేస్ట్ అయిపోతుంది." అంది.

"వద్దు. వద్దు." అన్నాడు ఆత్రంగా. ఆ తొందరపాటులో "కావాలి, కావాలి," అన సమాధానం ధ్వనించి, లేచివచ్చి, ఐస్ క్రీమ్‌ని చేతికి అందించింది. ఆమెతో పాటు అపూర్వమయిన సువాసనేదో గాలిలో కదిలింది.

ఐసు చల్లదనానికి నాలిక జివ్వుమంది. కళ్ళు చికిలిస్తే పక్కనే కూచుని నవ్వింది.

"నన్ను ఎలా గుర్తుపట్టావు? చెప్పుముందు" అంది.

"నీ కళ్ళు."

"అంత గుర్తా నీకు - అంత బాగా గమనించేవాడివన్నమాట ఆ రోజుల్లో - యూ సిల్లీ ఫూల్!" అంది.

నవ్వుకున్నాడు చంద్రుడు. తనతో ఎప్పుడు మాటాడినా మాట చివర ఏదో విశేషణం చేర్చే పదహారేళ్ళ కిందటి అలవాటు గుర్తుకొచ్చింది.

"ఈ శరీరం, నేనూ అసహ్యంగా లేనూ ఇప్పుడు? " అంది మళ్ళీ.

"అప్పుడు నువ్వు ఇలాగే ఉండేదానివి. ఇప్పుడు మరీ లావెక్కావు."

ఆమె కళ్ళలో నిరుత్సాహ కనిపించింది. ఆడది తన రూపాన్ని సూచించడంలో, దాన్ని మగాడు ఖండించాలనే ఆశ ఉన్నదని - అదో మర్యాద అనీ చంద్రుడు గ్రహించలేడు.

"నువ్వు పాత మనిషివే!" అంది నవ్వి.

"అయినా నువ్వు నన్ను పోలిక పట్టలేక పోయావ్.." అన్నాడు చంద్రుడు నిష్టూరంగా.

పకాలున నవ్విది వలజ "మీ మగాళ్ళ తెలివి తేటలు ఇంతే మరి, నువ్వు నన్ను పలకరించక పోయినా, నావేపు చూడక పోయినా నిన్ను ను మెడబట్టుకు ఈ గదిలోకి ఈడ్చుకు వచ్చేదాన్ని. విజయవాడలో రైలు ఆగగానే నాకు మొదట కనిపించిందిఏమిటనుకున్నావు?"

తెల్లబోయి చూశాడు.

"నీ చింపిరి జుట్టు" - జుత్తులోకి వేళ్ళుపోనిచ్చి చెరుపుతూ పక్కన కూచుంది."నువ్వు ఆ ట్రయిన్‌లో వెళ్ళిపోతున్నావేమోనని భయపడ్డాను. వెళ్ళేటట్టయితే తప్పక పలకరించేదాన్ని. కాని, వెళ్ళడం లేదని తెలిసి మా ఆయన్ని పట్టుబటి ఈ రిటైరింగ్ రూంలో దింపాను. ఊళ్ళోకి వెళ్ళి ఉందామంటే వీల్లేదన్నాను. తెలిసిందా? - మా ఆయన్ని దిగబెట్టే మిషతో వచ్చింది ఎందుకనుకున్నావ్? నిన్ను కనుక్కుందామనే. *మీ మగాళ్ళు చాలా తెలివైన వాళ్ళమనుకుంటాను. కాని చవట చచ్చు పీనుగయిన మామూలు ఆడదాని ముందుకూడా పూచిక పుల్లలాగ తేలికపడి పోతారు* -" నోటిమాటలేక వలజవేపు చూస్తూ ఉండిపోయాడు.

"ఏం చేస్తున్నావిప్పుడు?" అంది కాస్సేపాగి.

"రేషను షాపులో ఉద్యోగం"

"అందరికీ తిండి పెడతావన్నమాట. నువు మాత్రం తినట్టులేదే! - ఎంత ఎండిపోయావో చూడు" అంది కళ్ళల్లోకి చూస్తూ.

"అన్నట్టు నీకు పెళ్ళయింది కదూ? పిల్లలా నీకు?" అంది.

ఆ ప్రశ్నల్లో, ధోరణిలో తెలుసుకోవాలనే ఉత్సుకత కంటే వెక్కిరించాలనే కొంటెతనం చురుమనిపించింది చంద్రుడికి.

"అప్పట్లో నువ్వు పెళ్ళి చేసుకున్నది ఈయన్నే కదూ?" అన్నాడు. ఊహించుకుపోయి - బలమయిన ఎదురుదెబ్బలా ఆ ప్రశ్న తగిలి - గిజ గిజలాడింది.

"అప్పటికీ ఇప్పటికీ భర్తలు కూడా మారతారా ఎక్కడేనా ఆయన పనిచేసేది సినిమా ప్రపంచంకాని, బ్రతికే ప్రపంచం సినిమా కాదు, అందుకే ఆయనతో హాయిగానే బ్రతుకుతున్నాను."

మాటలో ఉన్న ·హాయి మనసులోదేనా అని సందేహించాను ఆమె కళ్ళని చూస్తూ.

ఏమయినా వలజ తను ఊహించలేని, చేరుకోలేని స్వర్గంలో జీవిస్తోంది. ఆమె అభిరుచుల్లో - కనీసం ఏవో కొన్ని ఈ జీవితంతో ఉపశమనం పొందాయి.

"పిల్లలా అని అడిగితే చెప్పవేం?" - అంది మళ్ళీ.

"కూతురు - రుక్కుతల్లి."

"పోనీలే - అదృష్టవంతుడివి. నన్ను చేసుకుంటే పిల్లలుండేవారు కాదేమో!" అంది కళ్ళల్లోకి చూస్తూ. ఆ మాటల్లో ఎక్కడో ఏమూలనో ఆమె జీవనంలో ఇంకా మిగిల్పోయిన వెలితి తొంగిచూసింది. బిగువయిన శరీరం, ఆ వయసులోనూ అందం చెడని అద్దంలాంటి ముఖం, నీడలు చేరని కళ్ళూ చూసి - ఆమెకు పిల్లలు లేరని అర్థం చేసుకునే అతను ప్రశ్న వెయ్యలేదు. కాని వలజ ఊరుకోలేదు. "ఏమిటలా చూస్తావు! నాకు పిల్లలు లేరు.. ఒకటి కాదు రెండు కాదు. నాలుగుసార్లు అబార్షన్లు అయ్యాయి. ఇంక మళ్ళీ నెలలు నిండితే మనిషి దక్కనని, పిల్లల సంచి తీసేశారు. ఇప్పుడింక పిల్లల్లేరు కాని, శరీరం మాత్రం పెరిగిపోయింది."

మాతృత్వం ఇవ్వగల పరిపూర్ణత్వానికి ఆమె పడ్డ తపన, సాధ్యం కానప్పటి యాతన అంతా ఆ క్షణంలో ఆమె కళ్ళల్లో రూపుకట్టింది. కాని, అంతలో నవ్వి - "నీ కూతుర్ని నాకెప్పుడయినా చూపిస్తావా?" అంది.

"ఎలా? కాపరానికి వెళ్ళింది."

"పెళ్ళి చేసేశావన్నమాట - వెరీ గుడ్ నిన్నెప్పుడూ స్టుపిడ్ అంటుండేదాన్ని కదూ! ఇపుడది తలుచుకుంటే నాకే సిగ్గేస్తోంది. అయినా మన తెలివితేటలకీ, బ్రతకడానికీ సాపత్యం ఏముంది? - నా తెలివితేటలన్నీ కలిపి అయినా నాకు కావలసినవన్నీ సంపాదించి పెట్టలేకపోయాయి" అంది.

వాతావరణంలో అనుకోకుండా మందకొండితనం ప్రవేశించింది. అంత అందమయిన ముఖంలో దిగులు అతికినట్టులేదు. సినీతార వెండితెరమీద దుఃఖంతో కళ్ళు తుడుచుకుంటున్నటుంది. ఆ సీను కదలగానే ఆ దుఃఖం ఎంత హఠాత్తుగా మాయమవుతుందో అర్థమవుతోంది. ఇప్పుడూ సరిగా అంతే జరిగింది.

"ఇక్కడేం చేస్తున్నావ్?" అంది - బాకులాంటి పదునయిన చాకు తీసి ఆపిల్ పండు కోస్తూ.

"మీలాగే రైలుకు వచ్చాను. నేను ఖాజీపేటలో పని చేస్తున్నాను. పొద్దున్నే మేం మద్రాసు పోవాలి. అక్కడ నుంచి రాయ్‌వెల్లూరు వెళ్ళాలి."

ఆమె కళ్ళు విప్పారాయ్. "మద్రాసు వస్తున్నావన్నమాట! మళ్ళీ మళ్ళీ కలవొచ్చు. 'మేం' అంటున్నావు. ఇంకా ఎవరెవరు ఉన్నారేమిటి?"

"మా ఆవిడ ఉంది"

"వాట్! మరి చెప్పవేం - ఫూల్!" అంటూ బట్టల స్టాండు దగ్గరికి వెళ్ళి - "ఉండు బట్టలు మార్చుకు వస్తాను. మీ ఆవిడని చూపెడుదువుగాని" అంది.

***

**ఎందుకో భయం వేసింది** చంద్రుడికి. ఆ సమావేశం సుఖంగా ఉండదనీ, ఆమెని కలవడంలో తనకేదో ఖిన్నత కలుగుతుందనీ తోచింది. అసంకల్పితంగానే అనేశాడు:

"నువ్వు మా ఆవిడని కలవకూడదు -"

తెల్లబోయింది "అదేం?"

"ఆవిడకి నలుగురితో ఎలా మాట్లాడాలో చేతకాదు. పల్లెటూరిది. ఆమెను నువు చూడకపోయినా ఫరవాలేదు."

అదంతా తనకి పొగడ్తలాగా తృప్తిగా అతని వేపు చూసింది అతన్ని క్షమించినట్టు. కాస్తపాటి నవ్వునీ దాచుకోలేకపోయింది.

"మరీ అంత పల్లెటూరిదాన్ని ఎలా చేసుకున్నావు? వలజని కాదని?" అన్న ప్రశ్నని కళ్ళలోంచి విసిరింది.

తల వంచుకున్నాడు. ఇక అక్కడ కూచోడానికి ఇబ్బందిగా ఉంది.

"రాయ్ వెల్లూరులో ఏం పని?"

"ఆ మాటకేం? నీ విషయం చెప్పు" అని నవ్వబోయాడు.

అలా తప్పించుకోవడంలో, అతను చెప్పలేని విషయాలేవో అర్థమైనట్లు - 'అర్థంలేని నవ్వు' నవ్వింది.

"ధనవంతుడికి విషయాలేమిటి ఉంటాయి? అజీర్ణ వ్యాధి, మొహం మొత్తే సుఖం తప్పించి. ప్రపంచంలోని చరిత్ర అంతా పేదవారి కథలే - మా వారితోపాటు నేనూ అప్పుడపుడూ కవులతో మాట్లాడుతూ ఉంటానులే" అంది.

ఆపిల్ పళ్ళుకోసి అందమయిన ప్లాస్టిక్ పళ్ళెంలో అతనిముందుంచింది.

"మా ఆయనో పిక్చర్ తియ్యబోతున్నారు. చాలా గొప్ప పిక్చర్ అవుతుందని అందరూ అప్పుడే అనుకుంటున్నారు. అది సక్సెస్ అయితే బొంబాయి వెళ్ళిపోవాలని ఆలోచన ఉంది."

"ఎక్కడినుంచి వస్తున్నారు?"

"అనపర్తిలో ఎవరి దగ్గరో 'స్మగుల్డ్ రూబీ' ఉందని చూచాయగా తెలిసింది. చాలా ఖరీదయిన కెంపు. ఆ బాస్టర్డ్ ధర తెగనివ్వకుండా ఆఖరికి పదివేలవరకూ ఇస్తానన్నారాయన" అంది అదేదో పదిరూపాయలన్నట్టు.

చాలా నిర్లక్ష్యంగా, అవన్నీ సామాన్యమయిన విషయాలాగ చెపుతోంది వలజ. చెపుతూ గదంతా కలియ తిరుగుతూంది. ఆమె కాలికి వెండి మువ్వలున్నాయి. అవి నేలని బాదుతున్నాయి. అందరిలాగా నాజూకుగా కాక, తాడించినట్టు అడుగులు వేస్తోంది. ఆ కుదుపుకి వెసులుబాటుగా ఉన్న రొమ్ములు కదులుతున్నాయ్. అలాంటి నడక ఆ అనుభవం ఆమెకు అలవాటులాగానే ఉంది. పక్క చూపులు చూస్తూ అటూ ఇటూ తిరుగుతోంది.

"మా ఆయనకు చెప్పి నీకో మంచి ఉద్యోగం వేయిస్తాను మద్రాసులో ఉండిపోతావా?" అంది ఉన్నట్టుండి.

నవ్వాడు చంద్రుడు. "ఈ వయస్సులో వృత్తి మార్చుకోవాలంటే భయమేస్తుంది. అయినా, అక్కడ నాకేం సమస్యల్లేవు. బాగానే గడిచిపోతున్నాయి రోజులు"

నవ్వింది. "అవునులే. ఇరవై యేళ్ళ క్రితం సినిమా థియేటర్ యజమానివి అవుతావా అని అడిగినప్పుడు. టిక్కెట్లు అమ్మే ఉద్యోగంతో సరిపెట్టుకున్న మహానుభావుడివి. నీకెక్కడ బ్రతికితే బాగుండదు కనక!" ఆ మాటల్లో వ్యంగ్యమూ, కోపము, కసీ ధ్వనించాయి. కాని అది చాలా గొప్ప పొగడ్తలాగ సరిపెట్టుకున్నాడు చంద్రుడు.

"ఇక్కడెందుకాగారు?" అన్నాడు మాటమారుస్తూ.

కాస్త ఆగి చెప్పింది -" నా రక్తంలో ఏదో దోషం ఉందిట, ఎయిర్ కండిషన్డ్ గదులకి తప్ప, బయట ఉంటే నాకు పడదు. ఇక్కడాయనకి తెలిసిన డాక్టరెవరో ఉన్నారట. కన్సల్ట్ చేస్తానని వెళ్ళారు."

ఆపిల్ ముక్కలు తింటూ కూచున్నాడు.

"నువ్వూ మద్రాసుకేగా? - మనమంతా కలిసి పోవచ్చు."

"ఒక రైల్లోనే పోవచ్చునేమో గాని, కలిసే కాదు. నువు మా స్థాయికి దిగిరావడం సాధ్యమయే పనికాదు." నవ్వాడు.

"అదా? ఫరవాలేదులే. మద్రాసులోనయినా కలుస్తావా, తప్పించుకుపోతావా?" అంది.

తలూపాడు.

పెట్టె తీసి - ఒక సొరుగులోంచి రంగురంగులకార్డు ఒకటి అతని మురికి జేబులో ఉంచింది. దాని మీద అడ్రసు - ఫోను నంబరు ఉంది. "ఫోన్ చేస్తే కారు పంపుతాను," అంది.

ఆపిల్ ముక్కలు తినడం అయిపోయింది. ఏం చెయ్యాలో తెలియక, ఏం మాట్లాడాలో తెలీక దిక్కులు చూశాడు. తలెత్తితే ఆమె తనవేపే చూస్తోంది.

"ఏమిటలా చూస్తావు?"

"చాంద్? నా గురించి ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడయినా ఆలోచించావా?" అంది.

"మా అమ్మ ఫోటో చూసినప్పుడల్లా నువ్వు గుర్తుకొస్తావు ఆవిడకి నువ్వు చివరి శిష్యురాలివి."

"బ్రూట్! మీ ఇంటిముందు మర్రిచెట్టుని చూసినప్పుడు గుర్తురానూ? నీకు చెప్పడమూ చేతకాదు, నువ్వు ఇరవై ఏళ్ళ కిందటే ముసలివాడివి కావడం ప్రారంభించావు; ఇప్పుడయిపోవడం ఆశ్చర్యమేముంది?" అని ఆగి, మంచం మీద అడ్డంగా పడుకుని తనమీదకి తలగడ లాక్కుని, కలలో చెపుతున్నట్టు అంది "నేను నీ గురించి ఎప్పుడూ ఆలోచిస్తాను. నీతో పెళ్ళి జరిగివుంటే నేనేం నష్టపోయేదాన్నా అని భయపడుతూంటాను."

"పోనీ, మంచే జరిగిందిగా!" అన్నాడు.

ఆమెకు కళ్ళనీళ్ళు వచ్చాయి. "నీకేం అర్థంకాదు. స్టుపిడ్" అంది.

ఉన్నట్టుండి ఎక్కడో ఇంజను కెవ్వుమంటే ఇద్దరూ తుళ్ళిపడ్డారు.

"ఇక వస్తాను" అని లేవబోయాడు.

"ఆయన ఇప్పుడప్పుడే రారులే. కూచో!" అంది చెయ్యిపట్టుకుని. ఆ మాట పూర్తికాకుండానే ఎవరో తలుపు తట్టారు. చంద్రుడు బిత్తరపోయాడు. ఆమె ముఖంలోనూ ఆశ్చర్యం కనిపించింది. అయినా, తేరుకుంది. "ఫరవాలేదులే. ఆయనే అయినా కొంపమునగదు. సినిమా ప్రపంచంలో స్నేహానికీ, ప్రేమకీ వేర్వేరు అర్థాలున్నాయి. ఆయనే అయితే నిన్ను గుర్తుపడతారో లేదో చూద్దాం!" అంటూ లేచి వెళ్ళి తలుపు తీసింది.

కాని, తలుపు తట్టింది ఆయనకాదు. వేలు పిళ్ళై లోపలికి ఒకడుగువేశాడు. కుర్చీలో చంద్రుడినీ అతని వాలకాన్నీ చూసి పాలకుండ మీద కాకి వాలినప్పటి అనిష్టతనీ, అసహ్యాన్నీ ముఖంలో చూపించాడు.

"ఏమిటి పిళ్ళై?" అంది వలజ.

"అయ్యగారు రెన్నువందలుదా అడిగి తెమ్మనిరి." అన్నాడు.

"నాలుగు వందలు పట్టుకెళ్ళారే!" అని అంతలో ఏమనుకుందో చంద్రుణ్ణి చూసి మారుమాట్లాడకుండా పెట్టెతీసి రెండు వందరూపాయల నోట్లు వేలు పిళ్ళైచేతిలో ఉంచింది.

తలుపు దగ్గరయాక - చేతులు ఆడిస్తూ పరుపుమీదకి పోయి కూచుని - "ఉత్త ఖర్చు మనిషి! ఒక్కరోజులో ఆరువందలు ఖర్చు పెడతారు. అడిగితే కోపం - 'ఆర్జించేవాడికి ఖర్చుపెట్టే సొగసు అర్థం కావాలి' అంటారు." అంది.

ఆ మాటల్లో బాధకంటే - అటువంటి జీవితం గడుపుతున్నానన్న దర్పం ఎక్కువ కనిపించింది.

"నేనొక్కతినే కూర్చోవాలంటే చికాకు. పోనీ మీ ఆవిడని పిలుచుకురాకూడదూ! కబుర్లు చెప్పుకుంటూ ఇక్కడే కూచుందాం" అంది.

భార్య సంగతి ఎత్తేసరికి ఇక అతనికి అక్కడ కూచో బుద్ధి కాలేదు "లేస్తాను" అన్నాడు కూచునే.

ఆమె ఏమీ సమాధానం చెప్పలేదు. అతన్నే చూస్తోంది.

లేచి గుమ్మందాకా నడిచాడు. ఆమె ఇంకా అలాగే చూస్తుండడం గమనించి తన మాసిన బట్టల్ని చూసి తనే సిగ్గుపడ్డాడు.

"పోయేదా?" అన్నాడు గుమ్మం దగ్గర ఆగి.

"వెళ్ళిపోతూ అనుమతి దేనికి? - నీకిది అలవాటే - నువ్వు ఎలాంటి పరిస్థితిలోనయినా ఇంత సుళువుగా జారిపోగలవు."

తలుపు తీసుకు బయటికి వస్తే - వెచ్చని వాతావరణం వాస్తవ ప్రపంచాన్ని గుర్తుచేసింది. చల్లని శరీరం మెల్లగా వెచ్చదనానికి రాజీపడుతుంది. ఇది అలవాటైన ప్రపంచం - విశ్రాంతిగా నిట్టూర్పు వదిలాడు. ఆ తలుపు వెనక ఖరీదయిన ప్రపంచం - అరగంటలో విసుగనిపించింది.

రిటైరింగ్ గదులందు వసారాలో అక్కడా, అక్కడా తప్ప అన్ని దీపాలూ ఆరిపోయాయి. రాత్రి వెలుగులో విజయవాడ అలంకరించుకున్న వెలయాలులాగ కులుకుతూంది. ఊరుకి మరొకపక్క గుర్తుపట్టరానంత చీకటి గుయ్యారం.

గబగబ మెట్లు దిగాడు. ప్లాట్‌ఫారం వెలుగులోకి రాగా జేబులో ఉన్న విజిటింగ్ కార్డు తీసి అక్షరాలు చదివాడు.

"ఆర్. రంగరాజు, రంగరాయ మూవీస్" అని వ్రాసి ఉంది.అవును. ఇప్పుడు గుర్తుకొచ్చింది. అతనిపేరు రంగరాజే!

******

పార్వతమ్మ పోయాక చంద్రుడి పని మరీ అస్తవ్యస్తమయిపోయింది. ఇరవై ఏళ్ళపాటు మరోవ్యక్తి అంటూ తొంగిచూడని ఆ జీవితంలో తల్లిలేనిలోటు - నలుగురికన్నా మరింత పెద్దదే అయింది. దుఃఖం మాట అలా ఉండగా, ఆ మనిషి లేని ఇంట్లో మరికొన్ని కొత్త సమస్యలు తలెత్తాయి. బ్రతికున్నన్నాళ్ళూ ఏదో కొంత వార్చిపడేసేది పార్వతమ్మ. ఇప్పుడిక వంట తనే చేసుకోవలసి వచ్చేది. అయితే అదేం కొత్త పనికాదు చంద్రుడికి. చివరి రోజుల్లో పార్వతమ్మ మరీ మంచం దిగలేని సందర్భాల్లో అలా మంచం మీద కూచునే తనకి ఎలా చెయ్యాలో చెపుతుండేది. అలాగే వంట చేసుకుంటూ ఖాళీగా ఉన్న మంచాన్ని చూసి కళ్ళు తుడుచుకునేవాడు చంద్రుడు.

ఈ మనస్తాపాన్ని, ఇబ్బందుల్ని వలజ గుర్తించకపోలేదు. ఎప్పుడన్నా మధ్యాహ్నం వేళల్లో అటువచ్చి, అతను వద్దంటున్నా కూర తాళింపు వేసో, పచ్చడి నూరో వెళుతుండేది. అంతకన్నా సాయంచెయ్యడానికి అతను ఒప్పుకోడని తెలుసు. కాని సాయంకాలం వేళల్లో - రాత్రి పదివరకూ అతడికి పని తీరదు కనక, భోజనం వాళ్ళింట్లోనే బలవంతంగా చేయించేది.

హాలుకు దక్షిణంగా కాంతయ్యగారి ఇల్లు హాలు వెనక పెద్ద మామిడి తోపు. లెక్క అప్పగించడానికి ఉదయం హాలుకి వస్తే ఇంగ్లీషు ట్యూటర్ వెళ్ళాక చంద్రుడిని తీసుకుని మామిడి తోపులోకి వచ్చేది వలజ. అలాంటప్పుడు ఏదో కుంటివాడికో, గుడ్డివాడికో తను ఆసరా అయి నడిపిస్తున్నట్టు అనిపించేదే కాని, తనవయస్సు మగాడు తననీ, తన వయస్సునీ ఎరిగి ప్రవర్తిస్తున్నట్టు అనిపించేదికాదు, *మగాడిలో నిస్సహాయత, సిగ్గు అతనికి మిగతా విషయాల్లో చాలా నష్టాన్ని కలిగించవచ్చు. కాని, ఆడదానికి మాత్రం ఆ గుణం చాలా అందంగా కనిపిస్తుంది. ఆడదానిలో ఆ బలహీనతను అందంగా పంచుకోగలిగినవాడు ధన్యుడు!*

నిజానికి ఆ నిస్సహాయతకీ, మంకుతనానికి చంద్రుడు బాధ్యుడుకాడు. మొదటినుంచి బ్రతుకు భయం, రోజు గడవడానికి గుంజాటన, తల్లిరోగం, ఒంటరితనం - ఇలాంటివే అతనికి బాగా తెలుసు. వీటి మధ్య తల్లిపాట ఒక్కటే అతని మనస్సువరకూ పోయిన

రుచికరమయిన అనుభూతి. అతని దృష్టిలో వలజ మండే అగ్నిగోళం. తన కంటె ఎన్నో అడుగులు ముందుకు నడిచి, ముందున్నట్టు గుర్తుచేస్తూ తనను రమ్మంటుంది. తన తల్లి తనతోపాటు నడిచి, 'మనం ముందుకు వెళ్ళాలి బాబూ!' అని భుజంతట్టినట్టనిపించేది. చిన్నప్పటినుంచీ ఒక ఆడదాన్ని క్షుణ్ణంగా తెలిసిన చంద్రుడు - ఆ తల్లి స్వభావాన్నే భార్యలో చూడకపోవటంలో ఆశ్చర్యంలేదు. అందుకే వలజ అతన్ని ఆశ్చర్యపరిచేటంతగా ఆలోచింపచేసేది కాదు. తన గౌరవాన్ని సంపాదించుకున్నంతగా ఆదరాన్ని సంపాదించుకోలేకపోయింది. అదేగాక, ***అన్యోన్యం కుదరని చోట ఆదరం కూడా భక్తిగానో, భయంగానో స్థిరపడుతుందిగానీ, ప్రేమగా అలుముకోదు.*** ఆమె శ్రద్ధ, సహాయాలు అతనికి తన బాధ్యతల్ని గుర్తుచేసేవాకాని, బాంధవ్యాన్ని పెంచలేకపోయాయి.

ఇలా అర్థంకాని మనస్థత్వాలతో ఆ మామిడితోపులో ఇద్దరూ తిరిగేవారు. అది స్నేహమనే అనుకుంటే చంద్రుడు చాలామంది కన్నా గొప్ప స్నేహితుడు కాగలిగేవాడు. కాని ప్రతిసారీ అతను ఇవ్వనంత శక్తి, చాలని దానాన్ని ఆమె ఇవ్వమనేది. అతనికి సాధ్యంకాక దూరంగా జరిగేవాడు.

ఏ మధ్యాహ్నానికో వలజ ఇంకా ఇంటికి రాకపోతే కాంతయ్యగారికి ఆమె ఎక్కడ ఉందో అర్థమయేది. వంటవాడికి చెప్పి ఇద్దరికీ కారేజిలో భోజనం ఆ తోపులోకి పంపేవాడు. ఏ చెట్టుకిందో నీళ్ళు చల్లి సన్నటి మలబారు చాప పరిచి - ఇద్దర్నీ కూచోపెట్టి అన్నం వడ్డించేవాడు వంటవాడు. ఆ రోజులు చంద్రుడి జీవితంలో చాలా రుచికరమయినవి. అయితే ఆ దినాలే అతనికి హెచ్చరికలుగా గుర్తుండిపోయినవీను. రేపు పెళ్ళయితే ఇలాంటి భోజనానికి తను వారసుడవుతాడని కాక, అలాంటి భోజనం ఆమెకు పెట్టగలడా అని ఆలోచించి భయపడేవాడు. ***ఆలోచన పెరిగినంతగా అనుభూతిని పెంచుకోవడం*** అతనికి వాళ్ళ అమ్మ నేర్పలేదు.

తరచు వాళ్ళిద్దరూ తోటకే వెళుతుండడం కాంతయ్యగారు గమనించి, ఓ వేసవిలో చిన్న తాటాకుల పాక వేయించారు. చల్లదనానికి తాటాకుల పాక కాని, లోపలంతా అందమయిన భవనంలా ఉన్నట్టుండేది. అక్కడ మడత కుర్చీలు, అద్దం బీరువా, టేబులూ, చిన ట్రాన్సిస్టరూ, ఓ మంచం - అన్నీ ఏర్పరిచారు. కాని, ఆ గది ఏర్పడ్డాక అటు రావడానికి ఇష్టపడలేదు చంద్రుడు!

ఆ రోజులోనే విశాఖపట్నం నుంచి తరుచు ఒకాయన వస్తుండేవాడు. అతనిపేరు రంగరాజు. అందమయిన గిరజాల జుత్తు, నిటారుగా, ఠీవిగా, తీరుగా ఉండేవాడు. అక్కడే ఓ సినిమా పంపిణీ సంస్థ ప్రతినిధి. అతను చిత్రం మారినపుడల్లా కొత్త చిత్రం డబ్బాలు పట్టుకుని అక్కడికి వస్తుండేవాడు. వ్యాపారానికి సంబంధించిన విషయాలు కాంతయ్యగారితో మాట్లాడుకుని వెంటనే వెళ్ళిపోతుండేవాడు. కాని క్రమేపీ వలజ మామిడితోపులోని తాటాకు పాకలో విశ్రాంతినే గురించాక, వచ్చినప్పుడల్లా రెండురోజులుండటం అలవాటు చేసుకున్నాడు. మంచి ట్వీడ్ సూటూ వేసుకుని, బంగారు ఫ్రేము కళ్ళద్దాలతో పగటిపూట - ఆ గ్రామంలో అతను తిరుగుతుంటే ఎవరో మహారాజు వచ్చినట్టు అంతా విస్తుపోయి చూసేవారు. ఆ దృష్టినీ, అలాంటి నడకనీ వలజ గమనించకపోలేదు. ఓ విధంగా ఆమె కూడా అతని తరహాకి అబ్బురపడింది. తన మనస్సులో ఉన్న ఏదో ఆదర్శానికి తను అర్థం చెపుతున్నట్టుండేది. చంద్రుడిలో లోపించిందనుకున్నదేదో అతనిలో కనిపించింది.

నలిగిన పైజమాతో, జుబ్బాతో తిరిగే చంద్రుడిని అలా తయారుకమ్మని మాటిమాటికి చెప్పేది. రంగరాజు శరీరం మీద ఉన్న వస్తువయినా తన నెలజీతానికి రాదని అతనికి తెలుసు. అందుకని అలాంటి కోరికకి బెదిరిపోయేవాడు. అయితే కారణం చెప్పకుండానే ఆమె కోరికని దాటేసేవాడు. ఆమెకు ఉద్రేకమే కాని, పరిస్థితిని అర్థం చేసుకునే స్థిమితం లేదని చంద్రుడి తెలుసు. ఆమె వత్తిడికి తట్టుకోలేక ఒకరోజు చెప్పేశాడు కూడాను -

"నా జీతానికీ ఆ వేషానికీ పొంతన కుదరదు" అని.

"నేనిస్తాను" అంది వలజ - వెంటనే. కాని, అది సాగేపనికాదని ఆమెకే వెంటనే అర్థమయింది. ఇక ఏం చెయాలో తెలీక గిజగిజలాడింది.

సినిమాలద్వారా చోడవరం వరకూ వచ్చిన నాగరికతలో మణిపూసలాగ కనిపించేవాడు రంగరాజు. ఆలోచనలూ, అభిరుచులూ ఇంకా స్థిరత్వాన్ని సంపాదించుకోలేని ఆ వయస్సులో ఆమెకు ఇదంతా అబ్బురంగా కనిపించేది. ఆమెకి తెలియకుండానే రంగరాజు అనే వ్యక్తికీ, చంద్రుడి వ్యక్తిత్వానికీ ఆకర్షితురాలయింది.

ఆ రోజుల్లో రంగరాజంటే కాంతయ్యగారూ ప్రత్యేకమయిన శ్రద్ధ వహించేవారు. అందులో కొంతవరకూ వ్యాపార దృష్టి ఉన్నాయి. వ్యక్తిగా కూడా రంగరాజంటే గౌరవం ఉండేది ఆయనకి. సినిమాల పంపిణీదారుల పక్షంనుంచి కాంతయ్య వ్యాపారం నిలదొక్కుకోడానికి రంగరాజు చాలా సాయపడ్డాడు. ఆ కృతజ్ఞత ఉండేది కాంతయ్యగారికి. రంగరాజు ఆ ఊరు ఎప్పుడొచ్చినా రాజభోగాలు అనుభవించేవాడు. సాయంకాలం వేళల్లో మడత కుర్చీ వేయించుకుని పాక బయట కూచునేవాడు. నల్లని వల్లె వాటు వేసుకుని మెరుపులాగ అప్పుడపుడు వలజ అతనికి కనిపించేది. నగరపు సంస్కారంలో సినిమా ప్రపంచంలోని కృత్రిమ జీవితాన్ని చూస్తే రంగరాజుకి వలజ కొత్తగా, స్వచ్ఛంగా కనిపించేది. కాని, పొరపాటునయినా ఆమె ముందుగాని కాంతయ్యగారి ముందుగాని ఆ ఆకర్షణని సూచన మాత్రంగానయినా కనిపించనివ్వలేదు రంగరాజు.

రంగరాజు వచ్చిన రోజులో ఒకపూట తప్పక కాంతయ్యగారింట్లోనే భోజనం చేసేవాడు. అప్పుడు వలజ విధిగా వడ్డన చేసేది. మాటల్లోనూ, పలకరింతలోనూ - 'అమ్మాయిగారు' అనేవాడేకాని, ఆమెని కన్నెత్తి చూసేవాడు కాదు. ఈ నిర్లక్ష్యం ఆమెని ఆశ్చర్యపరచకపోలేదు. అక్కడ - సినీప్రపంచంలో అతనెందరో అందగత్తెల్ని చూస్తుంటాడు. ఆయన కేమిటి? - అని సరిపెట్టుకునేది.

*మగవాడి తిరస్కారం స్త్రీని ఆకర్షిస్తే అతని ఆహ్వానం ఆమెకు వెగటు పుట్టిస్తుంది.*

ఒకరి, కాంతయ్యగారికి బాగా జబ్బుచేసి మంచాన పడ్డాడు. ఆయనకి ఉబ్బసం ఉంది. వయస్సు కనక - అది మహమ్మారి అయి కూచుంది. ఆ రోజుల్లో వ్యాపారం సరిగా చూసుకునే మనిషి లేక బాధపడుతుంటే రంగరాజు స్వయంగా వచ్చి సినిమాహాలు వ్యవహారాన్ని నిర్వహించాడు. ఆయన అభ్యర్థన మీద వారానికి మూడు నాలుగుసార్లయినా వచ్చేవాడు. ఆ రోజుల్లో రాబడి కొంచెం తగ్గితే, పంపిణీ దార్లకి చెప్పి సర్దుబాట్లు చేయించాడు. *మనిషి కృతజ్ఞతకి దాసుడయినట్టు - ఏ అధికారానికీ దాసుడు కాడు.*

కాంతయ్యగారికీ, వలజకీ ఆ ఉపకారం మనస్సులో ముద్రవేసుకుంది.

వలజకీ, చంద్రుడికీ ఉన్న స్నేహం రంగరాజు దృష్టికి రాకపోలేదు. అయినా, స్నేహానికి పెద్ద ప్రాముఖ్యంలేని ప్రపంచం అతనిది. అందుకని దానికంత శ్రద్ధని కనపరచలేదు. అయితే, అలా టిక్కెట్లు అమ్మే గుమస్తాతో సినిమాహాలు ప్రొప్రయిటరు కూతురు స్నేహం కలపడం చాలా హీనంగా తోచింది.

స్నేహితుడు కనక - ఆ ఉద్యోగానికి చంద్రుడు కుదురుకున్నాడని, ప్రొప్రయిటరు అల్లుడు కావడానికి బదులు, గుమాస్తా కావడం అతని గొప్పతనమేనని రంగరాజుకి అర్థం కాలేదు.

ఆమెని చంద్రుడు 'వలజా' అని పిలవడం, టిక్కెట్లు అమ్మే వేళల్లో, ఆమె కూడా అతని గదిలో కూచుని బాతాఖానీ వెయ్యడం అతనికి నచ్చలేదు. కాని, నచ్చని విషయాలు ముఖం మీద చెప్పడం నాగరీకత కాదని అతనికి తెల్సు. అలా చెప్పే అవకాశం రావాలి. దానికి బలమైన కారణం ఉండాలి.

ఓసారి, అనుకోకుండా అతనికా అవకాశం కలిసి వచ్చింది.

అక్కడికి అయిదు మైళ్ళులో ఉన్న తమ్మినపూడిలో నూరో నెంబరు చీరలు నేసే నేతగాళ్ళున్నారు.

చాలా నాజూకయిన పనిచేస్తారు వాళ్ళు. చీరలు కావలసివచ్చినప్పుడలా అక్కడికి వెళ్ళి, నూలు రంగు ఎన్నిక చేసుకుని పురమాయించిరావడం వలజకి అలవాటు. వారంరోజులు పోయాక పనివాళ్ళు ధర చెల్లించి సరుకు తీసుకువస్తారు.

ఈసారి వెళుతూ ఇంటిముందు గుర్రబ్బగ్గీ ఆపి, మధ్యాహ్నం నిద్రపోతున్న చంద్రుడిని వెంటబెట్టుకు వెళ్ళింది వలజ. అక్కడ ఒకటి రెండు చోట్ల ఎన్నిక జరపవలసి ఆలస్యంగా తిరిగి వస్తూ సరాసరి హాలుదగ్గరే చంద్రుడిని దింపేసి వెళ్ళిపోయింది. మొదటి ఆటకి అప్పటికే బాగా ఆలస్యమైపోయింది. అందుకు గాభరాపడుతూనే వచ్చాడు చంద్రుడు. ఇదివరకు ఒకటి రెండుసార్లు అలాంటి ఆలస్యం జరిగినప్పుడు ఎవరితోనో టిక్కెట్లు అమ్మించి పని జరుపుకున్నారు కాంతయ్యగారు. కాని, ఈసారి అలా జరగలేదు. టిక్కెట్లు ఇవ్వకుండా సినిమాకి వచ్చినవాళ్ళందరినీ అలాగే నిలబెట్టేశాడు రంగరాజు. గుమాస్తా వస్తేకాని ఇవ్వడానికి వీలుండదన్నాడు. అంతా చిరుబురులాడుతూ నిలబడ్డారు. వెళ్ళిపోయినవాళ్ళు వెళ్ళిపోయారు. రంగరాజు కోపంతో హాలంతా తచ్చాడుతున్న సమయంలో చంద్రుడు లోపలికి వచ్చాడు.. కనుచూపుమేర దాటిపోతున్న వలజ గుర్రబ్బగ్గీ చూడగానే మరీ రెచ్చిపోయాడు రంగరాజు.

వచ్చిన ప్రేక్షకులందరి మధ్యా పెట్టి చంద్రుడిని కడిగేశాడు. సమాధానం చెప్పే అవకాశం లేకుండా నానారకాలుగా తిట్టాడు. చంద్రుడు దిగ్భ్రమ నుంచి తేరుకునేలోగానే చరచరా ఆఫీసు గదిలోకి నడిచి స్వయంగా టికెట్లు అమ్మడం ప్రారంభించాడు. ఆ పనిముందే ఎందుకు చెయ్యలేదో ప్రేక్షకులు అడగనూ లేదు. ఆలోచించనూ లేదు.

చంద్రుడు తేరుకుని "నేను అమ్ముతాను," అనబోయేసరికి - మళ్ళీ కేకలు వేసి, "ఇక్కడ నువ్వేం చెయ్యనక్కరలేదు. గెటవుట్. రేపొద్దుట వచ్చి నీ జీతం పట్టుకువెళ్ళు." అని అరిచాడు.

ఇలాంటి గద్దింపు చంద్రుడికి కొత్త. తల్లి ఆప్యాయతకీ, వలజ అనురాగానికి మధ్య ప్రశాంతంగా, నిశ్చలంగా నిండుకున్న ఆ కోనేరులో - అనుకోకుండా ఈ రాయి పడేసరికి చలించిపోయాడు. నిజానికి గజగజా వణికిపోయాడు. ఆ భయంతోనే మరోమాటలేకుండా ఇంటికి వెళ్ళిపోయాడు. రాత్రి యధావిధిగా అతనికి కాంతయ్యగారింటినుంచి భోజనం తెచ్చిన వంటవాడు - కారెజీతోపాటు చంద్రుడి ఉద్యోగాన్ని రంగరాజుగారు తీసేశారన్న వార్తని కూడా ఇంటికి మోసుకు వచ్చాడు.

***

6

హిగ్గిన్ బాదమ్స్‌స్టాలు దగ్గర ఖద్దరు బట్టలు కట్టుకున ఒకాయన పుస్తకం తిరగేస్తున్నాడు. రూపంలోనూ, ధోరణిలోనూ అన్నిటా మంత్రికి ఉండవలసిన లక్షణాలన్నిటితోనూ ఉన్నాడు. వదులుగా ఖద్దరులాల్చీ, నేలకి జీరాడేటట్టు పంచె కట్టుకున్నాడు. చేతిలో ఖరీదయిన సిగరెట్టు టిన్ను.

దూరాన సిమెంటు బెంచీమీద కూచున్న తెల్లచీర నల్లమ్మాయిని పుస్తకం మధ్యనుంచి మధ్య మధ్య గమనిస్తున్నాడు - ఖద్దరు మనిషి. తెల్లచీర కట్టుకున్న నల్ల అమ్మాయి తెల్లటిమల్లెపువ్వులు పెట్టుకుంది. నల్లటి కళ్ళని అటూ ఇటూ తిపుతోంది. మధ్య మధ్య తెల్లని పళ్ళు కనిపించేలాగ నవ్వుతోంది. నల్లటి జాకెట్టు తొడుక్కుంది. తెల్లటి ప్లాస్టిక్ జోళ్ళు వేసుకుంది. ఆమె బుగ్గమీద నల్లటి పుట్టుమచ్చ ఉంది. ఆమె ముఖంలో తెల్లటి స్వచ్ఛమయిన అమాయకత్వం ఉంది. ఆమెని చూస్తున ఖద్దరుమనిషి కళ్ళల్లో నల్లటి కోరిక ఉంది. తెల్లటి జేబులనిండా రంగురంగుల రూపాయల నోట్లు కనిపిస్తున్నాయి. కనిపించేటట్టు రూపాయలు జేబుల్లో నింపుకున్నాడు.

ఇనపస్థంభానికి నిలబడి పేపరు చదువుతున్న చంద్రుడికి ఇదంతా చూచాయగా అర్ధమవుతూనే ఉంది. అతని కర్ధమవుతున్నట్టు తెల్లచీర నల్ల అమ్మాయికీ అర్ధమయినట్టుంది

మరో ఇరవై నిముషాల్లో సదరన్ ఎక్స్‌ప్రెస్ వస్తుందని బండ గొంతు నిద్రమత్తుతో ప్రకటించింది. రైలు వచ్చే గంటమాత్రం మరి పది నిముషాలకే మోగింది. ఫ్లాట్ ఫారమ్ మీద అర్ధరాత్రి మళ్ళీ అర్ధాంతరంగా మేల్కొంది.

ఇంతలో ఏమయిందో ఏమో నల్లచీర తెల్లమ్మాయి - చరచరా చంద్రుడి దగ్గరికి వచ్చి, "చూడు బాబూ, ఎంత పెద్దోళ్ళకీ బుద్దులు ఎలాగుంటాయో? ఆ ముసలాడు నా వేపు కొరకొరా ఎలా చూస్తున్నాడో?" అంది, ఖద్దరు మనిషికి వినిపించేలాగే. ఆ మాటలు అర్థమయినట్టు చంద్రుడి దృష్టికి అడ్డంగా పుస్తకం తిప్పుకున్నాడు.

"చూశారా?" అన్నట్టు ఆ పిల్ల నవ్వి, దూరంగా పోయి నిలబడింది.

*స్త్రీ విషయంలో మానవస్వభావం ఎటువంటి మగతల్లోనైనా పడే అవకాశం ఉంది.* చంద్రుడికి ఆ ఖద్దరు మనిషిలోని వ్యామోహానికి నవ్వొచ్చింది.

ఈలోగా ఫ్లాట్ ఫారమ్ చివరినుంచి దద్దరిల్లే శబ్దంతో రైలు స్టేషనులోకి చొచ్చుకు వస్తోంది.

రైలు ఆగిందే తడవుగా శత్రువు బారినుంచి పారిపోతున్న వాళ్ళలాగ పరుగెత్తుతున్నారు ప్రయాణికులు. చంద్రుడు ఎవరినో వెదుకుతున్నట్టు రైలంతా తిరిగాడు. సగం మంది లోపల నిద్రపోతున్నారు. కొందరు అపుడే తెల్లవారిపోయినట్టు ఫలహారాలు చేస్తున్నారు. ఆకలికీ, నిద్రకీ వేళలేదేమో మరి! మూడో తరగతి కంపార్ట్‌మెంట్ దగ్గర మూగపిల్ల డబ్బులు అడుగుతోంది. చిరిగిన జాకెట్టు, మాసికలు వేసిన పరికిణీ వేసుకుంది దాదాపు పన్నెండేళ్ళున్నాయి. అందంగా ఉంది. అంత అందమయిన పిల్లకి మూగతనం చాలా క్రూరమయిన అవలక్షణంగా కనిపించింది. ఇచ్చిన వాళ్ళు డబ్బులు ఇస్తున్నారు. ఆ అమ్మాయి కంపార్టుమెంటునుంచి కంపార్టుమెంటుకు మారుతూ వెళుతోంది.

ఖద్దరు మనిషి ఇరవై ఏళ్ళ అమ్మాయిని ఫస్ట్‌క్లాసు కంపార్ట్‌మెంటులోంచి దింపుతున్నాడు. వెనక ఓ కళ్ళజోడబ్బాయి - మనవడు కాబోలు. కూతుర్ని తీసుకువెళ్ళడానికి వచ్చిన ముసలాయనకి తెల్లచీర నల్లమ్మాయిని చూడడం ఒక ఆటవిడుపు. నవ్వొచ్చింది చంద్రుడికి. ఆ అమ్మాయి మంచిపిల్ల కనక సరిపోయింది.

పరాకుగా నడుస్తూ నడుస్తూ ఎవరో నలభై అయిదేళ్ళావిడని కొట్టుకోబోయాడు. తప్పుకుపోతూవుంటే ఆవిడే పలకరించింది.

తన పేరు జ్ఞాపకం చేసుకోవడానికి ఎంతో యాతన పడుతున్నాడు -

"మీ పేరు - రామ.. రామచంద్రుడు కదూ?"

తెల్లబోయాడు చంద్రుడు ఆవిడెవరో అర్థంకాక.

"పార్వతమ్మగారి అబ్బాయి?" మళ్ళీ అడిగింది ఆవిడ. పక్కనే మరో పన్నెండేళ్ళ అమ్మాయి ఉంది.

"మీరు..?"

"నేను అనంతాచార్యులుగారి అమ్మాయిని. నాకు మీ అమ్మగారే మొదటి సంగీత పాఠం చెప్పారు. నా పేరు కృష్ణవేణి" అంది ఆవిడ. ఆ పేరు, అలాంటి ముఖం ఎక్కడో చూసిన గుర్తు.

లుంగీ కట్టుకున్న ముసలాయన ఎవరో పక్కకి వచ్చి నిలబడ్డాడు. భర్తని పరిచయం చేసింది కృష్ణవేణి.

"ఇవాళ నేనింతదాన్ని కావడానికి వీళ్ళ అమ్మగారే కారణం - నాకు మొదట సంగీతం నేర్పింది ఆవిడే!" అంది. ఆమె ముఖంలో తన్మయత, చిత్తశుద్ధీ చూసి ఆశ్చర్యపోయాడు చంద్రుడు.

"మిమ్మల్నెక్కడో చూసినట్టుంది," అన్నాడు తికమకగా. నవ్వింది. "నన్నుమీరు చూసినా గుర్తుంచుకోలేరు. అప్పటికి మీరు చాలా చిన్నవారు. మీ కోలముఖం, నుదిటిమీద దెబ్బ చూసి మిమ్మల్ని పోల్చుకున్నాను. నా గొంతు మీరు వినివుంటారు. నేను రేడియోలో పాడుతుంటాను."

అప్పుడు గుర్తొచ్చింది. ఆమెని చూడలేదు. గొంతు విన్నాడు ఎక్కడో ఫోటో చూసినా చూసి ఉండవచ్చు.

"మీ అమ్మగారు రెండేళ్ళు సంగీతం చెప్పారు. తరువాత పెళ్ళయి మా ఆయనతో మద్రాసు వచ్చేశాను. మళ్ళీ సాధన చేశాను. ఎంత పెద్దదాన్నయినా మీ అమ్మగారిని మాత్రం మరిచిపోలేను" అంటూ తల్లిని గూర్చి ఒకటే ప్రశ్నలు వేసింది.

చంద్రుడికి ఆమెను చూస్తుంటే కళ్ళనీళ్ళు వచ్చాయి. *ఒక మారు మూల పల్లెటూరిలో ముప్పై సంవత్సరాల క్రితం ఒకావిడ తన పొట్టకూటికి చేసిన పనికి సత్ఫలితంగా కృష్ణవేణమ్మ కనిపించిందతనికి.*

*ఎవరో ఎక్కడో ఎప్పుడో ఏదో మంచి పని చేస్తారు. అది అప్పటికి మంచిదని అనిపించకపోవచ్చు. ఆ మంచి పనికి ప్రతిధ్వని మరేదో చోట - మరేదో రూపంతో మరెప్పుడో దర్శనమిస్తుంది.*

ప్లాటుఫారం చివరివరకూ తనను నడిపించి మాట్లాడుతూ ఉంది కృష్ణవేణమ్మ. ఆమెకి చాలా పరపతి ఉన్నట్టు ఆమెను తీసుకువెళ్ళడానికి వచ్చిన చాలామందిని చూస్తూ గ్రహించాడు చంద్రుడు.

"విజయవాడలో సాయంకాలం కచ్చేరీ చేస్తున్నాను. వస్తారా?" అందామె ఆశగా.

పరిస్థితి చెప్పాడు. ఆమె కళ్ళల్లో ఆశాభంగానికి అతని మనస్సు కలుకుమంది. వెళుతూ వెళుతూ అతని రెండుచేతులూ పట్టుకుని కళ్ళనీళ్ళ పర్యంతం అయివెళ్ళింది.

*ఒక మంచి చేసినవాడిదే కాదు; పుచ్చుకునే వ్యక్తి ఔదార్యంలోనూ ఆ 'పని'కి రాణింపు వస్తుంది.*

అన్నాళ్ళ తర్వాత అప్రయత్నంగా అలా తల్లి గుర్తురావడంతో మనస్సు అలోఢితమయింది. మెట్లు దగర అలాగే చాలాసేపు నిలబడిపోయాడు.

చాలామంది తనని దాటి ఊళ్ళోకి వెళుతున్నారు. రంగు చీరెలు, తెల్ల చొక్కాలు, కావి పంచెలు, కాషాయ వస్త్రాలు, మర కూజాలూ, మల్లెపువ్వులూ, కావిడ బిందెలూ, కాయగూరలూ - అన్నీ వరసగా మెట్లెక్కుతున్నాయి. ఇద్దరు పోలీసులు ఒక అమ్మాయిని తమ మధ్య నడిపించుకు వెళుతున్నారు. తెల్లచీర నల్ల అమ్మాయిని పోలిక పట్టి దిమ్మెరపోయాడు చంద్రుడు.

తొందరపడి, "ఏం జరిగింది? ఆ అమ్మాయి ఏం చేసింది?" అని అడిగాడు ఒక పోలీసుని.

పోలీసు లిద్దరూ ఆశ్చర్యపోయారు. అంతకుమించి నల్లమ్మాయి నివ్వెరపోయింది. ఆ ప్రశ్న విన్న ఇద్దరు ప్రయాణికులు నవ్వుకుంటూ ముందుకు పోయారు.

"ఏం బాబూ? ఈ గుంట మీకూ ఎర వేసిందా?" అన్నాడో కానిస్టేబులు. "వీళ్ళతో ఛస్తున్నాం. ఎంత కట్టుదిట్టం చేసినా ఎలాగో దూసుకువస్తారు ముండలు. మా ప్రాణాలు తోడేస్తారు" అన్నాడు రెండో కానిస్టేబులు, "పద" అని వీపు మీద చెయ్యేసి ఆ అమ్మాయిని తోస్తూ. అలాంటి సానుభూతికి ఎలా కృతజ్ఞత చెప్పాలో తెలీక అలవాటయిన అలరినవ్వే చంద్రుడిపై గిరాటేసి మెట్లెక్కి వెళ్ళిపోయింది నల్లమ్మాయి.

పోలీసులకి తీసుకెళ్ళడం లాగే, ఆమెకి పట్టుబడడం అలవాటయిన దానిలాగ - ముగ్గురు ముచ్చటగా నడిచిపోయారు.

చంద్రుడు బిక్క చచ్చిపోయాడు ఆ దృశ్యాన్ని చూస్తూ.

## 7

అవి విశాఖపట్నంలో బాంబులు పడ్డ రోజులు.

చంద్రుడు మసిబారి, పొగచూరి, మనుషుల మనస్సుల్లాగే దిగులుబారిన రోజులు.

విశాఖపట్నం నుంచి చాలామంది వెళ్ళిపోయారు. కొందరు పారిపోయారు. ఆ సందర్భంలో ఇక విశాఖపట్నం రావలసిన అవసరం రంగరాజుకి కనిపించలేదు. అప్పుడిక ఉన్న ఇంట్లోనే దీపం వెలిగించి, ఇల్లు చక్కబెట్టుకున్నాడు తెలివిగా.

చంద్రుడిని పనిలోంచి తీసేసిన గొడవ చిలికి చిలికి గాలివాన అయింది. అది తన పరువు ప్రతిష్టలకి సంబంధించిన విషయమని హంగుచేశాడు రంగరాజు. వలజ అతని ఆలస్యానికి కారణం చెప్పి తండ్రిముందే వెనకేసుకు రాబోతే - కాంతయ్యగారి ముందే కూతుర్ని ఎదరించాడు రంగరాజు. కాంతయ్యగారు తనవాదనని కాదనరన్న ధైర్యాన్ని పుంజుకున్నాకనే ఈ పని చేశాడు.

"పదిమంది మధ్య ఒక గుమాస్తాగాణ్ణి పొమ్మన్నాను అందరూ చూస్తున్నారు. ఇప్పుడు నన్ను కాదని వాణ్ణి పిలిస్తే - అది మీ ఔదార్యం కావచ్చు. కాని, నా అసమర్థత అనికూడా అనిపించుకుంటుంది" అన్నాడు.

వలజ పట్టుపట్టింది. దెబ్బలాడింది. తండ్రిని జోక్యం చేసుకోమని పోరింది. కాంతయ్యగారికి ఆయాసం మరింత ఎక్కువయి ఉలక్క పలక్క కళ్ళుమూసుకున్నారు.

చివరికి తండ్రి చేయాల్సిన పని వలజ తనే చేసింది - ముఖం పక్కకు తిప్పి - "మీరు మాకు సాయం చేస్తున్నారు రంగరాజుగారూ! అందుకు మా థాంక్స్. కాని, మా నాన్నగారే ఈ హాలు ప్రొప్రయిటర్. మాకు ఆ మనిషి కావాలి. అతను నలుగురిలాంటి ఉద్యోగి కాదు. అతనికి కొంత ఉపకారం చేయాలి కనక ఏదో కారణాన్ని ఆ విధంగా కల్పించాం. అతణ్ణి ఉద్యోగంలోంచి తియ్యడానికి వీల్లేదు" అంది.

రంగరాజు బిత్తరపోయాడు. ఆమె అంతగా ఎదిరించగలదనుకోలేదు. ఆ మాటలంటున్నప్పుడు కోపంతో. రోషంతో ఎగిరిపడే ఆమె ముక్కుపుటాలని చూసి - ఆమె ఎంత అందంగా ఉందా అనుకున్నాడు. ***పడుకుని పాకే వానపాముకంటే బుసకొట్టే తాచు అందం తీవిగా, బిగువుగా ఉంటుంది.*** ఆడిస్తే ఇలాంటి త్రాచునే ఆడించాలి.

అంతలో చిరునవ్వు నవ్వి, తల పంకించి, "ఈ ప్రపంచంలో కొన్ని పద్ధతులూ, కట్టుబాట్లూ లేకపోతే బ్రతకలేం వలజగారూ! మీ దృష్టిలో నేను చినవాణ్ణి కావచ్చు. కాని, నన్ను ఆ కుర్చీలో కూచోనంతకాలం నాకు పెద్దరికం ఇవ్వడం మీకే గౌరవం. చంద్రుడు గొప్పవాడే కావచ్చు. అంత గొప్పవాడయినప్పుడు అతణ్ణి చూసే రీతిగానే చూడాలి," అన్నాడు. అతను చెప్పిన చంద్రుడు ఉద్యోగం తీసేసిన చంద్రుడు కాదు. ఎక్కడో ఆకాశం మీద ఉండే చంద్రుడు. ఈ చంద్రుడిని గురించి మాట్లాడవలసిన అగత్యం కూడా లేదని అతని ఉద్దేశం.

ఇప్పుడు - తిరగబడతాడనుకున్న రంగరాజు - చిరునవ్వుతో తన మాటల్ని తీసుకునేసరికి నిజంగానే నిర్ఘాంతపోయింది వలజ. ఈ పాముకి - ఈ నాగస్వరం కొత్త! అందుకని అందంగా తలపంకించింది.

"మీకు అతణ్ణి ఉంచుకోవడం ఇష్టమయితే మధ్య నే నెవణ్ణి? ఉంచండి. నేను ఈ సాకు మీద ఈ పని మానుకుపోయి మీ నాన్నగారి ఆరోగ్యాన్ని, మీ వ్యాపారాన్నీ భంగపరచడం నా కిష్టంలేదు" అనేసి వెళ్ళిపోయాడు.

కాంతయ్యగారు బ్రహ్మానందభరితులయిపోయారు. కూతురి స్నేహానికి తన వ్యాపారానికి మధ్య వచ్చిన సంఘర్షణ అంత సుళువుగా విడిపోయినందుకు సంతోషంతో ఉక్కిరి బిక్కిరయి మరింత ఆయాసాన్ని తెచ్చుకున్నారు.

ఇంతకీ - వలజ మరింత విస్మితురాలయింది. ***దుర్మార్గుడిలోనయినా ఔదార్యం అందంగానే కనిపిస్తుంది.*** అంత తీవయిన మనిషిలో అంత సహనం ఎంతో నిండుగా తోచింది. ఆయన వ్యక్తిత్వం మరింత సజీవంగా కనిపించింది వలజకి.

అంతేకాదు - తన సహనంతో ఆమె దృష్టిలో రంగరాజు మరో మెట్టు ఎక్కిపోయాడు. స్థాయిలో చంద్రుడు ఒక మెట్టుకిందవాడేనన్న జ్ఞాపకాన్ని బలంగా గుర్తువేశాడు. ఇదివరకు ఈ మంచినీటి చెరువులో ఒక రంగు చేప మాత్రమే ఉండేది. ఇప్పుడు మరో కొత్త చేప రంగు రంగుల చేప చోటుచేసుకుంది.

ఆ తర్వాత, మరెప్పుడూ చంద్రుడిపట్ల అంత ఇదిగా ప్రవర్తించలేదు రంగరాజు, చాలా సందర్భాలలో - అది అసందర్భమయినా "చంద్రుడిని పిలుద్దామా?" అని ఆమెతో అని - "ఇప్పుడెందుకులెండి," అని ఆమెతోనే అనిపించాడు. అలా ఆమె అన్నప్పుడు చిరునవ్వు నవ్వి - ఆ అభిప్రాయం ఆమెకే అందంగా, హుందాగా కనిపించేటట్టు చేశాడు.

మామిడితోటలోకి వలజ వచ్చినప్పుడల్లా ఇదివరకులాగ కుర్చీలో కూచుని ఆమెను చూస్తుండడం కాక, ఆమెతో చెట్ల మధ్య పచార్లు చెయ్యడం అలవాటు చేసుకున్నాడు. పరువంలో ఉన్నకాయల్ని ఆమె కోయబోతున్నప్పుడు - ఆమె భుజాన్ని సాయంచేసుకుని - చేతకాని పనిని - ఆమెకోసం చేసిపెడుతున్నట్టు ప్రదర్శించి కోసి, వీలయితే ఓ చిన్న దెబ్బ తగిలించుకుని - ఆమె సాయాన్ని ఓ అరగంట పొందటం అతనికి కొత్తేమీ కాదు.

ఆ సందర్భంలో ఆమె రాసుకున్న లవండరు వాసనా, రెండుగా విడిపోయిన జడల విసురూ, చెవికింద పుట్టుమచ్చ సోయగం - అన్నీ దగ్గరగా చూశాడు. అలాంటప్పుడే ఆమెకి ప్రేమకీ, జాలికీ ఉన్న తేడా అర్థమయేటట్టు చెప్పక చెప్పాడు. చంద్రుడితోటి సాన్నిహిత్యానికి 'జాలి' అని, తనతోటి దగ్గరతనానికి 'ప్రేమ' అని గుర్తులు పెట్టించాడు ఆమె మనస్సులో.

ఆ గుర్తులు మాసిపోకుండా అయిదారుసార్లు గుర్రబ్బగ్గీమీద తిప్పాడు. ఒకసారి, గుర్రబ్బగ్గీ ప్రయాణంలో ఊరికి దూరంగా, ఒక సజావయిన కష్టాన్ని సృష్టించి - ఆ రాత్రి దగ్గర్లో ఉన్న పాకలో ఉండక తప్పని పరిస్థితిని కలిపించాడు. అప్పుడు తను చాలా పెద్దమనిషిలాగ, ఆమె ఓ వనదేవతలాగ ప్రవర్తించి ఆమెలోని, "మాడరన్ డెలికెసీస్"ని 'టికిల్' చేశాడు.

ఓ పండుగకి వలజ దగ్గరగా ఉండగా చంద్రుడిని తన గదికి పిలిపించి రెండునెలల జీతం బోనసుగా ఇప్పించాడు. ఆ ఆలోచనకే వలజ పొంగిపోయి "యు ఆర్ లవ్ లీ!" అంది రంగరాజుతో.

చంద్రుడూ చాలా సంతోషించాడు. అతనికి సంబంధించినంతవరకూ ఈ ప్రపంచంలో ఏమీ మార్పులేదు. వలజ తనని ఇదివరకులాగే పలకరిస్తోంది. రోజూ ఇదివరకులాగే తెల్లవారుతోంది. పొద్దుపోతోంది. ఇప్పుడిప్పుడు కాంతయ్యగారు వచ్చి హాలు దగ్గర సాయంకాలం వేళల్లో కూర్చుంటున్నారు. ఆయనా చంద్రుడిని ఆదరంగా పలకరిస్తున్నారు.

వలజకి ఏదో త్రోవ తెలిసిన రోడ్డు మీద ప్రయాణం చేస్తున్న ఉత్సాహం ప్రబలింది. ఓసారి, రిజిస్టర్డ్ పోస్టులో బెంగుళూరునుంచి రెండు జరీచీరలు ఆమెకోసం తెప్పించాడు రంగరాజు. ఆ చీరలు చూసి పొంగిపోయి కావలించుకునంత పనిచేసింది వలజ. ఆమెలోని 'వానిటీస్'కి ఆ విధంగా అందమయిన రూపం దిద్దాడు రంగరాజు. ఆమె కోరికలు అంత చక్కగా ఆచరణలో సాధ్యమవుతాయని ఎప్పటికప్పుడు సూచించాడు.

ఇక తుపాకీ పేలడానికి మీటకి చెయ్యి తగిలితే చాలునని అర్థమయాక, ఓ రోజు హఠాత్తుగా కాంతయ్యగారి ఇంటిలో ప్రత్యక్షమయి, అర్జంటుగా మద్రాసు వెళ్ళాలని చెప్పాడు. ఆ రోజుల్లోనే రంగరాజుకి మంచి సినిమాకథలు అల్లడం తెలుసు. ఈ ప్రేమకథలో ఆడది తొందర పడాలంటే - ఎక్కడో మరో ఆడది కనిపించాలి. ఆ ఇద్దరిమధ్యా ఈర్ష్య అంకురించాలి. అందువల్ల మద్రాసులో జబ్బుపడ్డ ఓ మేనకోడల్ని, ఆ అమ్మాయిని తాను పెళ్ళాడవలసిన బాధ్యతనీ సృష్టించాడు, కాంతయ్యగారు ఏమీకాదనలేక మద్రాసు పంపించారు.

వలజ నీరుకారిపోయింది ఆ కథకి. దిగులుగా భయం భయంగా అతణ్ణి పంపించింది. కాని, తన వెంటనే ఆమె ఆలోచనలు ప్రయాణం చేస్తున్నాయని తెలుసు రంగరాజుకి. అంతేకాదు - అతనివెంట మరి రెండురోజులకి ఒక బరువైన ఉత్తరం కూడా ప్రయాణం చేసి వచ్చింది. దానికి బేరింగు కట్టి పుచ్చుకుని - ఆరుపేజీలు ప్రేమని అరగంట సేపు చదివాడు. అసలు కవరు చించకుండానే దానిలోని కథనంతా పసిగట్టాడు, అతనూహించినట్టుగానే ఉత్తరంలో చంద్రుడున్నాడు. మేఘాలున్నాయి - మామిడితోపు ఉంది - మనస్సు ఉంది, కన్నీరుంది, తిరుగు జవాబుకి ఒక కవరు కూడా ఉంది.

రంగరాజుకి ప్రేమకథలు రాయడం చేతకాదు. అందుకని పొడి వాక్యాలతో చిన్న ఉత్తరం రాశాడు.

"ఇన్నాళ్ళూ మరి మీ మనస్సు నాకు చెప్పలేదేం? యూ సిల్లీ! మీ కోసం మా చెల్లెలి కూతుర్ని కాదంటున్నాను. దానికి మరో సంబంధం చేసే ఏర్పాట్లు పూర్తిచేసి వస్తాను. నా కోసం ఎదురుచూడు డార్లింగ్!" అన్నాడు ఉత్తరంలో.

మరి నెలరోజులకి రెండు కంచి పట్టుచీరలూ, ఒకలేడీ రిస్టువాచీ (స్మగుల్డ్) వలజకి తెచ్చి ఇచ్చి, ప్రతిఫలంగా ఆమె మనస్సునీ, కనీసం నలభైవేలయినా విలువచేసే కాంతయ్యగారి ఆస్తినీ చేజిక్కించుకున్నాడు.

*చంద్రుడు పరువంలో ఉన్న యౌవనాన్ని, పరుగులు తీసే వయస్సునీ గుర్తుచేస్తాడు. ఆ వెలుగులో మరెవరో ఆ తియ్యదనాన్ని అనుభవిస్తారు. అయినా పైన చంద్రుడు చల్లగా, సంతోషిస్తూనే ఉంటాడు.*

అలాగే చంద్రుడూ సంతోషించాడు ఆ పెళ్ళికి.

****

## 8

అర్ధరాత్రి గడిచి అప్పుడే అరగంట! చంద్రుడు చప్పరించిన పిప్పెరమెంటులాగ, అరిగిపోయిన అర్ధరూపాయిలాగ పలచగా, నీరసంగా ఉన్నాడు.

వలజతో మాట్లాడాక తను వేసుకున్న బట్టలు మరింత మురికిగా, తన జీవితం మరింత కురచగా కనిపించింది. ఎందరో తనని అన్ని వేపులనుంచి పరికిస్తున్నట్టూ, తన స్థాయిని గురించే వాళ్ళంతా ఆలోచిస్తున్నట్టూ ఊహించుకుని తెగ సిగ్గుపడ్డాడు చంద్రుడు. ఒక అందమైన అమ్మాయి ఆకర్షణ మనిషి పరిసరాల్ని మరింత ప్రత్యేకమూ, ప్రకాశవంతమూ చేస్తుంది గావును. మొదటి తరగతి వెయింటింగ్ రూమ్ ఖాళీగా ఉంది. లోపలికి తొంగిచూస్తే - ఉన్న ఒకరిద్దరూ గుర్రు పెట్టి నిద్రపోతున్నారు. బాత్ రూంలో నీళ్ళు వృధాగా కారిపోతున్నాయి. ఎవరో షవర్ వదిలేసినట్టున్నారు. ఎటెండరు గుర్రు పెడుతున్నాడు.

"షవర్ అర్ధరాత్రి ఎవరు విప్పుతారు?" అనుకున్నాడు చంద్రుడు. ఆ ఆలోచన పక్కనే మరొకటి పొడిచింది.

"తనెందుకు స్నానం చెయ్యకూడదు?"

తులసి నిద్రపోతున్నది కుర్చీలోనే. పక్కనే బెంచీమీద మెత్తగా పక్క పరిచి వుంది.

సంచిలోంచి తెల్లటి మల్లుపంచె, పొడుగు చేతుల లాల్చీ బయటికి తీసి బాత్ రూంలోకి చేరాడు. చల్లటి నీళ్ళు - అవసరంలేని పాతజ్ఞాపకాల్లాగు పొడుస్తున్నాయి. మత్తు దిగి పోయింది. శరీరం చల్లబడుతూంటే ఆలోచనలో ఏదో చెప్పరాని వెచ్చదనం వచ్చినట్టయింది. తెల్లటి బట్టల్తో ఫ్లాట్‌ఫారం మీదకి వచ్చాడతను. తడిసిన జుత్తుని బాగా తుడుచుకుని, మీదకి దువ్వేశాడు. పాపిడ లేకుండా సన్నిటి మెడా, కుచ్చిళ్ళు పోసిన పంచా, లాల్చీ - అచ్చు బెంగాలీ బాబులాగ కనిపిస్తున్నాడు ఏదో రైలు కుడివేపు ఫ్లాట్‌ఫారం మీద ఆగి ఉంది. సంతర్పణ వడ్డనలో ఆఖరి వరుస లేచినట్టు - మిగిలి ఉన్న ప్రయాణీకులందరూ ప్లాట్ ఫారం మీంచి లేచారు

స్నానం చేశాక మరింత ఉత్సాహంగా ఉంది. విసురుగా రైలంతా కలియ తిరిగాడు - ఎవరినో వెదుకుతున్నట్టు. ఉన్నట్టుండి, వెదుకుతున్న మనిషి ఎవరో దొరికినట్టు తన చేతిని ఎవరో పట్టుకున్నారు. ఇటు తిరిగి - పదేళ్ళ కుర్రాడిని - చూసి నిర్ఘాంతపోయాడు. కొత్తముఖం - నల్లగా, పొట్టిగా, కాకీనిక్కరూ - మాసిపోయిన స్పోర్ట్స్ బనీనుతో ఉన్నాడు.

తలని కిందకి వంచమని సంజ్ఞ చేసి - "మా అక్కయ్య రమ్మంటోంది." అన్నాడు. ఇంగ్లీషు వాడు తెలుగు మాటాడుతున్నట్టుంది వాలకం.

చంద్రుడు ఆశ్చర్యపోయాడు. ఆలోచించడానికి వ్యవధి ఇవ్వలేదా కుర్రాడు. నడిపించుకుపోయాడు. ఆర్. ఎమ్. ఎస్. గదిదాటి - ఆర్. పి. ఎఫ్ గదిదాటాక - మెట్ల నీడలో తెల్లగా - పాలరాతి బొమ్మలాగ ఉన్న ఒకమ్మాయి నిలబడివుంది. ఆ అమ్మాయిని చూడగానే బిత్తరపోయాడు చంద్రుడు. నీలిరంగు హైబాడీ గౌను, కాళ్ళకి నల్లటి బూట్లూ - ఎర్రగా ఉంగరాలు తిరిగిన పొట్టి జుత్తూ, పెదలాకు లిప్‌స్టిక్ - యూరోపియనల్ అమ్మాయిలాగ ఉంది.

దగ్గరికి రాగానే 'హాల్లో' అంది ఇదివరకెప్పటినుంచో పరిచయం ఉన్నట్లు, ఒక క్షణం వరకూ ఆ పలకరింత తనని ఉద్దేశించినదేనని ఊహించలేకపోయాడు చంద్రుడు. ఆ పలకరింత తనని ఉద్దేశించిన దేనని ఊహించలేకపోయాడు చంద్రుడు. ఆ పలకరింత - ఎదుట వాడికి అర్థమయేటట్టు చెప్పే రహస్యంలాగ, తన స్థాయిని సూచించే మార్గం లాగ అనిపించింది. ఇప్పుడు నీడలోంచి బయటికి వచ్చింది.

"రైలుకి వెళుతున్నారా?" అంది.

ఆ మాటలకి మరో ఆశ్చర్యం కలిగింది. మాట స్వచ్ఛంగా అచ్చమయిన తెలుగు తనంతో ఉంది. మాట ఈ దేశానికి, మనుగడ మరో దేశానికి ముడిపడ్డ విచిత్రమయిన ప్రాణి అది.

చెప్పాడు సమాధానం - "రైలుకు వెళ్ళడంలేదు. రైలుకోసం ఎదురు చూస్తున్నాను." మాట మధ్యలో కుర్రాడు ఆమె గౌను పట్టుకు పిలిచాడు. "సిస్టర్" అంటూ. ఏదో అర్థంకాని ఇంగ్లీషులో విసుక్కుని, చంద్రుడి వేపు చూసి, అంతలో నవ్వింది - "నా పేరు రోజ్" అంది. ఇప్పుడు చెక్కిళ్ళకి రాసుకున్న గులాబీ రంగును గుర్తుపట్టాడు లాంఛనంగా తన పేరు చెప్పాడు. తనని ఆ అమ్మాయి ఎందుకు పిలిచిందో అర్థంకాలేదు - ఇది పొరపాటేమో!

"మీరు నన్ను పిలిచారా? ఎక్కడేనా పొరపాటు.."

"నోనోనో! ఐవాంట్ యూ." ఆ ఆత్రం కూడా అందంగా. పొందికగా ఉంది.

రోజ్ అలా చిరునవ్వుతో అతణ్ణి గమనిస్తూనే ఉంది - చంద్రుడు తెల్లబోయి చూస్తూనే ఉన్నాడు. ఆ తర్వాత మాటలు అవసరంలేదని రోజ్ జీవితంలో నేర్చుకున్న పాఠమయితే, ఇలా ఒక అమ్మాయిని కలవడం చంద్రుడికి - ఇదే మొదటి అనుభవం.

"సిస్టర్!" అని మళ్ళీ గొడవచేశాడు కుర్రాడు.

ఈసారి మరీ కోపం తెచ్చుకుంది రోజ్. "మానర్ లెస్ ఇడియట్!" అని తిట్టింది. ఇరవై ఏళ్ళు కాపరం చేసిన ఇల్లాలు భర్తని అడిగినట్టుగా ఇటు తిరిగి - "వాడికి ఓపది రూపాయలు పారేయండి!" అంది విసుగ్గా, అక్కడ చంద్రుడు కాక మరెవరయినా ఉండివుంటే పదిరూపాయలు తృణప్రాయంగా విసిరేసేవారు. కాని, స్త్రీ స్వభావం, ఆ చనువులో విశేషం అర్థంకాని కారణం చేత ఇంకా మంకుగానే నిలబడిపోయాడు చంద్రుడు.

అలాంటి సందర్భంలో ఏ మగాడూ పర్సు తియ్యకుండా ఆగకపోగా, పదికి బదులు ఏభై తీయటం తెలుసు రోజ్‌కి. అలాంటిది, ఈ పెద్దమనిషి ఏమీ మాట్లాడకపోవడం గమనించి మొదటి సారిగా దిగ్భ్రాంతురాలయింది.

పైపెచ్చు - "నేనెందుకు కివ్వాలి?" అన్నాడు చంద్రుడు. ఇది అలవాటైన సన్నివేశం లాగు ఆసింటా జరిగాడు, కుర్రాడు,

"నా కోసం" అంది రోజ్ నవ్వుతూ ఆ వాక్యంలో ఇంగ్లీషు అర్థం అంత సులువుగా స్ఫురించలేదు చంద్రుడికి.

"నువ్వెవ్వరివో నాకు తెలీదు."

"ఇప్పుడు తెలుస్తోందిగా?" అంది.

"డబ్బు ఇవ్వమనడం తప్ప నాకేం అర్థం కాలేదు."

"ఆడపిల్ల ఇలా డబ్బు ఇవ్వమంటే. ఇంకా అర్థం కావలసిందేముంది?" అంది రోజ్, ఆ కళ్ళు అందంగా బరువెక్కిన ఆ రొమ్ములు – చంద్రుడికి అర్థంకాని భాషలో ఏవో చెపుతున్నాయి కాని, రోజ్ దురదృష్టం – ఆ భాష చంద్రుడికి తెలీదు – ఇవాళ ఆమెకు ఆకలి తీరని ఆహారం లభించింది.

చంద్రుడు తటపటాయిస్తున్నట్టు కనిపించడంతోటే – రోజ్ మళ్ళీ అంది:

"మాది వించ్ పేట, రైలు వెళ్ళగానే వెళ్ళిపోదాం. సిద్ధంగా ఉండండి, వాడికి ఇచ్చి పంపండి, రారా రాజ్!" అంది.

'రాజ్' అనబడే కుర్రాడు ముందుకు వచ్చాడు. చాలా తెలిసినట్టు ముందుకు వచ్చాడు. చాలాతెలిసినట్టు చంద్రుడి ముందు చెయ్యిజాపాడు. ఇవ్వడానికి అవసరం కనిపించకపోయినా, చెయ్యిజాపిన కుర్రాడిని – అలా ఆ అమ్మాయి ముందు కాదని పొమ్మనడం ఎలాగో చేతకాలేదు. చేతకాని అలాంటి సన్నివేశాల్ని కల్పించడం రోజ్‌కి చాలా చాతనయిన పనని అర్థం అయేలోగానే – పర్సు తీసి రెండు రూపాయి నోట్లు అతని చేతిలో ఉంచాడు – "నా దగ్గర ఇంతే ఉంది!" అంటూ.

కుర్రాడు ఈసారి ఆశ్చర్యపోయాడు – వీనస్ లాంటి తన అక్కయ్య సౌందర్యానికి ఇంతటి చవక ధర లభించినందుకు.

"ఇది విజయవాడ రైల్వేస్టేషన్. ఇంటికి పో" అంది రోజ్ నవ్వుతూ. కుర్రాడు తుర్రుమన్నాడు.

"నేను నీకెందుకు డబ్బివ్వాలో నాకర్థం కాలేదు. నువ్వు వించ్ పేటలో ఉంటే నాకేం? వినుకొండలో ఉంటే నాకేం?" అన్నాడు అంత డబ్బుని ఒక్కసారి ఇవ్వవలసి వచ్చినందుకు కాస్త కించపడి.

కనీసం నాలుగు రూపాయల ఖరీదయిన నవ్వుని అతని మీద గుప్పించింది ఆ మసక వెలుగులో.

"ఈ వ్యవహారాల్లో అర్థానికేముంది? ఎవరి ఇష్టం వాళ్ళది – వించిపేటకి కాకపోతే, మీకిష్టమయిన చోటికే వెళదాం" అంది. అనడంలో చెయ్యి అతని బుగ్గమీదకి పోనిచ్చి, ఒక్కసారి సుతారంగా మీటింది.

ఆనవ్వుకీ, ఆ సంకేతానికీ ఏదో అర్థం కనిపించి వెర్రివాడిలాగ చూశాడు చంద్రుడు. అతని విస్మయానికి ఆమె నవ్వు ఆకర్షణీయమయిన సమాధానం చెప్పింది.

"ఇదే స్థంభం. గుర్తుంచుకోండి. రైలు వెళ్ళాక వస్తాను" అంటూ ముందుకు నడిచిపోయింది. నాలుగు అడుగుల్లో పాలలాంటి దీపాల వెలుగులోకి జారిపోయింది. ఇంతలో రైలు ఇంజను రొద చేస్తూ పెట్టెలవేపు జారుతూ ఆమెకీ తనకీ అడ్డువచ్చింది.

చంద్రుడికి ఒళ్ళు జివ్వుమంది. తన శరీరాన్ని, బట్టల్ని ఒక్కసారి చూసుకున్నాడు. తను ఇంకా వయస్సులో ఉన్నట్లూ, ఆ బట్టలూ, ఆ అనుభవం సాక్ష్యం మరింత ధైర్యాన్నిచ్చింది.

వించ్ పేట ఎక్కడో అతనికి తెలీదు. తెలుసుకోవాలన్న ఆసక్తీ లేదు. కాని కేవలం ఆ ఆలోచనే అతనికెంతో తృప్తి కలిగించింది. లిప్ స్టిక్ రాసిన ఎర్రటి పెదవులు సగం కొరికిన ఏపిల్ పళ్ళముక్కల్లాగ ఉన్నాయి. చంద్రుడికి ఆకలి వేసింది. కాని, వాటి ఖరీదుకి తను తూగగలడా అని ఆలోచించుకుంటూ – మరొక్కసారి ప్లాట్‌ఫారం అంతా నడిచాడు.

రైలు కదిలేవేళ అయినట్టుంది. ప్రయాణీకులు ప్రయాణానికి తొందరపడుతూంటే, చంద్రుడి మనస్సు ఏదో అనుభవాన్ని ఆలోచిస్తూ అదిరిపడుతోంది. ఆ చిరునవ్వూ, ఆ కళ్ళూ – మళ్ళీ – అవన్నీ కనిపిస్తాయి – ఆ స్థంభం దగ్గరికి వచ్చేశాడు చంద్రుడు.

పల్చటి ప్లాట్ ఫారాన్ని జీరాడుతోంది. గార్డు విజిల్ వేశాడు. అనుకోకుండానే స్థంభం దగ్గరికి వచ్చేశాడు చంద్రుడు.

పల్చటి మేఘం చంద్రుడికి అడ్డు నిలిచి శీతకాలంలోని నజ్జు ఎండలాగ గుడ్డివెన్నెల వెలుగు వెచ్చగా ఉంది చంద్రుడికి.

రోజ్ పెదవులు పదే పదే గుర్తుకొస్తున్నాయి. రైలు ఇపుడు తనముందు నుంచి కదిలింది.

ఎవరో ప్రయాణీకులకి వీడ్కోలు ఇవ్వడానికి రైలుతోపాటు నడుస్తున్న స్టూడెంట్‌ని ఆపి– వించ్‌పేట ఇక్కడికి ఎంతదూరం?" అనడిగాడు చంద్రుడు.

"నాకు తెలీదు," అంటూ ముందుకు నడిచాడు కుర్రాడు.

రైలు వేగం పుంజుకుంటూంది. ప్లాట్ పారంలో మిగిలిపోయిన మనుషుల మధ్యనుంచి రోజ్ వస్తుందా అని చూస్తున్నాడు. రైలు పెట్టెలు ఏదో తెలియని, అలవాటుకాని సంగీతాన్ని ఆలాపిస్తున్నట్టనిపించింది. హఠాత్తుగా, దిమ్మెరపోయేలాగ తొందరగా ప్లాట్ ఫారం దాటిపోతున్న ఆఖరి పెట్టెలో కిక్కిరిసిపోయిన మూడోతరగతి పెట్టెలోని కిటికీలోంచి బయటికి చూస్తోంది. తనని చూసి చిరునవ్వుతో చెయ్యివూపింది. నిర్ఘాంతపోయాడు చంద్రుడు - ఆ చిరునవ్వులో కవ్వింపు కంటే క్షమాపణ ఎక్కువగా కనిపించింది. ఆలోచించేలోగానే రోజ్ దూరమయింది రైలుతో సహా.

చంద్రుడికి ఆశ్చర్యం దిగజారగానే - పకాలున నవ్వొచ్చింది. ఆ వెంటనే ఏదో భయంకరమయిన ఆలోచననుంచి విముక్తిలాంటిది కూడా తోచింది. ఆ విముక్తి ఖరీదు నాలుగు రూపాయలు. స్థంభానికి చేరబడ్డ చోట నల్లటి తారు అంటుకుంది. ఆలోచిస్తూ ముందుకు అడుగులు వేశాడు. దూరంగా జారిపోతున్న రైలు ఎర్రదీపమయి, చిన్నదయి, చివరికి శబ్దమయి మాయమయిపోయింది. చంద్రుడిలో రేగిన కోరికలాగానే.

ప్లాట్ ఫారం నిశ్శబ్దంగా ఉంది. హఠాత్తుగా ఓ దృశ్యం చంద్రుడి కళ్ళబడింది. వలజ వెనక నడిచిన ఎనుబోతులాంటి పోర్టరు. తులసితో మాట్లాడుతూ కనిపించాడు. తులసి అతన్ని ఏదో అడుగుతూంది. ఆమె ముఖంలో ఆత్రం, ఆందోళన చూసి భయపడ్డాడు. ఒక్క క్షణం కిందటే విముక్తం అయిన భయం మళ్ళీ అతనిలో చోటు చేసుకుంది. సడలిన కోరిక వీడి క్షణకాలమే అయినా, భార్యముందు దోషిలాగ నిలబెట్టింది. కాళ్ళు లేని తులసి - తనకంటే ఎన్నో ఉన్న అగ్ని శిఖలాగ కనిపించింది. ఆమె నిద్రలోంచి కూడా చాలా పవిత్రంగా మేలుకుంది. తనూ, రోజ్ మాట్లాడుకోవడం పోర్టరు చూశాడేమో! భర్తలోని చెడువర్తనకి కాక, అటువంటి పరిస్థితి అతనికి తటస్థపడినందుకే ఆమె ఆశ్చర్యపడుతుందేమో!!

తొందర తొందరగా దగ్గరికి వచ్చాడు చంద్రుడు. తులసి రాకని గమనించి త్రుళ్ళిపడింది. భర్తని గురించి మరొక వ్యక్తి, భర్తలేని సందర్భంలో వినడం ఏదో నేరంలాగ కనిపించి తలొంచుకుంది.

పోర్టరు తన రాకని ఇంకా గమనించలేదు. "ఆ అమ్మ పెద్ద సినిమా ప్రొడ్యూసర్ గారి పెళ్ళామమ్మా - చాలా డబ్బున్న మనిషి. అయ్యగారంటే చాలా తెలిసినట్టుంది..."

క్షణంలో విషయం అర్ధమయింది చంద్రుడికి. చేసిన నేరం తెలిసిందేమోననే భయం స్థానంలో, చెయ్యనిది నేరమయిందన్న కోపం ఇప్పుడు ఎక్కువయింది. వాడు చెప్పేది రోజ్ విషయమే అయితే తలవంచేవాడేమో! కాని, వలజ గురించి - ఏదో పెద్ద రహస్యంలాగ వాడు చెప్పడం, తులసి వినడం చాలా చికాకు, అసహ్యం కలిగించింది. ప్లాట్‌ఫారం అంతా గడగడలాడేటట్టు - తులసి మీద విరుచుకు పడ్డాడు చంద్రుడు.

"నీకు బుద్ధుందా లేదా? నా గురించి మరొకడిని అడిగి తెలుసుకోవలసినంత నేరం నేనేం చేశాను! నన్నే అడగొచ్చుకదా? అయినా, అవన్నీ అడిగి తెలుసుకోవలసిన అవసరం ఏముందు నీకు?"

సిగ్గుతో, భయంతో, దుఃఖంతో పిట్టయిపోయింది తులసి "నేనడగలేదు. ఎలా గ్రహించాడో నేనే మీ భార్యనని, వాడే వచ్చి చెప్పుకుపోయాడు" అంది.

ఎనుబోతులాంటి పోర్టరు - ఎప్పుడు తప్పించుకున్నాడో ఆ ప్రాంతంలో లేకుండా పోయాడు.

"ఇలాంటి వెధవ పనులు చెయ్యబట్టే - దేవుడు నిన్ను కుంటిదాన్ని చేశాడు. నోరుమూసుకు అక్కడ పడివుండు" అని కేకలు వేసి చక్రాల బండిని కాలుతో తోశాడు. ఆ ఉదుటుకి బండి ఊగి అయిదారు గజాలు ముందుకు దూకింది. చక్రాన్ని ఆపడంలో చెయ్యి ఊచల్లో పడి తిరిగి గిలగిలలాడింది తులసి. అయినా ఆమెకి బాధ రాలేదు. దుఃఖం వచ్చింది. అవును, అను చేసింది తప్పే. భర్త ఏదో

వెలితి అయిన పనిచేస్తున్నాడని ఎవరో చెపితే తనెందుకు వినాలి? సిగ్గుతో తలవొంచుకుని, పదిమందీ తనని చూస్తున్నారని తెలిసి, వెనక్కి బండిని నడుపుకుని గోడకి ఆనుకుని ప్రతిమలాగ కూర్చుండిపోయింది. బల్లమీద తల పట్టుకు కూచున్న భర్తని భుజమీద చెయ్యి వేసి జాలిగా పలకరించి –

"అలా కాస్సేపు తిరిగిరండి, మనస్సు స్థిమితంగా ఉంటుంది" అని ప్రార్థించింది. భార్యనయితే తిట్టగలిగాడేకాని, మల్లెపువ్వులాంటి పంచె మడత, అర్థరాత్రి పచార్లు, సినిమా మనిషి, అందమయిన భార్యతో కబుర్లూ – ఇవన్నీ భార్యకి ఎలాంటి కథను చెపుతాయో ఊహించుకుని, తనూ సిగ్గుతో క్రింగిపోయాడు. తన ఉదాసీనతకి ఆమె దెబ్బతింది. కాని, ఆమె ఉదాసీనత (ఒకవేళ కలిగినా) ఇంకా దయగా ప్రేమగా తనపట్ల జాలినే చూపుతోంది.

ఇక అక్కడ కూచోలేక, లేచి నడక ప్రారంభించాడు.

అప్పటికి సరిగ్గా అర్థరాత్రి అయినట్టు – ఎక్కడో గడియారం పన్నెండుసార్లు గుర్తు చేసింది.

***

## 9

**అంతవరకూ రంగరాజు** వైభవాన్నే చూశారు వలజా, కాంతయ్యగారూ. ఇప్పుడిక అంతవరకూ కనిపించని మరో కొత్త వ్యక్తిత్వం వారి కళ్ళముందు ఆవిష్కృతమయింది.

రంగరాజు వలజని చేపట్టదగినంత హోదా కలిగినవాడేమో కాని, ఇల్లరికం ఉండేంత అమాయికుడని కాంతయ్యగారనుకుంటే – అది పొరపాటే. అడవిలో అపురూపమయిన లేడి పిల్లను మచ్చిక చేసుకునే వేటగాడు – అడవిలో బ్రతకడానికే రాడు. లేడిపిల్లని మచ్చిక చేసుకుని తన్నుకుపోతాడు.

విశాఖపట్నంలో బాంబులు పడ్డ హడావిడి తీరిపోయాక ప్రజలు మళ్ళీ ఇళ్ళకు చేరుకుంటున్న రోజుల్లో – రంగరాజు విశాఖపట్నం వచ్చాడు మళ్ళీ. అప్పటికి కాంతయ్యగారి ఆరోగ్యం కుదుటపడ్డది. అందుకని రంగరాజు బయలుదేరడానికి ఇబ్బంది లేక పోయింది. అలా తరుచు విశాఖపట్నం వెళ్ళి వస్తూంటేవాడు తర్వాత్తర్వాత. ఓసారి వలజని తీసుకువెళ్ళి హార్బరు, బీచ్, ఉన్న నాలుగు వీధులూ తిప్పాడు. ఏరాడ కొండ, లోయతోట చూపించాడు. విశాఖపట్నమంతా తను కట్టించిన కోటలాగ గర్వంగా ఆమెను తిప్పాడు. వలజ చాలా సంతోషించింది. చాలా యోగ్యుడయిన భర్తని సంపాదించుకున్నందుకు మనసులో తనని తానే అభినందించుకుంది.

ఓ సారి రంగరాజు ఒంటరిగా విశాఖపట్నం నుంచి సిసలైన సిటీ మనిషిగా తిరిగి వచ్చాడు. జేబులో కోలసీసా, పీకవరకూ తాగిన స్కాచ్ విస్కీ వాసన చూసి, మొదట వలజ బెదిరిపోయింది. అంత మత్తులోనూ – ఆ అనుభవం తన భార్యకి కొత్తదేనన్న విషయం రంగరాజు మరిచిపోలేదు. తన బలహీనతల్లో కొన్ని ఆయువుపట్లని రంగరాజు చేతులో ఉంచుకున్నాడు. రాత్రంతా భార్యని పక్కన కూచోపెట్టుకుని, ఆధునిక జీవన సరళిలో విస్కీ ప్రాముఖ్యాన్ని గురించీ, తను బ్రతుకుతున్న సమాజంలో అది ఎలా ఏక్సెపెక్టెడ్ హేబిట్ గా చలామణీ అవుతున్నది వివరించి చెప్పాడు. ఆ ***మత్తులో మనిషి మరింత హుషారెక్కుతాడు. ఆలోచనలు పదునెక్కుతాయి. మరీ ఎక్కువయితే నిద్రపోతాడు.*** ఇదంతా ఆచరణద్వారా ఆమెకు నిరూపించి చూపాడు. వలజ అన్నిటినీ నాగరకతా లక్షణాలుగా అంగీకరించింది. ఆమె ప్రపంచంలో ఇలాంటి పానీయాలు తాగుతారు అన్నది కొత్త అలవాటు. ఇది ఆ ప్రాంతాలకు తన భర్తే మొదటిసారిగా తీసుకురావడం ఒక ప్రత్యేకతగా భావించింది. కాంతయ్యగారు ఆ సంగతి పసిగట్టి – ఒకటి రెండు సార్లు వలజని హెచ్చరించబోతే – "నీకేం తెలీదు నాన్నా! ఆయన తిరిగే మనుష్యుల మధ్య ఆ అలవాట్లు తప్పవు. అయినా, ఒకర్ని బాధ పెట్టేదేముంది ఇందులో? ఆయన అంతస్తుకి అది ఉండాలి" అంది. ఈ విధంగా రంగరాజు అంతస్తుని విస్కీ మార్కు అంతస్తుగా గుర్తుపెట్టుకుంది. ఆ

తర్వాత రంగరాజు మరెప్పుడూ కనుచాటు చేసి తాగలేదు. ఆ రోజుల్లోనే వేలుపిళ్ళై అనే పన్నెండేళ్ళ కుర్రాడిని మద్రాసునుంచి తెప్పించాడు. వాడు చాలా చురుకుపాలు, అయ్యకి ఎప్పుడు విస్కీ పొయ్యాలో, ఎప్పుడు సోడా ఇవ్వాలో, తాంబూలం అందించాలో - అన్నీ వాడికి తెలుసు. రంగరాజు ఆదాయంలో సగం ఎప్పుడూ వాడి జేబులోనే ఉండేది. కాలిదగ్గర కుక్కలాగ - నమ్మకంగా అయ్యగారిని అంటిపెట్టుకుని బ్రతికేవాడు వేలుపిళ్ళై.

తన బలహీనతల్ని భార్య అంగీకరించాక, భార్యద్వారా కాంతయ్యగారి నోరుకూడా దాదాపు మూసేశాక తన ఉద్యమాన్ని ప్రాతిపదికగా పంపిణీ సంస్థలో ఉద్యోగం మానుకుని గ్రామంలోనే మకాం పెట్టేసాడు రంగరాజు. విశాఖపట్నంలో తన స్థానంలో ప్రకాశరావు అనే యువకుడిని ఉద్యోగంలో వేయించాడు. ఒకసారి విశాఖపట్నం నుంచి వస్తున్నప్పుడు అనకాపల్లిలో అప్పలరాజుగారనే కోమటితో స్నేహం కలిపింది. ఆయన పెద్ద వ్యాపారి. శరీరమూ, వయసూ ఆదాయమూ - అన్నీ ఎక్కువే. అయినా, కోరికలు తీరకముందే అన్నీ పెరిగి - తీరే అవకాశం లేక, గిడస బారిపోయిన జీవితం ఆయనది. ఆయనకి సినిమా ప్రపంచమంతటే పెద్ద వ్యామోహం. సినిమా మనుషులంటే సాక్షాత్తూ దేవతలనే ఆయన ఉద్దేశం. ఆయనకీ, రంగరాజుకీ స్నేహం కలిసింది. ఒకరోజు రంగరాజుని అనకాపల్లిలో ఉంచేసి సమస్త ఉపచారాలూ చేయించి, ఘనంగా ఆతిథ్యం ఇచ్చి, అన్నిటితోపాటు లాంఛనంగా తన సాని దగ్గరికి తీసుకువెళ్ళాడు. సాని పేరు లక్ష్మణస్వామి, కదిలితే గజగజలాడే గజ్జెల పట్టెడ, సన్నటి మెడలో వెడల్పాటి జిగినీ, చంద్రహారాలు, కంటే, ఆరు అంగుళాలు వెడల్పు వడ్డాణం, అడ్డబాస, రూపాయంత బొట్టు, కస్తూరి వేసిన కమ్మటి తాంబూలం వాసన - నిలువెత్తు మనిషి లక్ష్మణస్వామి. నడిస్తే గజ్జెల గుర్రంలాగే ఉండేది.

చెట్టిగారి ఆతిథ్యంతో పరిచయమయిన లక్ష్మణ స్వామి దగ్గర అతిథిగా మరి మూడు రాత్రిళ్ళు ఉండిపోయాడు రంగరాజు. లక్ష్మణ స్వామికి సినిమా వ్యామోహమూ లేదు సినిమా మనుషులంటే వ్యామోహమూ లేదు. ఆ మాటకి వస్తే - కలకత్తాలో తెలుగు సినిమాలు తీసే సినిమాల్లో చాలామంది అనకాపల్లికి కారుల్లో వచ్చి తన దగ్గర ఉండి వెళ్ళినవాళ్ళే. ఆ మోజు లేకపోవడమనే తిరస్కారం ముచ్చటగా కనిపించింది రంగరాజుకి. ***ఆడదాని తిరస్కారంలోనే మగవాడి వీక్ పాయింట్ ఉంది.***

ఆ హుషారులోనే ఓ సారి కొత్త చిత్రాన్ని గ్రామంలో వేయిస్తూ, చిత్రప్రచారనికి లక్ష్మణస్వామి చేత మేజువాణి పెట్టించాడు. రెండు రోజులు తన ఇంట్లోనే ఉంచుకుని ఆతిథ్యం ఇచ్చి పంపాడు.

ఆమెను చూసి సినిమా తారలంతా ఇంత నిండుగా, విశాలంగా ఉంటారని ఊహించుకుంది వలజ. కాని ఆమెకు ఆశ్చర్యం కలిగించినదల్లా లక్ష్మణస్వామి తాగకపోవడం - వాళ్ళు తాగుతారని - ఆ హంగు ఆడవాళ్ళకీ ఉందని విందికాని, లక్ష్మణ స్వామికీ త్రాగుడికీ చుక్కెదురు. ఆ విషయంలో రంగరాజు జాగ్రత్తపడ్డాడు.

వలజ లక్ష్మణస్వామిని మర్యాద చేస్తూ "తాగుతావా? మా ఇంట్లో మంచి మంచి సీసాలున్నాయి," అంటే -

"ఆడవాళ్ళు తాగడమేమిటి? ఛీ" అంది లక్ష్మణస్వామి. అంతే కాదు, దానికి దైవభక్తి ఎక్కువ. ప్రతీ సాయంకాలం ఓ అరగంటసేపు ఆంజనేయస్వామికి పూజ చేస్తుంది. వలజకి ఇవన్నీ చాలా చిత్రమయిన అలవాట్లుగా కనిపించాయి.

ఏమైతేనేం? పల్లెటూళ్ళో, మామిడి తోపులో ప్రశాంతంగా బ్రతికే అమ్మాయిని - నాగరికత పేర, హోదాల పేరా, అదనపు సంస్కారం పేరా - 'డీ మోరలైజు' చేశాడు రంగరాజు. వారానికి రెండు మూడుసార్లయినా అనకాపల్లి వెళ్ళిరావడం అలవాటు చేసుకున్నాడు.

హఠాత్తుగా కాంతయ్యగారి వ్యాపారానికి దెబ్బ తగిలే సూచనలు కనిపించాయి. అక్కడికి నాలుగు మైళ్ళ దూరంలో ఉన్న పెద్ద మంతెన వీర్రాజుగారు బయస్కోపు కట్టించే ప్రయత్నంలో పడ్డారు. మామూలుగా అయితే - రంగరాజు పంపిణీదారులనో, లైసెన్సులలోనో బిగించి, ఆ పని జరగకుండా చేసి ఉండును. కాని ఇప్పుడు తాము బ్రతికే ప్రపంచం వేరు. అందుకని వీర్రాజుగారు విజయదశమికి

కొత్తబొమ్మ వేస్తున్నట్టు ప్రకటించేసరికి అందరితోపాటు రంగరాజూ ఆశ్చర్యపోక తప్పలేదు. అదీగాక, రంగరాజు చేపట్టాక డబ్బు వసూళ్ళు ఇబ్బందిలో పడి బొమ్మలు ఇవ్వడానికి విముఖత చూపుతున్నారు పంపిణీదారులు. కాంచనమాల బొమ్మలు, మంగరాజుగారి బొమ్మలు - అన్నీ వీర్రాజుగారి హాల్లోనే పడ్డాయి. బళ్ళు కట్టించుకుని జనం అటు విరగపడ్డారు. క్రమంగా, కాంతయ్యగారి హాలు ఆదాయం పడిపోయింది. టిక్కెట్లు ద్వారా వచ్చిన డబ్బు దాదాపు సీసాలకే సరిపోతూంది. అప్పులు పెరిగాయి. ***సరిగ్గా పోషించినంతవరకే సినిమా హాలు తిండిపెడుతుంది. లేకపోతే తినేస్తుంది,*** ఇదివరకులాగా అన్నీ చక్కబెట్టుకునే స్తోమతుపోయింది కాంతయ్యగారికి. అల్లుడి అలవాట్లు, వాటికి వలజ మద్దతు ఆయన్ని మరీ క్రుంగదీశాయి. ఆ శీతాకాలం ఆయనకి మరీ గడ్డుదయిపోయింది. ఉబ్బసంతో మళ్ళీ మంచమెక్కారు.

ముక్కోటి ఏకాదశినాడు కాంతయ్యగారు కన్ను మూస్తారనగా ముందురోజు - ఆయన చేజేతులా నిర్మించి పెంచిన సినిమా హాలు ఎత్తేయడం, దాని స్థానే రైసుమిల్లు కాంట్రాక్టుకి ఇవ్వడం కళ్ళారా చూశారు. ఆ తర్వాత మరి ఇరవై గంటలు బ్రతికారాయన. మొగుణ్ణి అదుపులో పెట్టుకోగలిగితే - ఆ రైసు మిల్లు అద్దెతోనయినా సుఖంగా గడుస్తుందని కూతురికి నచ్చచెపుతూనే అర్థరాత్రి కన్నుమూశారు.

కాంతయ్యగారు చచ్చిపోయిన మర్నాడంతా రంగరాజు స్పృహలో లేడు. శవాన్ని తీసుకు వెళ్ళడానికి, తక్కిన క్రియలు చెయ్యడానికి ఉన్న ఒక్క అల్లుడు అందిరాకపోయేసరికి, అంతా ఏం చెయ్యాలో అర్థంకాక ఆగిపోయారు. ఎవరో ఒకరు ఆ పని ముగించాలి కనక - వలజ బ్రతిమాలి చంద్రుడిచేత ఆ కాండ కాస్తా అయిందనిపించింది. ఆ మర్నాడెప్పుడో రంగరాజుకి తెలివొచ్చి, మామగారు పోయాడని విని విస్కీ సాక్షిగా విలపించాడు.

వలజకి జీవితంలోని చేదునిజాలు అప్పుడూ అర్థంకాలేదు. రంగరాజంటే అసహ్యం కలగలేదు. రంగరాజుకి స్పృహ లేని సమయంలో - వీలుకాని సమయం చూసుకుని నాన్న చచ్చిపోయినందుకు నొచ్చుకుంది.

*చిన్నప్పటినుంచీ కాంతయ్యగారు వలజని ముద్దుచేసి - దేన్నయినా శాసించి పుచ్చుకోవడమే నేర్పారు కానీ, ప్రేమని ఇచ్చుకోవడం నేర్పలేదు. ఇప్పుడు ఈ చివరి క్షణాల్లో ఆయనకి వలజ కన్నీళ్ళు కూడా లభించలేదు. అది ఆమె తప్పుకాదు. ఆమెకి కన్నీరు పెట్టుకోవడం చాతకాదు.*

కాంతయ్యగారు పోయాక రంగరాజు ఉద్యమంలో రెండవ మజిలీ ప్రారంభమయింది. ఆ తర్వాత కార్యక్రమం బహుస్వల్పం. ఆ గ్రామంలో కాంతయ్యగారికి ఉన్న చిల్లర మల్లర ఆస్తిపాస్తులన్నింటికీ ధరకట్టించి, అమ్మి అప్పులు పోను మిగతా డబ్బు మూట కట్టుకుని మద్రాసు ప్రయాణం కట్టాడు భార్యతో సహా.

ఉన్న ఊరునీ, ముఖ్యంగా ఆ మామిడితోపునీ, అందులో పాకనీ, గుర్రబ్బగ్గీని, సినిమా హాలునీ, చంద్రుడినీ - ఆ జ్ఞాపకాలనీ వదులుకోవాలంటే దిగులువేసింది వలజకి. కాని, తాను ఎన్నడూ చూడని మరో కొత్త ప్రపంచం అక్కడ మద్రాసులో - వేచి ఉంది. అది ఎంతో గొప్పగా అపూర్వంగా ఉంటుందని నమ్మించాడు రంగరాజు. అక్కడ వీలయితే సినిమా తీసే ప్రయత్నం చెయ్యవచ్చునన్నాడు. జ్ఞాపకాల తీపికంటే, ఆశయాల తీపి ఎక్కువయి - బయలుదేరడానికి ఉరకలు వేసింది వలజ. వెళ్ళేటప్పుడు కాదంటున్నా వినకుండా - ఏభై రూపాయలు చంద్రుడి జేబులో పెట్టింది. అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాయమని పదే పదే చెప్పింది.

రంగరాజు ఓ డొక్కు కారు సంపాదించి అందులో ఆమెనీ, వెళ్ళగలిగినన్ని సామాన్లనీ ఎక్కించాడు. మిగతా సామాన్లు వేలుపిళ్ళేని వెనక రమ్మన్నాడు.

ఆ డొక్కు కారులో - తెలియని భవిష్యత్తులోకి ప్రయాణం ప్రారంభించింది వలజ - తెలిసిన వర్తమానాన్నీ, చంద్రుడినీ, పెరిగిన గ్రామాన్నీ వదులుకుంటూ.

*చంద్రుడు జీవితంలో ఎన్నోసార్లు కన్నీరు కార్చలేదు. కాని కార్చిన తక్కువ సందర్భాలలో అది మొదటిది.*

10

ఎనుబోతులాంటి పోర్టర్ని వెంటబెట్టుకుని మేడమెట్లు దిగి వచ్చింది వలజ. వదులుగా ఎర్రటి క్రేప్ చీరకట్టుకుని, మీద ఎర్రటి అద్దాలు తాపించిన శాలువ కప్పుకుంది. సెకండ్ క్లాస్ వెయిటింగ్ రూం పక్కన చక్రాల బండిలో నిద్రలాంటి మగతతో ఉన్న తులసిని అతి సుతారంగా తట్టి లేపింది.

"మిమ్మల్ని చాంద్ కొట్టాడట?" అంటూ.

ఎనుబోతులాంటి పోర్టరు హిగ్గిన్ బాదమ్స్ స్టాలు తలుపు చాటుకి వత్తిగిలాడు.

బిత్తరపోయి పిచ్చి చూపులు చూసింది తులసి. అప్పుడే నిద్ర నుంచి తేరుకుని. "నా పేరు వలజ. మీ ఆయనా నేనూ చిన్నప్పటినుంచీ ఒక చోటే పెరిగాం. మీ ఆయన్ని ఆ రోజుల్లో నన్ను పెళ్ళిచేసుకోమని ఒకటే వేధించేదాన్ని. చేసుకోనన్నాడు. చేసుకుని మిమ్మల్ని కొట్టినట్టు నన్ను కొట్టివుంటే - ఎదురు దెబ్బ తీసేదాన్ని. మీలాంటి అమాయకురాల్ని ఆ ఫూల్ ఎలా కొట్టాడసలు?" అంది గుక్క తిప్పకుండా. అధికారానికి అలవాటుపడ్డ గొంతులో అభిమానం. ఆప్యాయత నప్పటంలేదు.

"ఆయన నన్ను కొట్టలేదు," అంది తులసి చక్రంలో పడిన చెయ్యిని అరచేత్తో నొక్కుకుంటూ.

"మీ పేరు?"

"తులసి?"

"మిమ్మల్ని నేను రెండు గంటలక్రితమే కలుసుకోవలసింది. నేను కలుస్తానంటే మీ ఆయనే వద్దన్నాడు. మీ ఆయన మొదటి నుంచీ వట్టి పెంకి ఘటం! ఎలా కాపురం చేస్తున్నారో అలాంటివాడితో!" తులసి ఆమె మాటల ధోరణికి ఆశ్చర్యపడిపోయింది. నోటమాట రాక.

"నీరసంగా ఉన్నారు. రాత్రి భోజనం చెయ్యలేదా?" అంది వలజ.

"లేదండీ నేనెప్పుడూ రాత్రి భోజనం చెయ్యను."

"డబ్బున్న వాళ్ళూ - నాలాగ శరీరం ఉన్నవాళ్ళూ ఉపవాసం చెయ్యాలి. మీకేం? నాజూకుగా చిలకలాగా ఉన్నారు. ఉండండి. పళ్ళు తెప్పిస్తాను."

వద్దనడానికి తులసికి అవకాశం ఇవ్వలేదు వలజ. ఎనుబోతుని పిలిచి - గది తాళం ఇచ్చి - ఏపిల్ పళ్ళు తీసుకురమ్మంది. వాడు తాళాలు పుచ్చుకుని పరిగెత్తాడు - శరీరం ఊపుకుంటూ.

ఎగ్జిబిషనులో రబ్బరు బొమ్మని చూసినట్టూ - ఆప్యాయంగా తులసిని నఖశిఖపర్యంతం గమనించింది వలజ.

"మీరెంత అందంగా ఉన్నారో!" అంది అనుకోకుండా.

తులసి ఆ మాటకి సిగ్గుపడిపోయింది. ఆ మాటలు తన నోటంట రావలసిందనుకుంది వలజను చూస్తూ

"నాకు కాళ్ళు లేవు" అంది అప్రయత్నంగా.

"ఉండి మేం మాత్రం నడవగలుగుతున్నామా? అందమయిన వస్తువుకి చలనం ఉండకూడదు," అంది - ఆకుపచ్చటి ఖద్దరు రవికె అంచును పరికిస్తూ మళ్ళీ-

"కాళ్ళెందుకు లేవు? చాందేనా కారణం?" - అంది వలజ.

***

**"ఛీ ఛీ! ఆయనేం కాదు.** ఆయన దేవుడు. ఈ మాత్రం తిరగడానికేనా ఆయన పెట్టిన భిక్షే కారణం" అంది తులసి. ఆ మాటలంటునప్పుడు - కృతజ్ఞత కన్నీళ్ళ రూపంలో బయటపడడం చూసి వలజ నివ్వెర పోయింది.

"ఏడుస్తారేం?" అంది - సినిమా ఏడుపు తప్ప - కన్నీళ్ళలో మరో అందం తెలీని వలజ.

చిరునవ్వుతో కళ్ళను తుడుచుకుంది తులసి. ఆ చిరునవ్వులో - ప్రపంచంలో ఏ పాతకాన్నయినా క్షమించగల ఔదార్యం - ఏ ఆనందమూ ఇవ్వలేని తృప్తీ కనిపించాయి. అది చూసి మరీ విస్మితురాలయింది.

"మీరేం తింటారు ఇంత గొప్పగా ఉండడానికి? - నేను బంగారం తింటాను - కాని, నేనిలా ఉంటానేం ఏనుగులాగ?"

"నాలో ఏం గొప్పతనం లేదు!" అంది తులసి సిగ్గుపడుతూ,

ఆ సిగ్గులోనూ ఎంతో అమాయకత్వం కనిపించి ఆశ్చర్యపోయింది వలజ.

*అర్థంకాని ఆటబొమ్మని చేతికిస్తే, పసివాడు ప్రతీ కీలూ పరీక్షగా చూస్తాడు. అది కదిలినా, చప్పుడు చేసినా, ఆడినా, కింద పడినా, పడకపోయినా - అంతా అపూర్వంగా, అపురూపంగా ఉంటుంది. తనకి తెలియని ప్రపంచమంతా కళ్ళముందు ఒక్కసారి సాక్షాత్కరించినట్టు పొంగిపోతాడు.* అట్లాంటి తృప్తి ఏదో తులసిని చూస్తున్న కొద్దీ వలజకి కలిగింది.

"చెప్పండి! మీతో చాంద్ ప్రేమగా ఉంటాడా?" అంది వలజ, అలాంటి ప్రశ్నలకి ఏ స్త్రీ సమాధానం చెప్పదని తెలీక, సినిమా ప్రపంచంలో వేయకూడనివీ - చూడకూడనివీ నవ్యత పేర చెలామణీ అయినట్టు - వలజలోని వెర్రితలలన్నీ అలాంటి ప్రశ్నలుగా రూపొందాయి.

నవ్వేసింది తులసి.

"చెప్పరా!" అని భుజం కుదిపింది చిన్నపిల్లలాగ.

"ఆయన్ని చిన్నప్పట్నుంచి తెలుసన్నారుగా? - మీకు ఆయన స్వభావం తెలీదా?" అంది తులసి.

"ఎందుకు తప్పించుకుంటారు? సూటిగా చెప్పండి?" అంది, వలజ.

"నాకు ప్రేమంటే తెలీదు. ఆయనకీ తెలీదనుకుంటాను. మేమెప్పుడు అలాంటి విషయాలు మాట్లాడుకోలేదు. నాకు జబ్బు చేస్తే రాత్రిళ్ళు నా పక్క దగ్గర గడిపారు. నేను చలిగాలిలో బయటికి వస్తే ఆయనకి వెర్రికోపం వచ్చేది. ఒకసారి నన్ను కొట్టారు కూడాను. అదేనేమో ప్రేమంటే!"

అప్రతిభురాలయి ఆమెను గమనిస్తూ ఉండిపోయింది వలజ.

తనతో వేళాకోళం ఆడుతోందేమోనని మొదట సూటిగా గమనించింది. కాని లేదు. ప్రతీమాట నమ్మి, గుర్తుకు తెచ్చుకుని - ఆ అనుభవం పట్ల ఎంతో గౌరవంతో, భక్తితో ఏదో అపూర్వమయిన అనుభూతిని పంచి ఇస్తున్నట్లు చెప్పింది తులసి.

"ఇదా ప్రేమంటే!" అంది వలజ, విస్కీ పెదవులతో రంగరాజు ముద్దుల్ని, కారు ఏక్సిడెంటులో దెబ్బలు తగిలితే - రెండువేల ఖర్చుతో చేయించిన కాలు ఆపరేషన్నీ, తనకోసం ప్రత్యేకంగా కొన్న కెనేడియన్ జాతి కుక్క పిల్లలని గుర్తుచేసుకుంటూ.

"మరెలా ఉంటుంది?" అంది తులసి.

"మీరు భలేవారే! ఆ పిచ్చి వాడికి తోడు మరో పిచ్చివాళ్ళు పోగయారు" అంది వలజ. అంతలో ఓ చిన్న సన్నివేశం గుర్తుకొచ్చింది. కిందకి వంగి తులసి చెవిలో చెప్పింది.

"మేం ఆడుకునే రోజుల్లో ఒకసారి మా మావిడి తోపులో మామిడికాయ కోశాడు చాంద్. నేను పరుగెత్తికు వచ్చి నాకూ పెట్టమన్నాను. అప్పటికే ఎంగిలి చేశాడు. మంచి పరువానికి వచ్చిన కాయ. ఎంగిలి కనక పెట్టనన్నాడు. నా కదే కావాలన్నాను. ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. ససేమిరా ఎంగిలి ఇవ్వనన్నాడు. నేను లాక్కోబోయాను. మీదపడి రక్కాను. తప్పించుకున్నాడు. కాని ఇవ్వలేదు.

మా తోటమాలిని పిలిపించి చంద్రుణ్ణి కొట్టించి ఆ కాయలాక్కున్నాను. కసిగా అతని ముందే ఆ ఎంగిలి కాయనే తినేశాను. బిక్కమొహం వేసుకుని తోటలోంచి వెళ్ళిపోయాడు చంద్రుడు. ఆ తర్వాత, చాలా విచారించాను చంద్రుడిని కొట్టించినందుకు. అప్పుడే కాదు, ఇప్పుడు అది తలుచుకుని, అతని జాలి ముఖం గుర్తుచేసుకుంటే బాధగా ఉంటుంది. తర్వాత, పెద్దవాళ్ళమయాక - మామిడితోపంతా ఎన్నో కాయలు కాసేది. కాని, ఒక్క కాయా చంద్రుడు ముట్టుకోలేదు. అంతేకాదు. ఎన్నడూ మామిడికాయ తినలేదు."

"నిజం, మామిడికాయ పళ్ళు ఆయన తినరు" అంది తులసి కూడా.

ఇద్దరూ ఒక గొప్ప రహస్యాన్ని పంచుకున్న ఆప్తుల్లాగ అయిపోయారు.

"నాదే పొరపాటు - ఆనాటి నా పొగరువల్ల ఇవాళ్టికీ చాంద్ శిక్షని అనుభవిస్తున్నాడు. కమ్మని మామిడి పండు తినని బ్రతుకేమిటి?" అంది వలజ. ఎనుబోతు - నాలుగు ఆపిల్ పళ్ళూ, వెండి నగిషీ చేసిన కత్తీ తెచ్చాడు. తాళం గుత్తి వలజ చేతిలో ఉంచి మాయమయాడు. ఎర్రటి శాలువను ఒళ్ళో పరచి - పొందికగా ముక్కలు తరిగింది వలజ.

"తినండి!"

"అబ్బే! నాకు అలవాటు లేదు."

"మంచివారే! *ఆపిల్ పళ్ళు తినడానికీ, పండు వెన్నెల్లో నిద్రపోవడానికి అలవాటేమిటి?* ఇది విషం కాదు. మిమ్మల్ని పదహారేళ్ళ క్రిందటే నాకెందుకు తెలీదా అని అనిపిస్తోందిప్పుడు. అందం, అమాయకత్వం ఇంత ఆకర్షణీయంగా ఉంటాయని నాకు తెలీదు. తినండి!" అని తొందర చేసింది. బండి చక్రంలో పడ్డ వేళ్ళు కదిపితే జివ్వుమంటున్నాయి. ఈ చెయ్యి తియ్యడానికి వీలులేదు. అయినా, నొప్పి తెలియకుండా ఆపిల్ ముక్కను అందుకోబోతే - రక్తం చిమ్మిన నాలుగు వేళ్ళూ వలజ కంటబడ్డాయి.

"అదిగో చేతికి దెబ్బ! కొట్టలేదంటారేం? ఆ బ్రూట్‌ని మీరు క్షమించకూడదు."

దెబ్బ తగిలిన చేత్తోనే ఆమె నోరు మూసింది తులసి. "గట్టిగా అరవకండి! ఆయన వింటే బాధపడతారు. ఇది ఆయన కొట్టిన దెబ్బ కాదు. నేను తెచ్చుకున్నా. చెయ్యి బండిలో పడింది." అందితులసి.

దెబ్బ తగిలిన నాలుగువేళ్ళనీ చేతిలోకి తీసుకుని నెమ్మదిగా రాసింది వలజ. ఆపిల్ ముక్కల్ని నోటికి అందించింది. ఈ పదహారేళ్ళలో మారిన వ్యక్తిత్వం - ఇలా ఈ క్షణంలో ఉపయోగానికి వచ్చింది.

"ఇలాంటప్పుడు తగిలిన దెబ్బలు నాకెంత మేలు చేస్తాయో మీకు తెలీదు. ఈ దెబ్బల్ని చూసి ఆయన గుండె కరిగేలా జాలిపడతారు. మరి నాలుగయిదు నెలలు ఆయన మనస్సు మెత్తబడిపోతుంది. ఆ నాలుగయిదు నెలలూ కలలాగ తియ్యగా గడిచిపోతాయి -" కంఠంలో గాద్గదికం చూసి దుఃఖం అనుకుని జాలిపడింది వలజ.

"అంటే - ఏం చేస్తాడేం?" అని అడిగింది.

"నన్నేమీ అనరు. నేనేం వండితే అది తిని లేచిపోతారు. నాతో ఏం మాట్లాడరు. నా కుంటితనానికి విసుక్కోరు. ఆయన దృష్టిని పడితే సహాయం చేస్తారు - రాత్రిళ్ళు ఆయనకి పక్క వెయ్యనిస్తారు. పొద్దుటే కాఫీతెస్తే పలకరిస్తారు."

వలజకి కన్నీళ్ళు అప్రయత్నంగా కమ్ముకొచ్చాయి. "ఇవా మీరనుభవించే అదృష్టాలు! - మీకు తగిలిన దెబ్బలకి లభించే ప్రతి ఫలాలు! మీరు కనే కలలు!"

వలజ వెక్కిరింత తులసి ఆనందాన్నేమీ చెదరగొట్టలేదు. కాగా, ఆ ఆనందం అలాంటి వెక్కిరింతకి మరింత పెరిగినట్టు అనిపించింది."నీకేం తెలుసు ఈ ఆనందం?" అన్న నిర్లక్ష్యం ఆ చూపులో, ఆ నవ్వులో కనిపించింది.

*ఆకాశం మీద ఎగిరే పక్షి నేలమీద ఠీవిగా నడిచే లేడిపిల్లని చూసి అబ్బురపడుతుంది. నేలమీద నడిచే లేడిపిల్ల తనమీద విచ్చలవిడిగా ఎగిరే పక్షిని వింతగా చూస్తుంది.*

"ఇలాంటి ఆప్యాయతల మధ్య మీకు పిల్లలెలా కలిగారబ్బా!" అంది వలజ గడ్డం కింద చెయ్యి పెట్టుకుని.

"అది నా అదృష్టం. మా బాబుకూడా బ్రతికివుంటే - ఇప్పటికి పదేళ్ళవాడు అయివుండేవాడు," అంది తులసి.

కొడుకు పుట్టడంలో సంతోషం, వాడు లేకపోవడంలో దుఃఖం - ఈ రెండూ తెలీని వలజ ఆమెను విచిత్రంగా చూసింది.

"పెద్దమ్మాయికి ఎన్నేళ్ళు?"

"పదహారు. దానికి త్వరగా పెళ్ళిచేసేశారు. త్వరగానే కొడుకు పుట్టాడు. మా మనవడిది ఆయన పేరే!" అదేదో అద్భుతంలాగా చెప్పింది తులసి.

అలా ఆనందంగా చెప్పుకోవలసిన అనుభవాలు - ఏమైనా తన జీవితంలో ఉన్నాయా అని వెతుకుతూంది వలజ. ఎక్కడో ఏవో మసక బారిపోయిన చిన్న చిన్న జ్ఞాపకాలున్నాయి. అవి అనుభవాలుగా ఎదగని చిన్న చిన్న సన్నివేశాలు.

"మీరు సినిమాల్లో వేషాలు వేస్తారా?" అని అడిగింది తులసి అమాయకంగా,-

వలజ నవ్వింది - "నేను వెయ్యను. మా ఆయనకి ఇష్టం లేదు. కాని, సినిమాల్లో చాలామంది చేత ఆయన వేషాలు వేయిస్తుంటారు. ఏం? మీకు చూడాలని ఉందా?"

"అమ్మయ్యో! నాకు చచ్చేంత సిగ్గు!" అంది తులసి ముఖం ఎర్రబరచుకుని.

"ఏం సిగ్గు ఎందుకని? వాళ్ళు సినిమాల్లో నటించి ధనవంతులవుతున్నారు. *మీకు వాళ్ళు అందరాని దేవతల్లాగ కనిపిస్తున్నారు. ఈ వ్యాపారంలో ఉన్న తమాషాయే అది. ఏది వాస్తవమో - అది దూరంగా, స్వచ్ఛంగా, పవిత్రంగా, ఎక్కడో ఉంటుంది. ఏది కృత్రిమమో, అది గొప్పగా అందంగా అపురూపంగా దర్శనమిస్తుంది. పవిత్రతని ఊహించుకుని ఆడంబరాన్ని అంగీకరిస్తారు ప్రజలు."* వేదాంతిలాగ ఆపిల్ ముక్కల్ని నములుతూ అంది వలజ.

ఉన్నట్టుండి "మీరు మద్రాసు వస్తున్నారటగా? వచ్చినప్పుడు మా ఇంటికి వస్తారా?" అనడిగింది వలజ.

"ఏమో, ఆయనకి ఇష్టముంటే.."

"చాంద్‌కి ఇష్టంలేకపోవడమేమిటి? చెవి పట్టుకుని లాక్కుపోతాను. మీరు రావడమే నాకు ముఖ్యం. చెప్పండి. వస్తారుగా మీకోసం నా కారు పంపుతాను."

సిగ్గుతో, ఏదో భయంతో తులసి నాసికాపుటాలు ఎగిరిపడ్డాయి. ముఖం కందగడ్డయిపోయింది.

"అక్కడ మీతో ఎంతమంది ఉంటారు?"

"అదే మా దురదృష్టం. పెద్ద పెద్ద భవంతులు కట్టుకుని - అందులో ఒంటరిగా తోచి చావక ఏడుస్తుంటాం మేము. ఇప్పుడు చూడండి. ఇంతమంది మధ్య మీరు హాయిగా కూచున్నారు. అక్కడ ఒంటరిగా నేను తోచక చస్తున్నాను. ఈ గందరగోళం, అల్లరీ, అలజడీ నాకెంత ఇష్టమో మీకు తెలీదు. మద్రాసు వస్తే, మీతోటే నేను రోజంతా గడుపుతాను," అంది వలజ లేస్తూ.

ఆమె ఆప్యాయతకి తులసి వణికింది. ఆ వణుకుని గమనించి తన చుట్టూ ఉన్న ఎర్రటి శాలువా తీసి తులసి చుట్టూ కప్పింది. తులసి తెల్లబోయి చూస్తుంటే - "ఉండనివ్వండి - మీరు మా ఇంటికి రావాలన్న గుర్తుగా ఉంటుంది. చాంద్ ఎక్కడో ప్లాట్ ఫారమ్ మీద తిరుగుతున్నట్టున్నాడు. కనిపిస్తే నేను రమ్మన్నానని చెప్పండి," అంటూ లేచి వెండి పొన్నుగల చాకు తిప్పుకుంటూ నడిచి వెళ్ళిపోయింది వలజ.

ఎవరో దేవత ప్రత్యక్షమయి తన సాన్నిధ్యమనే వరాన్ని ప్రసాదించి, అంతలో మాయమయినట్టు భావించుకుంది తులసి. ఆ దేవతా సాక్షాత్కారానికి గుర్తుగా ఎర్రటి శాలువా వంటిమీద ఇంకా మెరుస్తోంది. ఏపిల్ ముక్కలు ఇంకా బల్లమీద ఉన్నాయి. ఆమె దృష్ట్యా లోగడ ఎన్నో మధురక్షణాలు గడిచివుండవచ్చు. కాని, ఇది తులసి జీవితంలో చాలా 'ఖరీదయిన' క్షణాలు.

## 11

కాంతయ్యగారు కన్నుమూయడంతో రంగరాజు జీవితంలో కొన్ని సమస్యలు విడిపోతే - చంద్రుడి జీవితంలో కొన్ని సమస్యలు కూడుకున్నాయి. సినిమా హాలు పోయి రైసు మిల్లు ఏర్పడుతున్నవేళ ఇద్దరే ఆ మార్పుకి బాధపడ్డారు. కాంతయ్యగారు, చంద్రుడు. మర్నాడు తనకి ఇక ఆస్కారమేమిటో అర్థంకాని పరిస్థితుల్లో రాత్రి మాగన్నుగా నిద్రపోబోతే - ఓ రాత్రివేళకి ఎవరో లేపారు - కాంతయ్యగారికి వచ్చే ప్రాణం పోయే ప్రాణంగా ఉందని. ఆ రాత్రి మరోగంటకి ముక్కోటి ఏకాదశి మొదటి ఝాముున కాంతయ్యగారు పోయారు.

తెల్లవారాక - రంగరాజు ఎంతకీ రాక బాధపడే సమయంలో - తానయి చంద్రుడు ఆదుకుని, తనకి మొదటినుంచీ అండగా నిలిచిన కాంతయ్యగారిని బుగ్గిచేసి వచ్చాడు. తన తండ్రిపోయాక కుటుంబానికి ఇంత ఆస్కారం కల్పించి, తల్లిపోయాక కూడా తనని పద్నాలుగు సంవత్సరాలుగా చేరదీయడం, ఆఖరికి - తనచేత ఈ చివరి కర్మ చేయించుకోడానికేనేమో ననిపించింది. ఏమైనా, అంతా అసంకల్పితం. రంగరాజు కాక, అతనే అల్లుడయివుంటే, ఆ పని అలాగే జరిగేది, ఇప్పుడయినా మరో విధంగా కర్మ జరగనే జరిగింది.

వలజ కారు వెళ్ళిపోయేవరకూ ఆ దారినే చూస్తూ గ్రామం చివరవరకూ నడిచి, అభాషలో వలజా ఓదార్చింది. ఇప్పుడు ఈ శూన్యం నుంచి తనని ఎవరూ రక్షించి లేరనిపించింది.

రాత్రి శ్మశానం వేపు నక్కలు పరిగెత్తే వేళవరకూ అక్కడే గడిపి, ఇంటికి నడిచి వచ్చాడు. జేబులో వలజ ఇచ్చిన ఏభై ఉన్నాయి. మర్నాటినుంచీ ఏం చెయ్యాలి? ఉద్యోగం లేదు, ఆదరించే దిక్కులేదు.

అయినా, ఎదురొచ్చిన అవసరాలను తీర్చుకోవడమే తప్ప, రాబోయే అవసరాలను ఎదుర్కొనే సన్నాహం చంద్రుడికి కొత్త, ఇప్పుడు ఈ ఏభై రూపాయలు అక్కరకు వచ్చాయి. అలా మూడు నెలలు పిచ్చిగా - ఆ గ్రామంలోనే తిరుగుతూ గడిపాడు.

ఇప్పుడు కాంతయ్యగారి సినిమా హాలులో రైసుమిల్లు నడుస్తోంది. తను తిక్కెట్లు అమ్మే చిన్నగదిలో నైట్ వాచర్ పెద్ద జాగిలాని పెట్టుకుని ఇరవైనాలుగ్గంటలూ కునుకు తీస్తూ ఉంటాడు.

హాలులోంచి బల్లలూ అవీ తీసేశారు. ఏవో పెద్దయంత్రాలు శబ్దం చేస్తూ పగలంతా కదులుతుండేవి. ధాన్యపు పొట్టు ఆ ప్రాంతమంతా రేగుతుండేది. సాయంకాలం వేళ ఆ ప్రాంతీయుల అభిరుచుల్ని తీర్చే ఆ ఆవరణ ఇప్పుడు వాళ్ళ ఆకలికి తీర్చడానికి వినియోగపడుతుంది. ఆ చావిడిలో కూర్చున్నంతసేపు కూర్చుని ఇంటికి పోయేవాడు. రైసు మిల్లులో పని దొరుకుతుందేమోనని చూశాడు. కాని తనకి పనిలేదు. యంత్రాన్ని నడిపే మనుషులిద్దరు, పదిమంది కూలీలు, ఒక ముసిలి గుమాస్తా, రాక్షసుడివంటి నైట్ వాచరు, పెద్దకుక్క - ఇంతే ఉద్యోగులక్కడ. తనకి టిక్కెట్లు అమ్మడం తప్ప మరేమీ చేతకాదు. అలాంటి నాజూకయిన ఉద్యోగం అక్కడేమీ లేదు.

రోజులు గడిచేకొద్దీ, ముందురోజులు ఎలా గడపాలా అన్న సమస్య ఎక్కువగా కనిపించసాగింది. ఎవరో విశాఖపట్నంలో ఉద్యోగాలు దొరుకుతాయని చెప్పారు. జేబులో ఉన్న ఏడు రూపాయలతో చోడవరం వరకూ నడిచివచ్చాడు. చివరిసారి తన గ్రామన్ని వదిలిపోతూ, వదలిపోయే రోజు రైసుమిల్లూ - కాంతయ్యగారి మామిడి తోపూ - తను పుట్టి పెరిగిన పాక, అటు శిథిలమయిన బడి మళ్ళీ మళ్ళీ చూస్తూ ఆ గ్రామంలోని నాలుగువీధులూ పిచ్చిగా తిరిగాడు. చీకటి పడుతూ, పడుతూండగా చోడవరం బయలుదేరిపోయాడు. అక్కడ నుంచి రూటు బస్సులో విశాఖపట్నం చేరుకున్నాడు.

అదో కొత్తప్రపంచం. అక్కడ తనకెవరూ తెలీదు. ఏం చెయ్యదలచుకున్నాడో తెలీదు. తనకే ఉద్యోగం చేతనవునో తెలీదు. ఉన్న రెండుమూడు సినిమా వాళ్ళ చుట్టూ తిరిగాడు. ఎవరూ తనమాట వినిపించుకోలేదు. అక్కడ టిక్కెట్లు అమ్మేవాళ్ళు తనకంటే షోకైనవాళ్ళు; తనకంటే తెలివితేటలున్న వాళ్ళు. ఆ ఉద్యోగాలు పెద్దవి. రూపాయలు తొందరగా కరిగి పోయాయి. వలజ ఇచ్చిన డబ్బులో

చివరి రెండురూపాయలతో ఇక విశాఖపట్నంలో ఉండడానికి భయమేసి బస్సెక్కి చోడవరం వెళ్ళిపోదామని బస్సుడిపోకి వస్తే ఎవరో జేబు కొట్టేశారు. మాసిపోయిన జేబుకి కన్నం చూసుకుని, ఇక ఏం చేయాలో తెలీక భయమేసి ఏడ్చేశాడు చంద్రుడు. అదిగో, అప్పుడు పరిచయమయ్యాడు నరసయ్య.

***

మబ్బు చాటున మకిలి పట్టిన చంద్రుడిలాగ ఉన్న చంద్రుడిని చూసి జాలిపడ్డాడు. జాలిపడడమంటే ఏదో సాయం చెయ్యడానికి ఆపద్ధర్మంగా ఆదుకున్నవాడు కాదు నరసయ్య. అందుకాయన పెద్ద ధనవంతుడూ కాడు. ఆ రోజుల్లోనే పాతుకుంటున్న బూల్‌చంద్ అనే పార్సీ వాళ్ళ బట్టల కొట్టులో పాతిక రూపాయల గుమస్తా నరసయ్య. వయసు అరవైకి దరిదాపు ఉంటుంది, తెల్లగా నెరిసి పోయిన పలచటి జుత్తూ, మాసిపోయిన ఫిన్లే పంచె (బూల్ చంద్ వారు సాలీనా ఉద్యోగులకిచ్చే కానుక) ఓ ఖద్దరు లాల్చీ, పైన కండువా అతని వేషం. *ఒక స్థితిలో ఉన్నవాళ్ళు - అదే స్థితిలో ఉన్నవాళ్ళనే ఎక్కువ ఆకర్షిస్తారు గావును.* చంద్రుణ్ణి చూడగానే - నరసయ్య మొదట అతణ్ణి ఆశ్రయించాడు.

"ఎవరో బుద్ధిమంతుడిలాగ ఉన్నావు నాయనా! - ఓ పని చేసి పెడతావూ?" అంటూ బస్సు స్టాండులో దిగాలుపడి కూచున్న చంద్రుణ్ణి అర్థించాడు నరసయ్య.

తనకంటే దిగాలు పడివున్న నరసయ్యని ఆశ్చర్యపడ్డాడు చంద్రుడు, తను చెయ్యగలిగిన పని ఏమిటా అని! అదీగాక "పని" అనగానే డబ్బు ఏమైనా కిట్టుబాటవుతుందేమోనని ఆశ కలిగింది.

"డబ్బేమైనా ఇస్తారా మరి?" అని వెంటనే అడిగాడు.

ఆ ప్రశ్నకి నివ్వెరపోయాడు నరసయ్య. అంత నిక్కచ్చిగా అడిగిన కుర్రాడిని చూసి. అంతలో నవ్వు తెచ్చుకుని, "డబ్బేమిటి బాబూ! అదే జరగాలికాని, నీకేం ఇవ్వను కనక - రా మరి" అని చంద్రుడిని లేవదీశాడు.

ఉపాధికి చంద్రుడు, ఉపకారానికి నరసయ్య తోడయి - క్షణంలో ఒకరి కొకరయారు.

"ఏమిటి పని?" అన్నాడు చంద్రుడు.

"మరేం లేదు. మా అమ్మాయి పేరు రుక్మిణి. ముద్దుగా నేను రుక్కుతల్లి అని పిలుచుకునేవాణ్ణి. అది నిన్నట్నుంచీ కనిపించడం లేదు. చదువుకుంటున్న పిల్ల. 20 ఏళ్ళపై మాటే. అల్లరిదీ, ఆకతాయిదీ కాదు. కనిపించడంలేదు. నాకు కరచరణాలు ఆడడంలేదు. ఉదయం నుంచీ వెదుకుతున్నాను. శోష వచ్చినట్టుంది. నువ్వూ సాయమయితే ఇద్దరం వెదుకుదాం. నువ్వడిగినట్టు, పోనీ డబ్బులిస్తాను." అన్నాడు.

విస్తుపోయాడు చంద్రుడు, ఈ విచిత్రమయిన ఉద్యోగానికి. ఆ వయస్సులో ఆ వృద్ధుడు పడే వ్యథ చూసి మరి మాట్లాడలేదు. "డబ్బు మాట సరేలెండి. ఆ అమ్మాయి ఎలా ఉంటుంది?" అన్నాడు.

"నీ మీద మరో పిడికిలి ఉంటుంది. ఎర్రజాకెట్టు తొడుక్కుంది. కాలికి చెప్పులు ఉన్నాయో లేవో. మరి నువ్వు ఆ ఉప్పుటేరుకి ఇటూ అటూ వెదుకు. నేనిలా వెలంపేట తిరిగివస్తాను. ఆ అమ్మాయి దొరికిందా-" గొంతు బొంగురయి, అంతలో ఆగి "దొరుకుతుందంటావా?" అన్నాడు.

అంత ఆశ్చర్యంలోనూ, "దొరుకుతుందండీ. గాభరాపడకండి. నేనున్నాగా!" అన్నాడు చంద్రుడు. అంతే! నడుం పట్టుకుని చంద్రుడిని కావలించుకున్నాడు. "ఆ మాటచాలు బాబూ! ఆ మాత్రం ఆసరా ఇచ్చేదిక్కులేదు నాకు. మరి త్వరగా పద. అదిగో, ఆ రైలు సిగ్నలు దగ్గరికి చేరుదాం మళ్ళీ ఇద్దరం. వెళ్ళు మరి." అంటూ త్వరత్వరగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు నరసయ్య.

మానవ స్వభావం మీద ఆయనెంత సుళువుగా నమ్ముతాడో అర్థమయింది చంద్రుడికి. అతని కూతురు ఎందుకు తప్పిపోయింది? అతను బస్సుస్టాండుకు రావడంలో అర్థమేమిటి? తనని అంత సుళువుగా నమ్మి పనికి పురమాయించి, వెళ్ళిపోయిన ముసలాయని చదువుకున్న పిల్ల ఎందుకు మోసం చేసింది? రుక్మిణి పిచ్చిపిల్లా? ఇలాంటి ప్రశ్నలు కొల్లలుగా రేగుతూండగా నల్లకలువలాంటి అమ్మాయికోసం, నాలుగు గంటలు వెదికి అలసిపోయాడు. అతనికి హఠాత్తుగా ఓ అనుమానం వచ్చింది - మాసినగడ్డంతో, తుప్పబలిసిన తలతో, నీరసంగా ఉన్న ఆ వృద్ధుడే పిచ్చివాడేమోనని, ఏమైనా సరే, అంత ప్రయత్నం చేశాక - తిరిగిపోవడానికి మనసురాక రైలు సిగ్నలు దగ్గరకి వచ్చాడు. చంద్రుడు - అక్కడ నరసయ్య ఉండడని అనుకుంటానే. కాని ఉన్నాడు. మొదలు నరికిన చెట్టులాగ - సిగ్నలు గట్టునే కూలబడి ఉన్నాడు. చంద్రుడిని చూడగానే చివాలున ఎదురొచ్చి, "ఏం బాబూ?" అన్నాడు.

అతని ఆందోళన, అలజడి చూసి ప్రయత్నం వృధా అయిందని చెప్పడానికి సిగ్గువేసింది. అంతకు మించి భయమూ కలిగింది.

"దొరకలేదూ? - వెర్రితల్లి ఎక్కడికి పోయిందో? ఏమయిందో?" అనుకుని నిట్టూర్చాడు. చంద్రుడి భుజం మీద చెయ్యి తియ్యలేదు. ఇద్దరూ రెండడుగులు వేశాక - అంతలో గుర్తుకు వచ్చినట్టు ఆగి జేబులో చెయ్యిపెట్టి, మాసిపోయిన రూపాయి కాగితాన్ని నాలుగు మడతలు విప్పి, "ఇదిగో బాబూ - రూపాయి, అన్నమాట ప్రకారం ఇచ్చేస్తున్నాను. నీ మేలు మరిచిపోలేను," అంటూ ముందుకు నడిచిపోయాడు. చంద్రుడు స్థాణువు అయిపోయాడు. క్షణకాలం తేరుకునే సరికి పెద్ద అంగలు వేసుకుంటూ నరసయ్య వెళ్ళిపోతున్నాడు. పరుగున వెళ్ళి అతని దారిన పడ్డాడు. మళ్ళీ రూపాయి ఆయన చేతిలోనే ఉంచాడు.

"నాకు వద్దండి రూపాయి. ఏదో పని అన్నారని తొందరపడి అడిగాను. మీ అమ్మాయి దొరక్కపోయాక నా సాయం ఏముంది?" అన్నాడు చంద్రుడు.

నరసయ్య తెల్లబోయాడు. ఇంతవరకూ తనకు కావలసిన తోడుగా మాత్రమే చూశాడా కుర్రవాడిని. ఇప్పుడు ఒక వ్యక్తిగా అతణ్ణి గమనించాడు. గమనించి, "నీ పేరేటి బాబూ?" అనడిగాడు.

చెప్పాడు చంద్రుడు.

"నిన్ను చూడగానే ఏవో కష్టాల్లో ఉన్నావనుకున్నాను. అది తీర్చకుండా నేను కొత్తది తెచ్చిపెట్టాను. నీకు ఉపయోగిస్తుందేమో ఉంచుకో," అన్నాడు మళ్ళీ.

తల అడ్డంగా తిప్పాడు చంద్రుడు.

"అన్నం తిన్నావా పోనీ?"

మాట్లాడలేదు.

నవ్వి - భుజం మీద చెయ్యేసి - "పద పద" అన్నాడు.

ఆయన మనస్సులో దుఃఖం అర, దాతృత్వపు అర, మానవత్వపు అరా - ఇలా వేర్వేరుగా ఉన్నాయేమో ననిపించింది. కష్టానికీ, కర్తవ్యానికీ, బాధలకీ, బాధ్యతలకీ మధ్యన బలమైన గోడల్ని అనుభవంతో కట్టుకున్నాడు నరసయ్య. అవి మరే తాకిడికీ చెరగవు. ఇప్పుడిక దాతృత్వానికి, దయకీ ప్రతిరూపమే అయిపోయాడు. చంద్రుడి కథంతా చెప్పించుకు విన్నాడు. కన్యకాపరమేశ్వరీ సత్రాన్ని దాటించి - పేడా మురికితో గత్తరగా ఉన్న ఇరుకు సందులో మూడో గుమ్మం ఎక్కించాడు. అప్పటికి, ఆయన తనకేదో పెద్ద దిక్కులాగ, మళ్ళీ ఇన్నాళ్ళకి తనకేదో విపత్తు తీరిపోయినట్టు భావించాడు చంద్రుడు.

లోపలికి అడుగుపెట్టగానే ఒక మూల లోగిలిలోంచి తొందరగా బయటికి వచ్చింది మాసిన పరికిణీ కట్టుకున్న అమ్మాయి. ఆ అమ్మాయి పల్లెవాటు సగం చిరిగిన కావిపంచె ఉంది. ముఖం మీద బట్టలమీద నూనె జిడ్డు ఉంది. కళ్ళలో కళ ఉంది. ఇప్పుడు

ఆందోళన ఉంది. పెదవుల్లో అలసట ఉంది. ఇప్పుడు భయం ఉంది. చేతుల్లో నాజూకుతనం ఉంది. ఇప్పుడు గరిటె ఉంది. ముక్కులో సోగతనం ఉంది కాని, ఇప్పుడు చెమట పట్టింది.

"రుక్కు దొరికిందా మామయ్యా?" అంది ఆ పిల్ల. అంతలో చంద్రుణ్ణి చూసి సిగ్గుపడి ఇంటిలోకి పారిపోయింది. ఆ ఇల్లుదాటి బయటి వెలుగూ, బయటి ప్రపంచమూ చూడడం ఆమెకి అలవాటు కాని పని అని అర్థమయింది చంద్రుడికి. ఇద్దరూ ఇంట్లోకి వచ్చారు. అసలది ఇల్లుకాదు. శిధిలమయిపోతున్న ఒక అపూర్వ సంస్కృతికి ఆఖరి చిహ్నంలాగ – ఒకప్పుడు గొప్ప బ్రతుకుని చూసిన గోడలు ఇప్పుడు తలలు వంచాయి. పదిహేను రోజులుగా భోజనం లేనివాడిని నవరత్న ఖచిత కిరీటం క్రుంగదీసినట్టు – మరీ అందమయిన మీది కప్పు బరువెక్కి గోడల్ని అలిసిపోయేటట్టు చేస్తోంది. ఆ ఇంట్లో మరి నాలుగు ఇళ్ళున్నవాళ్ళున్నారు. అందరూ ఆ ఇంటి స్వరూపానికి ప్రతిరూపాలుగా కనిపించారు.

"రావయ్యా రామం, చెయ్యి కడుక్కో – మొదట భోజనం చేసి మాట్లాడుకుందాం" అన్నాడు నరసయ్య.

ఆ మాటకి ఆ అమ్మాయి బిత్తరపాటు తెలిసింది. ఏదో తొందరగా చక్కబెట్టింది. కాళ్ళు తుడుచుకునే లోపల కొత్తిమీర రోట్లో నలగడం తెలిసింది.

పీటలమీద కూచున్నాక – అతిథిని పరిచయం చేశాడు, ఆ అమ్మాయికి – "ఇతను రామచంద్రుడమ్మా! నిజంగా నా పాలిట రామచంద్రుడే రుక్కు తల్లి దొరకలేదనుకో. ఈ రెండు రోజుల్లోనూ అది దొరుకుతుందన్న ధైర్యం ఇచ్చేవాడయినా దొరికాడు."

ఆ పిల్ల కొత్తిమీర పచ్చడి వడ్డించింది నిశ్శబ్దంగా. ఆమె కదులుతూంటే చేతినున్న మట్టిగాజులు గిజగిజలాడాయి.

"ఇది నా మేనగోడలయ్యా. పేరు తులసమ్మ. దీనికి తల్లి చచ్చిపోయింది. తండ్రి చచ్చిపోయాడు. నా దగ్గరే ఉంటుంది. వీళ్ళ నాన్న ఈ విశాఖపట్నం హార్బరు కట్టకముందు ఇక్కడికి వచ్చాడు. కట్టిన మొదట్నుంచీ పనిచేశాడు. ఏదో మేస్త్రీ పనేదో, అదేదో పని. ఓసారి పెద్దబండయి నెత్తినపడి – సరిగ్గా ఇది పుట్టిన పదో రోజే చచ్చిపోయాడు, బారసాలయినా చెయ్యకుండా, తండ్రి గండాన పుట్టిందని అందరూ దీన్ని – పసిగుడ్డుని తిట్టేవారు. ఈ క్ష్రరముండేం చేస్తుంది పాపం. ఎలకలాగ ఇంత ఉండేది తల్లి ఒడిలో వేసుకుంటేను.. చూడు ఇప్పుడెంత జమాను అయిందో!" అన్నాడు వెన్ను తీవిగా నిలబెట్టి.

ఒక ఆడపిల్లని చూడమన్నప్పుడు ఏ అబ్బాయీ తలెత్తి చూడలేడు. తీరా ఆయన చూడమన్నాక – మట్టి గాజులు గోడచాటుకి దాటేశాయి.

"మా రుక్కుకీ దీనికీ సరిగ్గా ఇరవైరోజులే ఎడం దానికి బారసాల చేసి – దీని బారసాలకి రాబోయేసరికి మా బావ చచ్చిపోయాడు. ఆఖరికి దీన్ని, మా చెల్లెల్ని తీసుకుని ఇంటికి వెళ్ళిపోయాను. అప్పుడు పిఠాపురంలో ఉండేవాణ్ణిలే. మా రుక్కును నువ్వు చూడలేదు అచ్చు ఇది. దీనికన్న మరో రెండు పిడికిళ్ళు పొడుగు. దీన్ని చూసి దాన్ని చూడనక్కరలేదు."

మాటకారి నరసయ్య. కాని మాటలవెనక బడబాగ్నిలాంటి దుఃఖాన్ని దాచుకోగలడు. ఆలోచన ఇటు తిరిగిందా, భోరుమనడం తప్ప మరో గత్యంతరం లేదు. అందుకని మాటల్తో ఇలా తప్పించుకుంటూంటాడు.

భోజనం అయాక మాసిపోయిన తువాలు అందిస్తూ, "నాకు అరవై రూపాయలు జీతం. ఈ రోజుల్లో మేం ముగ్గురం అరవై రూపాయలతో రాజాగా బతకొచ్చు. మరి ఇలా ఎందుకున్నాం అని అంటావా?" నవ్వి "ఆ ప్రశ్నకి అర్థం మా రుక్కుని చూశాక అర్థమవుతుంది," అని ఆగాడు. అప్పటికే ఆయన కళ్ళల్లో నీరు నిలిచి పోయింది.

"ఉండుండు అలాక్కాదు. ఇలారా!" అని, ఓ భోషాణం పెట్టెదగ్గరికి తీసుకెళ్ళి – ఖరీదయిన బట్టల్ని, పుస్తకాల్ని తవ్విపోశాడు. "ఇది మా రుక్కు చీరె. ఖరీదు ముప్ఫైరూపాయలయినా ఉంటుంది. అంటే నా సగం జీతం. ఇది దాని జాకెట్టు – కంచి పట్టు. ఇది చూశావా?.. మా బూల్ చంద్‌గారు కాశీ వెళ్ళినప్పుడు నాకు కండువా ఇస్తే దానికి జాకట్లు కుట్టించాను. అదీ ఇది. ఇది దాని కలం. ఇది

దాని కొబ్బరి నూనె. వాసన చూడు, ఎలాంటి నూనో! ఇది దాని బొట్టు పెట్టె. నేనూ మా తులసీ కష్టాల్ని అనుభవించినవాళ్ళం. కడుపు కట్టుకుని దానికి చదువుకుని మమ్మల్ని హెచ్చరించేవాడు. అయితే, ఇది ఆడదయిపోయింది. ఆడదయితేనేం? - చదువుకుని ఉద్యోగం చేస్తే అదే మమ్మల్ని పోషిస్తుంది. అలాగని చదివించాం. ఇంక రేపు ఏప్రిల్ దాటితే దాని చదువు సరి. పరీక్ష పాసయితే ఎవరికో చెప్పి ఘోషా ఆసుపత్రిలో ఏదో ఉద్యోగం వేయిస్తానన్నాడు, మా యజమాని బూల్ చంద్. అంతలో ఏమయిందో - కనిపించకుండా పోయింది" - అంటూ ఆ వస్తువులు అలానే పట్టుకుని బావురుమన్నాడు.

కలిసిన నిముషంలోనే విశ్వాసాన్నుంచి, కలిసిన రోజే భోజనం పెట్టి, కష్టాల్ని పంచి తనవాడిని చేసుకున్నాడు నరసయ్య చంద్రుడిని.

భోజనం అయాక వెళ్ళిపోబోతుంటే - "వెళతావా రాముడూ! - మా అమ్మాయి దొరకకుండానే వెళ్ళిపోతావా?" అని దీనంగా అడిగాడు.

ఇక వెళతాననడానికి నోరు రాలేదు.

చోడవరం వెళ్ళిపోదామని బస్సు స్టాండుకి వచ్చిన చంద్రుడు మరొకరి అభిమానానికి బందీ అయి శాశ్వతంగా ఆ ఇంట్లోనే ఆగిపోయాడు.

## 12

"బాబూ!"

రెండు బత్తాయిలు కొనుక్కుని సెకండ్ క్లాస్ వెయిటింగ్ రూం, దగ్గరికి నడుస్తున్న చంద్రుడిని ఎవరో పిలిచారు. వెనక్కి తిరిగి శిలా ప్రతిమలాగ ఉండిపోయాడు క్షణకాలం.

కొన్ని గంటలక్రితం మూడో తరగతి కంపార్టుమెంటులో ముష్టెత్తుకు తిరిగిన మూగపిల్ల పలకరిస్తోంది!

అనుమానం తీరక "నువ్వేనా పిలిచింది?" అంటే -

"నేనే బాబూ - తమరు నన్ను దయచూడాలి?" అంది మళ్ళీ నవ్వుతూ. ఆమె కళ్ళల్లో ఉత్సాహంగా, ప్రశాంతంగా ఉన్న కోనేరులో అల్లరిగా లేచే చేపపిల్లగా ప్రతీక్షణానికి కదిలి - మరేదో కొత్త పద్ధతిలో నిలబడుతోంది.

"ఏం కావాలి?" అన్నాడు చంద్రుడు, 'దయ' ఏమిటో అర్థంకాక.

"తమరు చాలా పెద్దోళ్ళని ఇన్నాను" అంది.

"ఎవరన్నారు? నేను రేషను ఆఫీసులో గుమస్తాని!"

"అదేటి బాబూ - తమకెంత పెద్ద నేస్తాలున్నారో - నాకు తెలుసు బాబూ, రేతిరి నుంచీ చూస్తున్నాను గానూ? ఆ బయస్కోపులు తీసే ఆయన పెళ్ళాం గారికి తమరంటే ఎంతో నేస్తమట! రాజయ్య మావ చెప్పాడు" అంది - ఎనుబోతులాంటి శరీరాన్ని చేతుల్తో అభినయిస్తూ.

"అయితే ఏమిటంటావు?"

ఆ మాటలకి సిగ్గుతో వెయ్యి వంకర్లు తిరిగిపోయింది. "నాకు బయస్కోపుల్లో ఏసం ఎయ్యాలని మా సెడ్డ ఇదిగా ఉంది బాబూ. ఏస్తే మంచి చీరలూ, తిండీ పెడతారంట. పెద్ద పెద్ద వోళ్ళంతా కారుల్లో తిప్పుతారంట," అంది తలెత్తి కళ్ళల్లోకి చూస్తూ.

నిర్ఘాంతపోయాడు చంద్రుడు. ఆ చింపిరి బట్టల అమ్మాయి అభినయించే మూగపిల్ల మాత్రమే కాదు. అవసరమయితే అవకాశం దొరికితే సినిమాల్లో నటించే అందమయిన నటి కూడా కాగలదు. *ఆశలు గుర్రాలయితే ఆకాశానికి ఎగరడానికి అసాధ్యమేముందున్న*

*సామెత ఒక్క సినిమా ప్రపంచంలోనే వీగిపోతుంది.* ఏమో ఎవరికి తెలుసు? - ఈ పిల్ల రేపు ఎందరు సలాంలు కొట్టే తార అవుతుందో! అప్పుడు ఆ ధవంతురాలు పాతబతుకు నలుగురూ ఘనంగా చెప్పుకునే చరిత్ర అవుతుంది. అప్పుడంతా ఫలానా తార విజయవాడ ప్లాట్ ఫారం మీద మూగదిగా నటించేదని చెప్పుకుంటారు.

"ఏటి బాబూ - ఆలోచిస్తున్నారు. నేను మూగదానిగా నటిస్తా బాబూ సూడండి," అంటూ నాలిక మెలికలు తిప్పి - రకరకాల ధ్వనులు చేస్తూ - తన ఆకలినీ, నిస్సహాయతనీ సూచించింది. దాని తమ్ముడు చచ్చిపోయాడట, రైలు కిందపడి, తల్లీ తండ్రిలేరట. నాలుగు రోజుల్నుంచీ భోజనం లేదట, ఇంత కథని చెప్పింది కళ్ళతో, సంజ్ఞలతో, చెప్పి ఫక్కున నవ్వేసింది.

"నీ వయస్సెంత?" అన్నాడు - అంత తెలివి తేటలకి కారణం పుటకో, ప్రవర్తనో అర్ధంకాక.

"పద్నాలుగు బాబూ! ఏసెం ఏస్తే పద్దెనిమిది. బాగుంటాను" అని గాలి పూరించి రొమ్ములు బిగించి, ముందుకు బారసాచి నిలబడింది. మాసికలు వేసిన రవికలోంచి పద్నాలుగేళ్ళ వయస్సులోనే పద్దెనిమిదేళ్ళ యౌవనం గుర్తు తెలిసింది.

నవ్వొచ్చింది చంద్రుడికి. రోజూ ముష్టెత్తుకునే పిల్ల - పొరపాటునయినా కాలికి తగిలే అదృష్టానికి అర్రులు చాచుకుంటుంది. ప్రయాణికుల్ని, వాళ్ళ కోరికల్ని, వాళ్ళ స్వభావాల్ని అంతా బాగా గుర్తుపట్టగల ఆమె నేర్పుకి ముగ్ధుడయి, ఒక పావలా తీసి ఆమె చేతిలో పడేసి ముందుకు నడిచాడు చంద్రుడు.

"ఇదేటి బాబూ - సినిమా ఛాన్సడిగితే డబ్బులిత్తారేటి? నాకు డబ్బులు లెక్కనుకున్నారేటి? - మా రాజయ్య మావ దగ్గర నాయి వందరూపాయలు వడ్డీకి తిరుగుతున్నాయి." అంది మూగపిల్ల వెనకనుంచి.

"నా సంగతి మరసిపోకండి బాబయ్యా!" నా పేరు జోగులమ్మ. అని కేకేసింది మళ్ళీ.

సెకండ్ క్లాసు వెయిటింగ్ రూం దగ్గర మూడు చక్రాల బండిలో ఖరీదయిన ఎర్రశాలువా - అర్ధరాత్రి కాలికి అడ్డుపడిన జెర్రిపోతులాగా కనిపించి అదిరిపడ్డాడు. మేడమీద ఎయిర్ కండిషన్ రూంలో ఉండాల్సిన ఖరీదయిన శాలువా తులసి మీదకి ఎలా వచ్చిందా అన్న మథన, అలా వచ్చినందుకు ఎందుకో కారణంలేని ఉక్రోషం, తులసి మీద ఆపుకోలేని కోపం వచ్చాయి. ఇందాకటి కోపానికి క్షమాపణగా ఆమెకై తెచ్చిన బత్తాయి పళ్ళు రెండు ఇనుప గుళ్ళులాగ కనిపించగా, వాటిని అలాగే బల్లమీద పారేసి కొట్టినట్టు లేపాడు తులసిని.

తులసి త్రుళ్ళిపడింది. అంతకు మించి ఎర్రబడిన కళ్ళలో ఉన్న - భర్తని అదాటుగా చూసి ఆకులాగా రెపరెపలాడిపోయింది.

"ఇది ఎవరిచ్చారే నీకు జెప్తా?" అని పళ్ళు పటపటలాడించే భర్తని చూసి, రక్తం చిమ్మిన వేళ్ళతోనే చేతులు జోడించి, "ఆవిడేనండి. నేను అడగలేదు. వద్దంటుంటే వదిలి వెళ్ళింది. నన్ను వెదుక్కుంటూ వచ్చింది. మిమ్మల్ని ఒకసారి రమ్మంది. మీతో ఏవో మాట్లాడాలిట!" - అంది.

"ఏం చెప్పావు నువ్వు ఆవిడతో?"

"ఏం లేదండీ - ఆవిడ చాలా మంచి మనిషి. మన అమ్మాయి తోడండీ. నేనేమీ చెప్పలేదు. నన్ను నమ్మండి!" అంది గొంతు తగ్గించి.

"శనిగ్రహమా! ఈ వెధవ కోరికలకి చెయ్యి జాపితే - ఇరవై ఏళ్ళ కిందట ఆవిణ్ణే చేసుకునే వాడిని, నీ పీడ లేకుండా. ఇవాళ నిన్ను జయించి, నాకు చెంపపెట్టు పెట్టబోతూంది. ఛీఛీ!"

"అదంతా నాకేం తెలీదండి."

"తెలిస్తే నీ బతుకిలా ఏడవడమేం? ఇలాంటి వాటికి చెయ్యిజాచకబోతే ఎక్కడయినా పడిచావరాదూ! ఇలాతే ఆ దిక్కుమాలిన శాలువా!" అని చర్రున శాలువా లాగి చరచరా రిటైరింగ్ రూం వేపు నడిచాడు.

"ఆమెనేమీ అనకండి. ఆవిడ చాలామంచి మనిషి. మన పేదరికం చూసి.." చటుక్కున ఇటు తిరిగిన భర్తని చూసి ఇక నోరు విప్పలేకపోయింది. గుక్క తిప్పేలోగా అతను మెట్లమీదకి మాయమయాడు. భర్త మాటకి ఒక్క వాక్యమయినా అధికంగా మాట్లాడిన సందర్భమిదే. అదీ ఇలా వ్యర్థమయిపోయింది.

నిశ్శబ్దంగా ఉన్న ప్లాట్ ఫారం మీద గుండె కరిగేలాగా కుర్చీ మీద తల ఆనించి ఏడ్చేసింది.

ప్లాట్ ఫారం గుండె బ్రద్దలయినట్లు ఒక డీసిల్ ఇంజన్ రొద చేసుకుంటూ తొందరగా కదిలి వెళ్ళిపోయింది.

డీసిల్ ఇంజన్ రొద ఎయిర్ కండిషన్డ్ గదిలోని ప్రయాణికుల్ని కూడా క్షమించలేదు. వలజ అటునుంచి ఇటు వత్తిగిల్లింది. ఆ రొదలో తనగది తలుపు చప్పుడూ కావడం తెలియలేదు. తను లోపల గడియవేసిన గుర్తుకూడా లేదు. ఇప్పుడది తెరుచుకుని చంద్రుడు లోపలికి వచ్చేసరికి దిగ్గున లేచి కూచుంది. ఆమె ముఖంలో ఆశ్చర్యం లేదు.

"అర్ధరాత్రి పడకగదుల తలుపు తెరుచుకువచ్చే ఒడుపు నేర్చావే! తలుపు తీసి ఉంచడం ఇలా ఉపయోగించిందన్నమాట. రారా!" అంది.

తులసిని చూడటానికి వెళ్ళినప్పటి ఎర్ర చీరే ఇంకా కట్టుకుని ఉంది. నిద్రలో చెదిరిన చీరె మళ్ళీ కదిలి మనిషి ఆకారానికి ఒదిగి పోతోంది తొందరగా.

అతని చేతిలోని ఎర్రశాలువా చూసి, ఒక్కక్షణం విస్మితురాలయింది, "అదెందుకు తెచ్చావు మళ్ళీ? - ఆమెను నువ్వు పడుకోనిచ్చేట్టులేవే! భార్యల మీద ఇంత ప్రేమయితే ఎలాగబ్బా?" అంది నవ్వుతూ వొళ్ళు విరుచుకుని.

శాలువాని - చచ్చిన పాముని విసిరినట్టు కుర్చీమీదకి విసిరివేశాడు చంద్రుడు. అది ఓపికలేని త్రాచులాగ - నేలకి అడ్డంగా పడి కరుచుకుంది. తెల్లబోయి చూసింది వలజ శాలువాని, చంద్రుడినీ!

"నా భార్య మీద హఠాత్తుగా నీ కెందుకింత ప్రేమ వచ్చిందో చెప్పు ముందు?" అన్నాడు.

అతని గొంతులో కోపానికీ, రోషానికీ తెల్లబోయింది. ఆశాభంగంతో, అవమానంతో ఆమె ముఖం ఇంతయింది.

"ఏం? ప్రేమ కలిగితే తప్పా! నువ్వు చిన్ననాటి స్నేహానికి ఇంకా లెక్కలు కట్టుకుంటున్నా, నీ భార్య నీకంటె వెయ్యిరెట్లు నయం. నా మీద కోపంతో ఆమెను అవమానించావేమోనని చూద్దామని వెళ్ళాను."

"చూశావా నేనెంత అవమానించానో!"

"అంత మంచి పెళ్ళాలని పెట్టుకుని మీరింకా ఇంత చిన్న మనసులతో ఎలా బ్రతుకుతున్నారో ఆశ్చర్యం కలుగుతూంది ఛాంద్! నావంటి భార్య నీకుండాల్సింది."

"ఆ మాట నువ్వు ఇరవై ఏళ్ళ క్రిందటే అన్నావు."

"అన్నాను. నువ్వు కాదని తిరస్కరించినందుకు ఇప్పుడు దిగులుగా ఉందా?"

చంద్రుడు చలించలేదు.

"దిగులు నాకు కాదు. అవుననిపించలేకపోయానని నీకు కసి! అందుకే వెదుక్కుంటూ పోయి, నా భార్యని కలిసి నా మీద పగ తీర్చుకోవాలని ప్రయత్నించావు. అందుకు ఈ శాలువా చిన్న ఆయుధం" అంటూ విసురుగా శాలువని కాలితో తన్నాడు. అది అనుకోకుండా పాములాగ బుసకొట్టి లేచి వలజ ముఖం మీదపడింది.

ఆ చర్యకి కోపంతో రెచ్చిపోయింది వలజ.

***

''**ఇది ఆయుధం కాదు చాంద్!** నా తండ్రి శవాన్ని దహనం చేసిన ఒక గుమస్తా భార్యకు చేయబోయిన సాయం. దీని ఖరీదు నీ మూడు నెలల జీతమని నాకు తెలుసు. నీ బ్రతుక్కి ఇదే ఆయుధమనిపిస్తే, ఇంతకి పదిరెట్లు బలమైనవి నీ మీద ప్రయోగించగలను'' అంటూ చేతిలో ఉన్న శాలువాని ముకలు ముక్కలుగా చించేసింది.

ఆమె రౌద్రాకారానికి నిర్విణ్ణుడయిపోయాడు. ఆ చినిగిపోయిన ముక్కల్ని జల్లేసి పరుపు మీద చతికలబడి తల పట్టుకుంది వలజ.

ఇద్దరూ ఒక యుగం నిశ్శబ్దంగా ఉండిపోయారు.

వెనక్కి తిరగబోతున్న చంద్రుణ్ణి ఆమె మాటలు ఈటెల్లాగ ఎదుర్కొన్నాయి.

''నా ఔదార్యం మీద నీకు కోపమెందుకో తెలుసా? నీ బీదరికాన్ని నేను వెక్కిరిస్తున్నానని, నీ భార్యని చూడకముందు నిజంగానే నిన్ను వెక్కిరించాను. ఆమెను చూశాక నా అభిప్రాయం మారిపోయింది. కాని, నువ్వు దాన్ని ఎంతోకాలం నిలుపుకోలేదు. నువ్వు నిజంగా నా పరిస్థితిని చూసి ఈర్ష్య పడుతున్నావని ఇప్పుడు అర్థమయింది.''

నవ్వాడు చంద్రుడు.

''ఎవరి అహంకారం దెబ్బ తిన్నదో ఆ చిరిగిన శాలువా పీలికల్ని అడిగితే తెలుస్తుంది. నన్ను గంటన్నర క్రితం పిలిచినప్పుడు నువ్వు వేసుకున్న నైట్ గౌనుని అడిగితే అర్థమౌతుంది. నీ అహంకారం చాలా ఖరీదయినదే కాని, దాన్ని నా భార్యలాంటి బీదవాళ్ళ మీద, కుంటివాళ్ళమీదా వృథా చెయ్యకు'' అన్నాడు.

ఆ మాటల్ని నెమ్మదిగా జారవిడిచేలోగా, అతను ఊహించని ఒక అఘాతం ఆ క్షణంలోనే అతనికి తగిలింది. అంతవరకు - కోపంగా ఉన్న వలజ ముఖం ప్రసన్నమయి - ఎరుపెక్కి, కోరికతో కళ్ళు బరువెక్కి, చిలిపిగా చికిలింతలయిపోయాయి - వెనక్కి వేసుకున్న సిగవిడి జుత్తు భుజాలచుట్టూ పడింది.

అతని దృష్టి తప్పకుండా ఆమెని అలాగే గమనిస్తోంది. ఆమె బ్లౌజు వదులయి జారింది. అతని దగ్గరికి అగ్నిశిఖలాంటి కోరికలాగ సమీపించింది. పొడువాటి ఆమె చేతులు అతని మెడ మీద చక్కిలిగిలిపయిన ఆమె రొమ్ములు అతని ముఖాన్ని, మెడనీ, అక్కడనుంచీ గుండెనీ, పాకే రక్తాన్నీ వేడెక్కించాయి.

''చాంద్!'' అన్నాయామె ఆ పెదవులు. గాలి ఆ ఊపిరితో కలవరపడింది.

పల్చటి కెంపులాంటి ఆ చీర సుతారంగా శరీరం మీంచి జారిపోవడం చూశాడు. తెల్లటి ఆమె శరీరం మంచి గంధపు మానుతొర్రలోంచి వచ్చిన నాగుపాములాగ చుట్టేసుకుంది. అతని నడుం మీద వేళ్ళు బిగుసుకున్నాయి. రక్తం ఆలోచనల్ని మట్టుబెట్టి - అనుభూతుల్నీ, అలలు అలలుగా ఆవేశాన్ని లేపింది. ఆ శరీరాన్ని అంత దగ్గరగా అంత నిండుగా చూడలేదు చంద్రుడు. కొద్దికాలం కిందటే స్నానం చేసిన శరీరం స్వచ్ఛత, రోజ్ నాటకంతో రెచ్చవడిన పిచ్చి కోర్కె, పధ్నాలుగేళ్ళ శరీరాన్ని పద్దెనిమిదేళ్ళ యవ్వనంతో పూరించిన జోగులు గర్వం, అన్నీ - నలభైలో ఇంకా ఇరవై అయిదు విడని బిగువయిన ఆ పాలరాతి నునుపులో స్ఫురించింది. అతనికి మూర్ఛవచ్చినంత పనయింది. తూలిపోతాడేమోనని భయమేసింది. అసంకల్పితంగా బలమైన చేతుల్ని ఆమె నడుం చుట్టూ బిగించి ఇంకా తన మెడమీద ఉన్న చల్లటి పెదవుల్ని మీదకి లాక్కున్నాడు.

పెదవుల మధ్య దాదాపు గాలికి కూడా చోటులేనంత దగ్గరయాక, అతని ముఖాన్ని రెండు చేతుల్తో ఊలు బంతిలాగ పట్టుకుని, పట్టు సడలిన త్రాచులాగ విదిలించుకు నిలబడింది వలజ.

"దెబ్బతిన్న అహంకారం గురించి మాట్లాడుతావా? మగవాడా! నీ గొప్పధర్మాలు, అహంకారం, అందమయిన అమ్మాయి పెదవుల దగ్గర సరి! నువ్వు నాకు నీతులు చెపుతావా? పెళ్ళాన్ని నా శాలువా నుంచి కాపాడినంత మాత్రాన నీ పవిత్రత స్థిరంగా నిలిచిందనుకోకు. ఎప్పుడూ ప్రేమించే భార్యని - ఆ రాత్రి తిట్టిపోయడంలో, కుంటి భార్య ఎదురుగా కూర్చోలేక పచార్లు చేయడంలో, నాతో మాట్లాడి వెళ్ళాక - మల్లు పంచె కట్టుకుని తిరగడంలోనే అర్థమవుతోంది నీ ఆత్మస్థయిర్యం. నీ ఆత్మస్థైర్యం నీ ఆదర్శాల పేర ఆత్మవంచన చేసుకోకు గెటవుట్! అవుట్!" అంటూ ఎర్రచీరని శరీరం చుట్టూ లుంగచుట్టుకుని పడిపోయింది మంచంమీద.

అంత ఉద్ధుతంగా, అంత ఘోరంగా, అంత భయంకరంగా వలజ ఏడవడం ఎప్పుడూ ఊహించలేదు చంద్రుడు. తన అహంకారం మీద అంత సాహసంతో చావుదెబ్బ తీసికూడా తనే ఓడిపోయినట్టు విలవిలలాడిపోతూంది.

ఇక అక్కడ ఉండడానికి భయమేసి బయటికి పారిపోయాడు.

మెట్లు దిగగానే - ప్లాట్ ఫారానికి ఒక మూల ఏదో కలకలం వినిపించింది. దూరంగా ఏదో బండి ప్లాట్ ఫారానికి చివర ఆగిపోయివుంది. ఎవరో రైలుపట్టాల మీద పడిపోయారని సోడాలమ్మే కుర్రాడు అరుస్తూ పరిగెత్తాడు.

చంద్రుడికి గుండె పట్టిచ్చింది. అటువేపు చూస్తూ అడుగువేశాడు ఉన్నట్టుండి. పట్టాలమీంచి రెండు చక్రాలబండిని ప్లాట్ ఫారం మీదకి నలుగురు సాయం పట్టారు. మరేదో శరీరాన్ని కిందనుంచి తీయాలని తొందరపడుతున్నారు. చంద్రుడికి గుండె ఒక్క క్షణం సళ్ళిచ్చింది. పిచ్చివాడిలాగ అటు పరిగెత్తాడు.

## 13

మూడో రోజు ఉదయం తూర్పు తెల్లవరుతూండగానే ప్రత్యక్షమయ్యింది రుక్మిణి. ఆమెను చూస్తూనే 'రుక్కూ' అని వాటేసుకుంది తులసి. ఇక ముసలాయనకి ఊపిరి ఆగిపోయినంత పనయిపోయింది. పదేళ్ళ పిల్లని చేరదీసినట్టు దగ్గరకు తీసుకుని తల వీపూ నిమురుతూ, "ఎక్కడికి వెళ్ళిపోయావమ్మా ఇన్నాళ్ళూ - మీ ముసలి నాన్నని వదిలి?" అన్నాడు.

"స్నేహితులతో అరకులోయ వెళ్ళాను నాన్నా! కారుచెడి రెండురోజులు ఆగిపోవలసివచ్చింది. లేకపోతే వెళ్ళిన మర్నాడే తిరిగి వచ్చేద్దామనుకున్నాం. నీకు కబురు చెప్పమన్న అమ్మాయికూడా చివరి క్షణంలో మాతో వచ్చేసింది," అంది.

ఆమెని చూస్తూ నోట మాటరాక ఉండిపోయాడు చంద్రుడు. ఆ నాలుగు గోడల మధ్య నిలబడ్డ రుక్మిణి ఏదో శాపవశంచేత ఇలాంటి మురికి కూపంలో పడిపోయిన దేవతలాగ కనిపించింది, మనిషి కాస్త నలుపయినా ఆ ముఖంలో వెలుగు, నల్లటి వెడల్పాటి కళ్ళు, ముదురు ఆకుపచ్చ క్రేప్ చీర, మెడలో చింతాకు పతకం, చేతికి రోల్డ్ గోల్డ్ వాచీ, ఈ ఇంటి స్థితికీ ఆ అమ్మాయి జీవనానికి బొత్తిగా పొంతన కనిపించడం లేదు.

రుక్మిణి భుజం మీద చెయ్యేసి వెలుగులోకి లాగి "ఏం రాముడూ! నే చెప్పలా - మా అమ్మాయి దేవతేనని. చూడిప్పుడు!" అన్నాడు. ఆమె ఠీవికన్నా, నరసయ్య గర్వం ఇంకా ఆనందంగా హుందాగా కనిపించింది. ఆ పక్కనే నీడలో నిలబడి, సంతోషంతో కళ్ళ నీళ్ళు పెట్టుకుంటున్న తులసి త్యాగం మరీ ఉన్నతంగా తోచింది.

అనుకోకుండా రుక్మిణి మీద కోపం వచ్చింది చంద్రుడికి. "చెప్పాచెయ్యకుండా ఎందుకు వెళ్ళిపోయావు ఇక్కణ్ణుంచి? - మీ నాన్నగారి బాధ నీకేం తెలుసు?" అన్నాడు అసలు పరిచయమయినా లేకపోయినా.

ఆ మాటలకి నిర్విణ్ణురాలయింది రుక్మిణి.

"పోనీలే రామం, ఊరుకో! మన బాధలు ఆ వయస్సులో దానికేం తెలుస్తాయి!" అని నరసయ్యే సర్దేశాడు.

చంద్రుడిని అప్పుడే పరిచయం చేశాడు. రుక్మిణి నమస్కారం చేసి - "నాకోసం చాలా శ్రమపడ్డారన్నమాట - ఐయాం సారీ!" అంది. ఆ మాటల్లో సంస్కారం, గొంతులో తీపీ, మరింత ఆకర్షణీయంగా కనిపించాయి. ఆ వయస్సులో అలా కనిపించే అమ్మాయిల్లో ఉన్న పొగరు, నిర్లక్ష్యం రుక్మిణిలో ఏ కోశానా కనిపించలేదు.

నరసయ్య గారాబంతో ఆమె నిర్లక్ష్యానికి ఆజ్యం పోసినా ఆమె నిర్లిప్తంగా ఉండడం, ఆమె వ్యక్తిత్వంలోని ప్రత్యేకతగా కనిపించింది.

*పేదరికంలో ఆప్యాయతలే అపూర్వమయిన ధనరాశులు.* సాయంకాలానికి చంద్రుడిని "అన్నయ్యా!" అని పిలవడం ప్రారంభించింది రుక్మిణి. ఆ రోజంతా ఆమెను జాగ్రత్తగా పరిశీలించిన మీదట ఆమెతో మాట్లాడిన తరుపరి ఒక్క విషయం చంద్రుడికి తోచింది.

రుక్మిణి కళ్ళలో ఏదో భయం, సంశయం ఉన్నాయి. అరకులోయ వెళ్ళివచ్చిన తృప్తిలేదు. మాటల్లో చెప్పలేని శూన్యం, నిశ్శబ్దం, నిరామయమయిన దిగులూ - అంత అందమయిన కన్నీళ్ళకి అలవాటయిన భావంగా కనిపించలేదు. అదే అతనికి ఆశ్చర్యం కలిగించింది.

రుక్మిణి ఎక్కువ మాట్లాడలేదు. కాని, మాట్లాడే ప్రతీమాటా తియ్యగా, ఆప్యాయంగా ఉంటుంది. ఆ కుటుంబంలో తన బాధ్యతల గుర్తింపూ, వాటి నిర్వహణకై చదువులో, నడవడిలో ఆమె పడే శ్రమా గుర్తించాడు చంద్రుడు.

తన కూతురు కనిపించిన సంబరంలో కుర్రవాడయిపోయాడు నరసయ్య. మూడోరోజు చంద్రుడిని తీసుకువెళ్ళి బూల్ చంద్‌కి పరిచయం చేశాడు. తనకి మరీ కావలసిన బంధువన్నాడు. ఉద్యోగం ఇవ్వక తప్పదన్నాడు. నరసయ్యని కేవలం ఉద్యోగిగా కాక, వయసు మళ్ళిన వృద్ధుడుగా గౌరవంగా బూల్ చంద్ చూడడం గమనించాడు చంద్రుడు. తనన్ని నమ్ముకు బ్రతికేట్టుగా ఉద్యోగుల్ని చేసుకుని వాళ్ళని నమ్ముకుని వ్యాపారం చెయ్యడం బూల్ చంద్ వ్యాపారంలో ముఖ్యమయిన కీలకం చంద్రుడికి ఉద్యోగాన్ని కల్పించడం అతనికి కష్టం కాదు. 30 రూపాయల జీతం మీద 'సేల్స్‌మన్' ఉద్యోగం ఇచ్చాడు. అంటే మరేం లేదు - ఎత్తరుగుల షాపుమెట్ల మీద కూచోడం, 'ఖరీదయిన' మనుషుల్ని లోపలికి ఆహ్వానిస్తూ ఉండటం, లోపలికి వచ్చాక - నరసయ్యలాంటి వాళ్ళకి అప్పచెప్పి మళ్ళీ మెట్లమీదకి వెళ్ళి కూచోడం.

ఇది చంద్రుడికి సులువుగానే కనిపించింది. ఈ ఆరునెలల ఇరుకు బ్రతుకులో తీరికగా ఆలోచించుకునే క్షణాలు దొరకలేదు. గ్రామంలోని జీవితం ఏది ఇచ్చినా ఇవ్వకపోయినా ఈ ప్రశాంతతనిచ్చేది. ఇప్పుడు మళ్ళీ ఆ తీరిక దొరికినట్టు అనిపించింది. బూల్‌చంద్ షాపుమెట్లు దేవాలయం మెట్లు లాంటివికావు. చంద్రుడి లాంటి వారి పదిమంది జీతం ఖరీదు చేసే ఖరీదయిన తివాసీల్ని ధరించిన నల్లటి మెట్లు. వాటిమీద రోజూ కూచుని ఆలోచనల్లో మునిగి తేలేవాడు, రోడ్డు మీద వచ్చే పోయే జనాన్ని చూస్తూ.

ఒకసారి పరాకుగా మెట్లమీద కూచున్న చంద్రుడికి ఉన్నట్టుండి రుక్మిణి కనిపించింది. ఒంటరిగా కనిపించలేదు. పొడుగ్గా, తెల్లగా, బలంగా ఉన్న గిరిజాల జుత్తు అబ్బాయితో కనిపించింది. ఆ అబ్బాయి ఎంతో అందంగా, ఠీవిగా ఉన్నాడు. సన్నటి ఫ్రేము కళ్ళజోడు పెట్టుకున్నాడు. రుక్మిణిని ఆనుకుని నడుస్తున్నాడు. రుక్మిణి చంద్రుడి వేపు చూసి నవ్వింది. ఆ నవ్వు మరిగిన పాలమీద కట్టిన మీగడ తేటలాగ స్వచ్ఛంగా తెల్లగా ఉంది. ఆ కుర్రాడితో ఏదో మాట్లాడుతూంది. ఇద్దరూ ముందుకు వెళ్ళిపోయారు. వాళ్ళిద్దర్ని గురించీ చాలాసేపు ఆలోచించాడు చంద్రుడు. రుక్మిణిని మొదటిసారిగా యౌవన ప్రాదుర్భావంలో ఉన్న ఆడపిల్లగా, కోరికలనీ ఆశలనీ పేర్చుకుంటున్న అందగత్తెగా ఊహించుకున్నాడు. ఆమె పక్కన అంత అందమయిన అబ్బాయిని చూస్తే ఎందుకో భయం వేసింది.

"నా పక్కనున్నతన్ని చూశావా అన్నయ్యా?" అంది మర్నాడు ఉదయం.

"ఎవరమ్మా అతను?" అన్నాడు చంద్రుడు.

"ఎవరయితేనేం? బాగున్నాడా?" అంది.

అలాంటి ప్రశ్న వస్తుందనుకోలేదు. "చాలా అందంగా ఉన్నాడు. నేనే ఆడపిల్లనయితే పెళ్ళి చేసుకుందును." అన్నాడు నవ్వుతూ.

నవ్వింది రుక్మిణి. తను కోరిన సమాధానం చెప్పినంత ప్రేట్‌నైజింగ్‌గా నవ్వింది.

"నేనదే చెయ్యబోతున్నాను," అంది చివరికి. ఆ నిర్ణయంలో సంశయంగాని, సంకోచంగాని కనిపించకపోయేసరికి చంద్రుడు ఆశ్చర్యపోయాడు.

"నేను పెళ్ళిచేసుకోకపోవడంలోనూ, నువ్వు చేసుకుంటాననడంలోనూ సమస్యలు చాలా ఉన్నాయమ్మా!" అన్నాడు చంద్రుడు ఒక్క రుక్మిణితోనే మొదటిసారిగా అతను ఆప్యాయతను పంచుకోగలిగాడు.

"ఏమిటన్నయ్యా సమస్యలు?"

"నువ్వు చాలా అందమయిన దానివి. వయస్సులో ఉన్న పిల్లవి. అందమయిన వాళ్ళ నిర్ణయాలు అందంగానే ఉంటాయి కాని సబబుగా ఉండకపోవచ్చు." వలజని గుర్తుచేసుకుంటూ అన్నాడు.

"ఒక్కసారి నిర్ణయం చేసుకున్నాక మార్చుకోవలసి వస్తే గుండెలు పగులుతాయి."

"నీకు పెళ్ళికాలేదు కదా? ఇలాంటి మాటలు ఎలా చెప్పగలుగుతున్నావు?" అని నవ్వింది.

నవ్వాడు చంద్రుడు.

"నాకు పెళ్ళికాలేదు. ఆ ఒక్క సాక్ష్యం చాలదా నా అనుభవానికి?" అన్నాడు.

రుక్మిణి ఏవో ఆలోచనలతో సతమతమవుతున్నట్లు గమనించాడు. తరువాత ఇంకేం మాట్లాడలేదు రుక్మిణి.

***కొందరు ఆడపిల్లలు ఆలోచనలకి కొత్త ఆయువుపోస్తారు. కొందరిని చూస్తుంటే మాటలు చచ్చిపోతాయి.*** రుక్మిణి ముందు చంద్రుడు బాధ్యత ఉన్న పెద్ద మనిషి అయిపోయాడు.

"ఒక్కసారి నాన్నతో మాట్లాడు ఈ విషయం." అన్నాడు రుక్మిణి వెళ్ళబోయే ముందు.

రుక్మిణి సరేననలేదు. కాదనలేదు. తర్వాత మళ్ళీ ఆ ప్రసక్తి ఎప్పుడూ ఇంట్లో రాలేదు.

రోజులు గడుస్తున్నకొద్దీ రుక్మిణి మరీ నీరసంగా, దిగులుగా తయారు కావడం గుర్తించాడు చంద్రుడు. పరీక్షలు దగ్గర పడుతున్నాయి, చదువు కృంగదీస్తోందని సరిపెట్టుకున్నాడు. ఆ రోజుల్లో - చదువుకని భోజనం చేశాక, స్నేహితురాలి ఇంటికి వెళ్ళివచ్చేది రుక్మిణి.

ఒకసారి, రుక్మిణి పుస్తకాలమధ్య గిరజాల అబ్బాయి ఫోటో కనిపించింది. ఫోటో వెనక "ఇస్మాయిల్" అని రాసివుంది. రుక్మిణి సమస్య ఏమిటో కొంత అర్థమయింది చంద్రుడికి. ఆమె తన సూచనకి వెంటనే సమాధానం చెప్పక పోవడానికి కారణాన్ని గ్రహించాడు. అయినా ఇప్పుడు పరీక్షలు. ఇలాంటి విషయం నరసయ్యకి ఇప్పుడు తెలిసినా, రుక్మిణిని కదిపినా, వాతావరణం చెడుతుంది. అయినా రుక్మిణి మీద చాలా విశ్వాసం చంద్రుడికి.

నరసయ్యకి ఇదేం కనిపించదు. రుక్మిణి అనే ఆశాకిరణం అదెంత చిన్నదయినా - అతనిముందు జీవితాన్ని జ్వలింప చేస్తోంది. బూల్ చంద్ దుకాణంలో గుమస్తా పని అతనికప్పుడే చిరాకుగా, చిన్నదిగా కనిపిస్తూంది. బూల్ చంద్‌కి "ఇంకా మూడు నెలలు, 90 రోజులు" అని రోజూ చెపుతూ వస్తున్నాడు. బూల్ చంద్ ముసలాడి తృప్తికి నవ్వుతూనే ఉన్నాడు.

పరీక్షలు పదిరోజులుండగా మరీ పీలికలాగా అయిపోయింది రుక్మిణి. ఎప్పుడూ ఎదుటపడి మాట్లాడని తులసి పెరట్లో చెయ్యికడుక్కుంటున్న చంద్రుడి దగ్గరకి వచ్చి పిరికిగా నిలబడింది. చాలీచాలని బట్టల్లో దీనంగా కనిపించిన తులసిని చూచి ఆశ్చర్యపోయాడు చంద్రుడు. అప్పటికే రుక్మిణి భోజనం ముగించుకుని చీరకట్టుకుంటూంది, స్నేహితురాలి ఇంటికి వెళ్ళడానికి.

నరసయ్యగారు వీధిలో చుట్టకాల్చుకుంటూ కృష్ణకర్ణామృతం చదువుకుంటున్నారు.

"చూడండి?" అంటే తృళ్ళిపడ్డాడు. తలెత్తి ఆమెని చూశాడు. తులసి రెండు నెలలు పాటు సుష్టుగా భోజనం చేసి, రుక్మిణి చీరె కట్టుకుని, వదులుగా జడవేసుకుని బొట్టు పెట్టుకుంటే రుక్మిణికంటే అందంగా ఉంటుందనిపించింది. రుక్మిణికి ఉన్న చదువు లేదు తులసి ముఖంలో. కాని అక్కడ చదువు దిగులుగాను, ఇక్కడ ఆ జ్ఞానం అమాయికత్వంగాను స్థిరపడింది.

తననలా చంద్రుడు తేరిపార చూడటం గమనించి, సిగ్గు పడింది తులసి.

"ఏమిటో చెప్పండి!" అన్నాడు చంద్రుడు.

"రుక్కుతో మీరొక్కసారి వెళ్ళండి. నాకెందుకో భయంగా ఉంది. పైకి చెప్పడం లేదు. కాని దాని ఆరోగ్యం బాగోలేదు" అంది.

తన ఊహలకీ, ఆమె ఆలోచనలకీ సామరస్యం తోచి మరి ఆగలేదు చంద్రుడు. అప్పటికే రుక్మిణి పుస్తకాలు తీసుకుని గదిదాటి పోయింది. లేతమబ్బులాంటి చీర భుజం చుట్టూ తిప్పుకుని ఎల్క్ట్రిక్ దీపం వెలుగులో తొందరగా అడుగులు వేస్తూంది.

విక్టోరియా బొమ్మదాటి - కోలు వీధి వేపు నడక సాగించే సరికి ఆమెని అందుకున్నాడు చంద్రుడు. చంద్రుడిని చూసి దిగ్గున నిలిచిపోయింది రుక్మిణి.

"నువ్వా అన్నయ్యా?" అంది ఎవరో శత్రువుని చూసి భయపడినట్లు.

"చీకటి కదమ్మా, తోడుగా వద్దామని," అన్నాడు మాటలు తడువుకుంటూ.

"నాకు అలవాటేగా, ఫరవాలేదులే!" అంది మొదట.

"నాకూ ఏం పనిలేదులే. ఇంత దూరం ఎలాగూ వచ్చాగా. మీ స్నేహితురాలి ఇల్లెక్కడ?"

"నాన్న వెళ్ళమన్నాడా?" నాలుగడుగులు వేశాక అడిగింది.

"కాదు, తులసి."

భయపడి ఒక్క క్షణం ఆగిపోయింది. ఆమె ముఖం నల్లబడడం ఆ మాత్రం వెలుగులో కూడా తెలిసివచ్చింది చంద్రుడికి.

"ఇంకేమైనా చెప్పిందా?" అంది మెల్లగా.

చంద్రుడు ఆమెని సూటిగా గమనిస్తూ - "నిజం చెప్పమ్మా! నీ పరిస్థితి అంతా సరిగానే ఉందా? నీ ఆరోగ్యం సరిగా ఉందా, ఏదయినా ఇరకాటంలో పడ్డావా?" అన్నాడు.

ఎంతోసేపు మాట్లాడలేదు, మెల్లగా అడుగులు వేసింది.

"అవునన్నయ్యా, ఇరకాటంలో పడ్డాను," అంది.

మనస్సులో తులసి గ్రహింపుకి జోహార్లు చెప్పుకున్నాడు.

"నేను స్నేహితురాలి ఇంటికి వెళ్ళడంలేదు. స్నేహితుడి ఇంటికి వెళుతున్నాను. ఇస్మాయిల్ తెలుసుగా?"

దిమ్మెరపోయాడు. ఆ ముఖంలో కల్మషం, అవినీతి, కృత్రిమత్వం ఎక్కడేనా కనిపిస్తాయా అని వెదికాడు. ఆ మాటలు చెపుతున్నప్పుడు కంఠంలో పిరికితనం లేదు; ఏదో బాధ తప్పింది.

"వెళితే తప్పేం! పోనీ, మీ ఇద్దరూ చదువుకుంటున్నారు. అంతేగా?"

నవ్వింది "చదువుకోవడం లేదన్నయ్యా! నేను పరీక్షవ్రాయలేను. చదువు మానేసి పదినెలలపైన అయింది"

చంద్రుడు తనని వింతగా చూస్తున్నాడని తెలిసి ముఖం ఎత్తలేదు, "నాకిక చదువు రాదు. అయినా, బాధ లేదు. నాన్న నా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు, ఆయనకి విషయం తెలిస్తే బాధపడతాడని నా బాధ."

"బాధపడతాడని తెలిసే ఎందుకు మానేశావు?"

"చేతకాక. నేను కనిపించేంత ధైర్యంగలదాన్ని కాదు అన్నయ్యా! నేను ఆడపిల్లని. నాన్న నన్నూ తులసిలాగే ఇంట్లోనే ఉంచవలసింది. ఈ చీరలు, ఈ చదువు, ఈ అందంతో నలుగురి మధ్యా నేనెంత నలిగిపోతున్నానో నాన్నకు తెలీదు. చెప్పేలోపలే వేళ మించిపోయింది. నేనింక చదవలేను." ఆమె గొంతు గద్గదికం కావడం గుర్తించాడు. మరొక మాటకి ఆమె భోరుమంటుందేమోనని భయమేసింది. కాని లేదు. ఆ క్షణంలో ఆమె సంస్కారం మళ్ళీ మనిషిని చేసింది.

మసక వెలుగులో కళ్ళు తుడుచుకుని - దర్గా కొండకి నాలుగడుగులు ఇవతల సందు దగ్గర ఆగింది.

"ఇంక నువ్వెళ్ళు అన్నయ్యా! ఇల్లు వచ్చేసింది," అంది.

ఎందుకో రుక్మిణి చెప్పవలసినంత చెప్పలేదని, చెప్పుకోని బాధ మరేదో ఇంకా మనస్సులో ఉండిపోయిందనీ అనిపించింది చంద్రుడికి.

"ఇదే నీ సమస్య అయితే ఇంత బాధపడక్కరలేదమ్మా! నాన్నకి నీ మీద పెట్టుకున్న ఆశలకంటే నువ్వంటేనే ప్రేమ ఎక్కువ. నువ్వు చదువుకోకపోయినా నిన్నంతగా ప్రేమించగలడు."

ఆమెకి దుఃఖం ఆగలేదు. కళ్ళు వత్తుకుంటూ - చీకటి గుయ్యారంలోకి నడిచి వెళ్ళిపోయింది.

స్తబ్ధుడయి అక్కడ నిలబడగలిగినంతసేపూ నిలబడి వచ్చేశాడు. అక్కడ అలా చాలాసేపు నిలబడి ఉండాలి. ఎందుకంటే - మళ్ళీ మెయిన్ రోడ్డు మీదకి వచ్చేసరికి రుక్మిణి పిలుపు వినిపించింది.

విస్మితుడయి నిలిచిపోయాడు. ఆమె అతని పక్కకు వచ్చి, "పద, ఇంటికి పోదాం?" అంది తలవొంచుకుని నడుస్తూ.

మరే ప్రశ్న వెయ్యడానికీ భయమనిపించింది చంద్రుడికి. ఆమె పక్కనే తొందరగా అడుగులు వేశాడు.

నరసయ్య తలుపు తీసి - "నువ్వా వచ్చేశావా రుక్కు తల్లీ? ఇవాళ చదువుకోలేదా?" అని పలకరించాడు.

ఆయన ఆత్మీయత చూశాక - ఆమె బాధకి అర్థం బోధపడింది చంద్రుడికి.

"లేదు నాన్నా - నువ్వు పడుకో!" అంది.

"నువ్వు తోడువెళ్ళావా రాముడూ, రా! నీకూ పక్కవేశాను - మా అమ్మాయి చదవకపోయినా పాసవుతుందయ్యా. దాని కలం చివర చదువు కాపలా ఉంటుంది," అంటూ దుప్పటి కప్పుకున్నాడు నరసయ్య.

ఆ రాత్రి నిద్రపట్టలేదు చంద్రుడికి. అలా నిద్ర లేక గడిపే మరొక వ్యక్తిలోని వ్యధకి ఆ రాత్రంతా నిశ్శబ్దంగా సాక్షీభూతమై నిలిచాడు.

తను విన్నదంతా తులసితో చెప్పలేదు. నరసయ్యతో అసలు చెప్పలేదు. కాని ఇలాంటి పరిస్థితికి పర్యవసానం, పరిష్కారం ఎలా ఉంటుందో అర్థంకాక గిజగిజలాడాడు. పోతే అసలు విషయం తనకు పూర్తిగా తెలియదాయె. ఇలాటప్పుడు ఆ ఇంట్లో ఆడదిక్కులేనిలోటు మొదటిసారిగా అతనికి అర్థమయింది. తల్లి ఉంటే రుక్మిణి ఆమెతో తన బాధ చెప్పుకొనేదేమో!

అయితే చంద్రుడు పర్యవసానాన్ని ఆలోచించేవరకూ రుక్మిణి ఆగలేదు. పరీక్షలు జరుగుతూండగా రెండోరోజున తన సమస్యకి తనే పరిష్కారాన్ని ఎంచుకొంది. స్నేహితురాలి ఇంటికి చదువుకని వెళ్ళిన రుక్మిణి ఇంటికి తిరిగిరాలేదు.

నరసయ్య ఈసారి పిచ్చివాడయిపోయాడు. పిచ్చితల్లి ఎటుపోయిందోనని బెంగటిల్లిపోయాడు. ఇన్నాళ్ళ చదువూ గంగపాలయిపోతుందని బాధపడ్డాడు. చంద్రుడు మాత్రం ఎక్కడా వెదకలేదు. సరాసరి కోట వీధిలో దర్గా కొండపక్క సందులోకి వచ్చాడు. ఆ సందులో పదే ఇళ్ళున్నాయి, అన్నీ అస్తవ్యస్తంగా కూలేసినట్టున్నాయి. శుభ్రత తక్కువ. తనకి కావలసిన ఎడ్రసు తెలుసుకోవడం సుళువుగానే సాధ్యమయింది. ఇస్మాయిల్ అనే వ్యక్తి అక్కడ ఓ గదిలో ఉండేవాడు. జనాభా లెక్కల ఆఫీసులో ఉద్యోగి.

ఇప్పుడు బదిలీ అయి ఎక్కడికో వెళ్ళిపోయాడని చెప్పారు. అతని పెళ్ళాం, పిల్లలూ ఎవరూ లేరు. అదీ తెలిసిన విషయం. గది ఖాళీ చేసి అయిదురోజులే అయింది.

రుక్మిణీ అతనూ కలిసి మాయమవడానికి ఆలోచన చేసుకున్నారని రూఢిగా అర్థమయిపోయింది చంద్రుడికి. నరసయ్య ఇంకా ఇల్లూ, స్థలాలూ, చెట్లూ పుట్టలూ వెదుకుతూంటే, ఈ విషయం ఎలా చెప్పాలో అర్థంకాక తికమకపడ్డాడు. చివరికి చెప్పక తప్పలేదు. నిజానికి తెలియవలసింది అంతా చెప్పి -

"మీరేం బాధపడకండి. రుక్మిణి తెలివయినపిల్ల ఎక్కడికి వెళ్ళినా మీకు ఉత్తరం రాస్తుంది. మీరంటే ఆవిడకి ఎంతో ప్రేమ !" అన్నాడు.

ఆ కథ విన్నప్పుడు మతిపోయిందేమో నన్నట్టు నిశ్చేష్టుడయి ఉండిపోయాడు నరసయ్య. తులసి కూడా నమ్మలేకపోయింది.

"నా కూతురు గురించేనా నువ్వు చెపుతున్నావు. అది పాలమీగడ లాంటిదయ్యా! అది మరో మగాడిని కన్నెత్తి చూసిందంటే, ఆ మాట శాపమయి తగులుతుందయ్యా! అవినీతి నా రక్తంలో లేదు!" అని వాపోయాడు.

"ఇది అవినీతని ఎందుకనుకున్నారు? తను మంచి అని నమ్మిన పనేదో ఆమె చేసింది. ***మనకి నచ్చనివన్నీ అవినీతి అని అనుకోవలసిన పనిలేదు. మనకి సాధ్యంకానివి 'చెడు' అనడం కూడా అన్యాయమే.*** నాకు తెలిసింది చెప్పాను. నాకు అర్థంకానిదీ, రుక్మిణి చెప్పగలిగిందీ చాలా ఉండొచ్చు. ఎప్పుడో ఒకప్పుడు కలిసినప్పుడు రమణి చెపుతుంది. అప్పుడు మీరే అంగీకరిస్తారు," అన్నాడు చంద్రుడు.

ఆ మాటలు నరసయ్యకి రుచించినట్లూ, ఆయన్ని స్థిమితపరిచినట్లూ కనిపించలేదు. స్థిమితపరుస్తాయనుకోవడమూ అసందర్భమే.

అనుకోకుండా, మూడోరోజు సాయంకాలం ఓ సంఘటన చంద్రుడి కళ్ళబడింది. సాయంకాలం సముద్రం ఒడ్డున నడిచి వస్తున్నప్పుడు - జాలరిపేటకి దిగువున - వరుసగా ఒడ్డుకి చేరుతున్న పడవలు కనిపించాయి. అప్పటికి సాయంత్రం అయిదుగంటలు అయివుంటుంది. నీటిమీదకి వెళ్ళిన మగాళ్ళు తెచ్చే చేపల్ని బజారుకి తీసుకువెళ్ళడానికి సిద్ధంగా చాలామంది ఆడంగులు బుట్టల్తో నిలబడ్డారు ఇసకలో. పడవలు ఒక్కొక్కటే ఒడ్డుకు చేరుకున్నాయి. మీద గద్దలు గిరికీలు తిరుగుతున్నాయి, జారిపోయిన చేప పిల్లల్ని ఎగరేసుకుపోవడానికి. ఎవరి అదృష్టాన్ని వాళ్ళు వలలు విప్పి పరీక్షించుకుంటున్నారు. ఉన్నట్టుండి పడవ చుట్టూ చేరిన మనుషుల మధ్య అలజడి బయలుదేరింది. ఆ అలజడి పెద్దదయి అక్కడున్నవాళ్ళంతా అటు మూగారు. ఆ పడవ జాలరి ఎగిరి గెంతేస్తున్నాడు. అందరూ చేపల్ని మరిచిపోయి అక్కడ చేరారు. ఆ హడావిడి అర్థంకాక, ఇసుకలోనే దిగి అటునడిచాడు చంద్రుడు.

అందరి మధ్యా ఉన్న నల్లటి మీసాలవ్యక్తి చేతిలో బంగారం ఎండకి తళుక్కుమంది. చేపని పట్టబోతే బంగారం దొరికినట్టుంది. దగ్గరకి వెళితే విషయం అర్థమైంది. నలుగురి మధ్య చాలామట్టుకు తెల్లగా కుళ్ళిపోయిన ఏదో శరీరం ఉంది. ముక్కూ, చెవులూ, కళ్ళూ అన్నీ ఏవో జలచరాలు తినేశాయి - శరీరం పై పొర పూర్తిగా పోయింది. శరీరం నీటికి బాగా ఉబ్బి పోలిక పట్టకుండా అయిపోయింది. మెడమాత్రం ఆ బంగారం వస్తువు కారణంగా ఇంకా సన్నంగానే ఉండిపోయింది. వాసన దుర్భరంగా ఉంది. అక్కడ నిలబడలేక ముక్కు మూసుకుని దూరంగా తొలిగిపోయిన వాడల్లా జాలరి చేతిలో నగ చూసి నిర్ఘాంతపోయి నిలిచిపోయాడు. గుండెలోకి దూసుకునే పదునైన బాకులాగ చింతాకు పతకం జిగాలున మెరిసింది.

"రుక్మిణీ!" అన్నాడు అప్రయత్నంగా అక్కడున్నవాళ్ళంతా ఆశ్చర్యంగా చూశారు. నగని ఎరేస్తున్న జాలరి అనుమానంగా చంద్రుణ్ణి చూశాడు. "ఏటి బాబూ, ఈ శవంగాని మీకు తెలుసేటి?" అన్నాడు.

"మొదట ఇది చెప్పు. ఈ నగ ఈ శవానికే ఉందా?" అన్నాడు చంద్రుడు ఆందోళనగా.

ఒక్కసారి చంద్రుడు మొహం ఎగాదిగా చూసి, నిలువునా అతని కాళ్ళమీద పడిపోయాడు జాలరి.

"నాను దొంగతనం సెయ్యలేదు బాబూ - అల్లా కొండకాడ నా వలలో ఈయమ్మ శవం పడిపోనాది. ఒడ్డుకి నాక్కొచ్చినాను" అన్నాడు.

అనాథగా ఆ చేపల వలలో పడివున్న రుక్మిణి శవాన్ని చూశాక దుఃఖం ఆగలేదు చంద్రుడికి.

ఇక నరసయ్య వచ్చి కూతురి శవాన్ని చూసినప్పుడు, మొదలు నరికిన చెట్టులాగ పడిపోయి ఇసుకలో తలదూర్చి విలవిలా కొట్టుకున్నాడు. అంతకష్టంలోనూ, తులసి అతన్ని ఆదుకుని ఊరడించింది.

మర్నాడు సాయంత్రానికి పోలీసులు శవాన్ని తీసుకెళ్ళడానికి అనుమతి ఇచ్చాక, కుళ్ళిపోయిన ఆ మాంసపు ముద్దకి దహన సంస్కారం అయిందనిపించారు.

పోస్టుమార్టంలో ఓ భయంకరమయిన సత్యం బయటపడింది - రుక్మిణి గర్భవతి!

***

## 14

**భగవాన్!**

భయపడినట్టు రైలు తులసి మీంచి దాటి వెళ్ళిపోలేదు! స్టేషన్లోకి రాబోతున్న రైలు వస్తూ వస్తూ ఆగిపోయింది!

ప్లాట్ ఫారం పట్టాలవేపు పల్లంగా ఉంది. రైలు వస్తూండగా తొందరగా తీసుకువచ్చిన చక్రాలబండిని చూసి - అల్లంత దూరం నుంచి మూగమ్మి జోగులు కేకలు వేసిందట! బండి ఆగలేదు. బండితో పాటు తులసి పట్టాల మీద ఆగిపోయింది. జోగులు వెర్రిదానిలాగ కేకలు వేసింది. దాదాపు మీదకి వచ్చిన రైలు కాస్త ఎడంగా ఆగిపోయింది. కాని తులసి తలమీద బలమైన గాయం తగిలి ముఖం తిరిగింది. నల్లగా కమిలిపోయినట్టున్న తులసి శరీరాన్ని - ఇద్దరు పోర్టర్లు - మరి నలుగురు ప్రయాణికులు చక్రాల బండి మీదకి తరలించే సమయానికి చంద్రుడు అక్కడికి చేరాడు.

అతణ్ణి చూడగానే జోగులు "ఈయనే!" అంది.

అంతా తనని అడవి జంతువుని చూసినట్టు చూశారు.

"ఏం మనిషివయ్యా - అవిటిదాన్ని అలా ఒంటరిగా వదిలేసి పోతావా? ఈ పిల్ల ఉండబట్టిగాని - ఆవిడగతి ఏమవునో!" అన్నాడు ఒకాయన.

ఇంజను డ్రైవరు ఆంగ్లో ఇండియన్. రైలు ప్లాట్ ఫారం మీద ఆపి తులసిని చూడడానికి దిగాడు.

"యూ - సీమ్ టు బీ ఏన్ఇర్రెస్పాన్సిబుల్ హస్బెండ్" అన్నాడు.

బండి చక్రం ఒకటి బాగా వంగిపోయింది. తులసిని శ్రమతో సెకండ్ క్లాస్ వెయిటింగ్ రూం బల్ల దగ్గరికి చేర్చారు. అక్కడున్న వాళ్ళంతా పోగయారు. అందరి మధ్యన నేరస్తుడిలాగ తులసి పక్కన కూచున్నాడు చంద్రుడు. ఆమెను వెయిటింగ్ రూమ్ బల్ల మీద పడుకో పెట్టాడు ఇద్దరి సాయంతో.

సోడా తెచ్చింది జోగులు. ముఖం మీద జల్లినా వెంటనే తెలివి రాలేదు తులసికి. ఒక పోర్టరు స్టేషన్ మాస్టరు గదిలోకి వెళ్ళి అయొడిన్ తెచ్చి కట్టుకట్టాడు. ప్లాట్ ఫారం ప్రయాణీకులతో సమ్మర్ధమయ్యింది. కాస్సేపటికి ఎవరి పనుల్లో వారు పడ్డారు.

"నువ్వెళ్ళు జోగులూ, ఇక నేను చూసుకుంటాను," అని చంద్రుడంటే నవ్వి బల్ల దగ్గిర కూచుని, "వెళ్ళి ఏం చేసేది బాబూ! నేను మూగదాన్నిగానని ఈ రైల్లో వాళ్ళకంతా తెలిసిపోయింది. ఈ యమ్మని రక్షించి రెండు రూపాయల సంపాదన పోగొట్టుకున్నాను" అంది నవ్వుతూ.

"పోనీ, అమ్మ బతికింది. అంతే సాలు!" అంది మళ్ళీ.

జేబులోంచి అయిదు రూపాయలు తీసి ఇవ్వపోయాడు.

"సీత్తెరి! డబ్బుకు నాక్కొదవేటి?- ఆ యమ్మని కాపాడిన పున్నెం నన్ను కాపాడాల!" అంది.

తులసి బాధగా కదిలింది. నిద్రమత్తులో బండి పట్టు తప్పిపోయి ఉంటుంది. చేతికి దెబ్బ కనక. ఆపుకునేలోగా, ప్రమాదం జరిగిపోయింది. అసలే మనిషి అల్పం. అందులోనూ పిరికిది. జరిగే విపత్తునుంచి రక్షించుకోడానికి బదులు బెదిరిపోతుంది.

కణతల మీద నరాలు ఇంకా ఎగిరెగిరి పడుతున్నాయి. చీరె కొంగు చక్రంలో పడి చిరిగింది. రాత్రి భోజనంలేని నీరసం, చారికలు పడ్డ కన్నీళ్ళూ, చెదిరిన జుత్తూ, చెమటకీ సోడా నీటికీ, కరిగి కారిన ఎర్రబొట్టు, వణికే పెదవులూ, దైన్యం మూర్తికట్టినటుంది.

సంచిలోంచి రెండు చీరె మడతలూ - ఓ దుప్పటి - తీసి దిండుగా తలకింద పెట్టాడు. చెక్కుకు పోయిన భుజాన్ని, నుదిటినీ రాస్తూ కూర్చున్నాడు.

ఆమెకు తగిలిన దెబ్బలపట్ల సానుభూతి ఒక పక్క ఎక్కువగా ఉన్నా, అందరిలో ఆమె తనని అవమానపరచినట్టుగా భావించి, ముద్దలాగ పడి ఉన్న ఆ శరీరం మీద కోపం తెచ్చుకున్నాడు. బండి అనుకోకుండా కదిలిపోడానికి, నలుగురి సానుభూతికీ, వాళ్ళు తనని హెచ్చరించడాన్నీ, ఆమె ఉద్దేశానీ సంబంధాన్ని అతని మనస్సు అప్పట్లో అంచనా వెయ్యలేకపోతూంది. స్వభావం చేత, చంద్రుడు నలుగురి దృష్టిలో పడే రకం కాదు. నలుగురి దృష్టిలో ఉండడమంటే అతనికి భయం. అతని సంతోషాలూ, దుఃఖాలు అతనికే ప్రత్యేకంగా ఉండాలి. తన కష్టాలపాలయినా, సుఖాలయినా గోప్యంగా ఉండాలి. తన కోపానికి ప్రతిగా ఇలా నలుగురి మధ్యా తనని పెట్టి తులసి తన మీద దెబ్బ తీసిందనుకున్నాడు.

కాని, ఆమె తలకి తగిలిన గాయం, చేతికి తగిలిన దెబ్బ, ఆమె కదలికకు కొద్దో గొప్పో ఆస్కారమయిన బండి విరిగిపోయిన చక్రం ఆ ఉద్దేశాన్ని బలపరచడం లేదు.

'తెలివి తక్కువ మొద్దు? - ఒకటే నిద్ర - దీన్ని చంపాలి! చవట పీనుగ!' అనుకుంటూ నుదుటి మీద పట్టిన చెమటని రుమాలుతో తుడిచాడు. అలా నలుగురుకీ కనిపించేట్టు భార్య పక్కన కూచోడం చికాకనిపించింది. ***కొందరు తమ నిస్పృహాయతని ప్రదర్శించి, దాని నుంచి విముక్తి పొందుతారు. కొందరు దాచుకుని, రహస్యంగా దానికి ఆహుతి అవుతూంటారు. కష్టాల విషయంలోనూ అంతే. అయితే దాపరికంలో ఎవరి నేర్పు వారిది.*** భర్త కనక చంద్రుడు కష్టాల్ని కోపంలో దాచుకుంటే, తులసి దుఃఖంలో, నిశ్శబ్దంలో, రోగంలో పొందుపరుచుకుంది.

"ఇది ఇంకా లేవదేం?"

"డాక్టర్ని పిలవమంటారా? స్టేషను మాష్టరు అడుగుతున్నాడండీ!" అన్నాడు పోర్టరు.

"వద్దు వద్దు," అన్నాడు తొందరగా, డాక్టరయితే ఈ ప్రమాదానికి ఓ కొత్త పేరు పెడతాడు. దీన్ని 'కష్టం' అని పిలుచుకుంటేచాలు తనకి.

తులసి బాధగా కదిలింది. తర్వాత లేచి - జేబులో చిల్లర తడువుకుని- ఖరీదయిన కూల్ డ్రింక్ - వెదికి మరీ కొని తెచ్చాడు. చెంపలమీద కొట్టి కళ్ళువిప్పాక, "తాగవే - ఇది బాగుంటుంది" అంటూ ఆ డ్రింక్ విలువని తెలియజెప్పి - ఆమె నోట్లో పోశాడు. రెండు గుక్కలు మింగింది తులసి.

ఆమెకి చైతన్యం వచ్చాక - మెదడుకి మళ్ళీ భావ ప్రకటన చేతనయాక - ఆమెకి అలవాటయిన భయం, వణుకు శరీరాన్నంతా కదిపేసింది. అంతా క్షణకాలం. మళ్ళీ కాళ్ళూ చేతులూ కొట్టుకుని - పళ్ళు బిగించి - స్పృహ కోల్పోయింది తులసి. పెదవుల మధ్యనుంచి నురగ వచ్చింది.

'ఛీ ఛీ! ప్లాట్ ఫారం మీద ఇదంతానా! - తమ చుట్టూ నాలుగు గోడలు ఉంటే ఎంత బాగుండును!' అనుకున్నాడు చంద్రుడు. ఆమె ముఖాన్ని గోడవేపు తిప్పి పడుకోబెట్టాడు. ఇప్పుడు ఆమెలో చలనం లేదు - ఎగిరిపడే గుండె కదలిక తప్పింది. అతనికి భయం వేసింది. అనుకున్నట్టు రైలుకు రాని రుక్కు తల్లి గుర్తుకొచ్చింది. పంపించని అల్లుడి మీద విసుక్కున్నాడు. మరో మనిషి సాయం అవసరమనిపించింది - తులసిని సాకడానికి కాదు; తనని ఆ ఆలోచనల నుంచి రక్షించడానికి!

*కష్టాలతో క్రుంగిపోయే చాలామంది కృంగి కృశించటానికి కారణం ఆ కష్టాల బరువుకాదు. వాటిని పంచుకునే తోడులేకపోవడం. 'మోరల్ సపోర్టు ' అది. అందుకే తెలిసి పంచుకోగలిగిన భార్యతో రోడ్డుపక్క బిచ్చగాడు - మనస్సు కలియని రెండో పెళ్ళాంతో కాపరం చేసే ధనవంతుడి కంటె ధైర్యంగా బ్రతుకుతాడు ఇక్కడ ధనవంతుడికి పెద్ద కష్టం రెండో భార్యే!*

ఇది దరిద్రగొట్టు! - ఇవాళలేవదు! - రైలు వెళ్ళిపోయింది - స్టేషన్లో ఉన్న వాళ్ళందరి మీదా ఇంత మసిజల్లి. తన జీవితంలో తెలిసిన ఏకాస్త పాటి సుఖాన్నో పంచిన ఆ పెదవుల మీది నురుగుని ఆమె చీరకొంగుతోనే తుడిచాడు చంద్రుడు! అతనికి ప్రేమ ప్రకటించడం, నలుగురికీ తెలిసేలాగ ప్రకటించడం తెలీదు. అందుకని ఏడవకుండా కూచున్నాడు - ఆ కూర్చోడమే ప్రేమకి సాక్ష్యమయినట్టు.

జోగులు బఠాణీలు తింటూ ఎదుటి ప్లాట్‌ఫారం మీద పచార్లు చేస్తూ, అతని దృష్టిలో పడగానే - "ఎలావుంది?" అని అడిగింది మూగ సంజ్ఞతో.

"పడుకుంది." అని సూచిస్తే, మళ్ళీ నడక కొనసాగించింది. చంద్రుడికి మగతగా చిన్నకునుకు పట్టబోయేసరికి ఎక్కడినుంచి వచ్చిందో వలజ కట్టతెగిన జలపాతంలాగ వచ్చేసింది, ఆమె చేతిలో ఫ్లాస్కు, రంగు తలగడా, ఏదో మాత్రల పాకెట్టూ, భుజం మీద తువాలూ ఉన్నాయి.

ఎన్నో ఏళ్ళ తర్వాత అప్పుడే చూసినట్టు, కొత్తగా, విచిత్రంగా చూశాడు చంద్రుడు. ఆమె అదేం గమనించలేదు.

"మీ ఆవిడ పడిపోయిందట! నంగిగా కూచుంటావేం, డాక్టర్ని పిలిపించక? నాకు కబురంపలేదేం? బ్రూట్!" అంటూ అతణ్ణి తోసి బల్లమీద కూచుంది తులసి పక్కన.

"పడుకుంది, లేపకు," అనగలిగాడు చంద్రుడు.

ఆందోళనతో ఆమె మీదకి వంగి పరీక్షగా చూసింది. కనురెప్పలు కిందకి లాగి చూసింది. అనుభవం ఉన్న డాక్టరులాగ రకరకాల పరీక్షలు చేసి, పెదవుల పక్క జారె నురగని చూసి, తువాలుతో తుడిచింది.

"ఆ మాత్రం గ్రహించలేవూ? హిస్టీరియా ఇది" అంది.

"నీకెలా తెలుసు?"

"నా కెప్పుడూ వచ్చేదే ఇది కనక, లే అక్కడ!" ఫ్లాస్కులో వేడినీళ్ళు తీసి, ముఖం మీద కొట్టింది నాలుగయిదుసార్లు. అరచేతులూ, కాళ్ళూ మసాజ్ చేసింది. చెంపలు రాసింది. చాలా సేపటికి తులసి కదిలాక, ఫ్లాస్కులో వేడినీళ్ళు గ్లాసులో పోసి రెండు మాత్రలు దానిలో కరిగించి, తులసి తలని ఒళ్ళో పెట్టుకుని, చిన్న పిల్లచేత తాగించినట్టు గుక్కలు తాగించింది.

అతను తెచ్చి పక్కన పెట్టిన డ్రింకు చూసి "ఇదెందుకు?" అంది.

"నేనే తెచ్చాను." అన్నాడు సిగ్గుపడుతూ.

అంత గాంభీర్యంలోను ఫకాలున నవ్వింది వలజ.

"చూశావా! నీ ప్రేమ ఎంత ఖరీదయినదో! - ఆమె తెలివిగా ఉన్నప్పుడెప్పుడయినా అలాంటి ప్రయత్నం చేశావా? నీకు ప్రేమ తెలుసు. తెలియ చెయ్యడం తెలియదు. అది ఇలా వృథా అయిపోతుంది. కొందరు వ్యక్తం చేస్తారే కాని లోపల ప్రేమ ఉండదు." తులసి చెంపలు రాస్తూ అంది వలజ.

ఇందాక గదిలో తను చూసిన మనిషేనా ఈ వలజ అని విస్తుపోయాడు.

దూరంగా వేలుపిళ్ళై వెదుక్కుంటూ రావడం గమనించాడు చంద్రుడు. "నీ కోసమే వెదుకుతున్నట్టున్నాడు వేలుపిళ్ళై" అన్నాడు అటు చూస్తూ.

వాడిని చూసి గతుక్కుమంది వలజ. తులసిని బల్లమీద పడుకోబెట్టి చటుక్కున లేచి నిలబడింది, "ఇంకా నా మాటలకి సిగ్గురాలేదూ నీకు? ఈ తలగడ ఆమె తలకింద ఉండనియ్యి - మళ్ళీ నేను తీసుకుపోతాలే!" అంటూ జవాబు కోసం ఎదురు చూడకుండా వెళ్ళిపోయింది.

వేలు పిళ్ళై ఆమెని చూసి - "మీకోసందా చూస్తిని, అయ్య వస్తిరి," అన్నాడు.

వాడిని గట్టిగా మాట్లాడవద్దని చెపుతూంది వలజ. నాలుగు అంగల్లో రిటైరింగ్ రూమ్ మెట్లు మీదకి వచ్చింది. వేలుపిళ్ళై ఆమె వెనకే నడిచాడు.

మరో అయిదు నిముషాలకి కళ్ళు విప్పింది తులసి. తలగడ మీద చెయ్యేసి, చెంపలు రాసూన్న భర్తని విస్మయంతో చూసింది. అంతవరకూ విశ్రాంతిగా ఉన్న కళ్ళు హాఠాత్తుగా నిండుకున్నాయి. తలమీద గాయం జరిగిన సంఘటనని గుర్తు చేసినట్టుంది. తలమీద ఉన్న అతని చేతిని అలాగే పట్టుకుంది.

"తులసీ!" అన్నాడతను.

ఆ పిలుపులో పదహారేళ్ళ ఆత్మీయత ఒక్కసారి ధ్వనించి, తులసి గుండె దుఃఖంతో చేరువయింది.

"నన్నేం చెయ్యకండి. నన్నేం చెయ్యకండి. నేను చచ్చిపోదామని ఆ పని చెయ్యలేదు. నిజం. నా మాట నమ్మండి!" అంది పదే పదే.

చంద్రుడు నిశ్చేష్టుడయిపోయాడు ఆ మాటలకి. అతని చేతికి తల ఆనించి ఆమె ధారాపాతంగా కన్నీటిని వర్షిస్తోంది.

ఆమె మాటలు విన్నాక అతనికి హఠాత్తుగా ఒక భయంకరమయిన ఆలోచన చొచ్చుకు వచ్చింది.

తులసి - నిజంగా తులసి - ఆత్మహత్య చేసుకోబోయిందా! చేష్టలుడిగి అలాగే ఉండిపోయాడు.

భగవాన్!!

## 15

రుక్మిణి పోయాక నరసయ్య పూర్తిగా మారిపోయాడు. మనిషి పరాకయి పోయాడు. తనలో తను మాట్లాడుకోవడం, అవసరం లేని నెమ్మది, ఏవో పాతరోజుల్ని పునర్విమర్శ చేసుకునేలో దృష్టి ఎక్కువయిపోయింది.

ఇరవై నాలుగు గంటలూ రుక్మిణి పెట్టె ముందు కూచుని ఆమె బట్టలన్నీ జాగ్రత్తగా మడతలు పెట్టేవాడు. ఏ మడత చెరిగినా మళ్ళీ అంతా సర్దవలసిందే ఆమె రాసిన కలం రోజూ తుడిచేవాడు. పుస్తకాలు తనకి అర్థమైనవీ కావని - అన్నీ ముందువేసుకుని అట్టలు వేసేవాడు. ఆమె రాసుకునే బల్లా, దువ్వుకునే దువ్వెనా, అద్దం, కప్పుకునే దుప్పటి - ఎప్పటి కప్పుడు ఆ వ్యక్తి కోసం ఎదురు చూస్తున్నట్టు సిద్ధంగా ఉండేవి. అతని ఆలోచనల్లో ఆమెను నిత్యనూతనంగా ఉంచుకుని ఊహల్లోనయినా తనతో పాటు తిప్పుకునేవాడు నరసయ్య. కాని, కొన్నాళ్ళకి అలసిపోయాడు. అతని రాపిడికి ఆ బట్టలు చిరిగిపోయాయి. కలంలో సిరా ఇంకి పోయి తుప్పుపట్టింది. అద్దం ఆ వణికే చేతుల్లోంచి జారిపోయి ముక్కలయింది. దుప్పటిని ఎలుకలు తినేశాయి. బల్ల విరిగింది. నరసయ్య ఇప్పుడు ఆ

అమ్మాయిని గురించి ఆలోచించడం మానేశాడు. నిజానికి తను ఆలోచించడం మానెయ్యలేదు. ఇంక ఆలోచించ వలసిన దేమీ కనిపించక అవి ఒకచోట ఆగిపోయాయి. ఆ తర్వాత అతను నిర్లిప్తుడయ్యాడు.

బూల్ చంద్‌కి రోజూ సంతోషంగా, అలవాటుగా చెప్పే ఉద్యోగపు గడువు తర్వాత కూడా చెపుతూ వచ్చాడు.

"ఇక ఇరవై రోజులు సార్, మన ఉద్యోగం. ఆ తర్వాత మా అమ్మాయి చదువు పూర్తవుతుంది. మనకి ఉద్యోగం చేసే అవసరం రాదు."

మొదట్లో చిరునవ్వుతో విన్నట్టే, తర్వాత జాలితోనూ, బాధతోనూ విన్నాడు బూల్ చంద్. తన దగ్గరే బ్రతికి ముసలివాడయిన నరసయ్య దుఃఖాన్ని ఏ విధంగా తీర్చాలో తెలీక అతనూ గిజగిజలాడాడు.

రోజులు గడిచి, అన్నమాట ప్రకారం నూరు రోజులు అయిపోయాక, ఉద్యోగం మానేస్తానన్నాడు నరసయ్య. బిత్తరపోయాడు బూల్ చంద్.

"మానేసి ఏం చేస్తావ్?" అన్నాడు.

నవ్వి, "అదేం ప్రశ్న? - మా అమ్మాయి ఉంది," అన్నాడు నరసయ్య. అతని ఊహా ప్రపంచాన్ని భేదించాలో, అతన్ని వదులుకోవాలో తెలీక సతమతమయాడు బూల్ చంద్.

"కొన్నాళ్ళు రెస్ట్ తీసుకో నరసయ్యా!" అన్నాడు. కాని, నరసయ్య వినలేదు. రాజీనామా రాసి ఇచ్చాడు.

"మరి నీ పని ఎవరు చేస్తారు? నువ్వు లేకపోతే ఎలా మాకు?" అని రొక్కించబోయాడు.

బయట మెట్లమీద కూచున్న చంద్రుణ్ణి లోపలికి తీసుకొచ్చి తన సీట్లో కూర్చోపెట్టి, "ఇతను నా ఉద్యోగానికి వారసుడు సేట్ సాబ్! నన్ను చూసుకున్నట్టే ఇతన్నీ చూసుకోండి. నాకు మా అమ్మాయి ఉంది!" అంత మనిషీ - బూల్ చంద్ కన్నీళ్ళు ఆపుకోలేక పోయాడు. ఆనాడు స్వయంగా నరసయ్యని ఇంటికి తీసుకెళ్ళి భోజనం పెట్టి, కొత్త బట్టలు ఇచ్చి, అయిదు వందలు చేతిలో పెట్టి పంపించాడు. నరసయ్య ఏదో ధోరణిలో అడిగినా, ఆ మాటల్ని గౌరవించి, నరసయ్యకిచ్చే జీతానికి మరో అయిదు కలిపి అరవై అయిదు మీద చంద్రుడికి ఆ ఉద్యోగం ఇచ్చాడు.

నరసయ్య అయిదువందల్ని రుక్మిణి పెట్టెలో పెట్టి, గుమ్మంలో నులక మంచం వేసుకుని నిద్రపోయాడు. అతని జేబులో అవసరానికి చుట్టల్ని చంద్రుడు నింపితే, వేళకి తులసి అన్నానికి తీసుకెళ్ళేది ఏదో అపస్మారంలో బ్రతికేవాడు నరసయ్య. అది పిచ్చికాదు. అన్నీ తెలిసి, ఏదీ తెలుసుకోడానికి ఇష్టపడని మొండిదశ. ప్రపంచం నుంచి విడిపోవడానికి కావాలని నిర్మించుకున్న ఇనుపగోడ. రుక్మిణిని గురించి ఆలోచన తప్పిస్తే ఇక ఏమీ కనిపించదన్న వెర్రి భయం. అదీ ఆ అపస్మారానికి అర్థం.

నరసయ్య దుఃఖంలో దిగజారిపోకుండా సాకే కష్టాన్ని తప్పక తులసి, తప్పినా చంద్రుడు పంచుకున్నారు. ఆమె ఓర్పుని చూసి చంద్రుడు, చంద్రుడి నిశ్చయాన్ని చూసి ఆమె ఆశ్చర్యపడేవారు. నిశ్శబ్దంగా కష్టాన్ని అంగీకరించడం, మౌనంగా దాన్ని ఎదుర్కొనడం, దాంట్లో మునిగిపోకుండా ఈది ఒడ్డుకురావడం - ఈ అచేతన చైతన్య ఒకరి నొకరిని మరీ దగ్గర చేశాయి. ఒకే నీటి గుంటలో ఇరుక్కుపోయిన రెండు చేపల ముక్కులు తరుచు కలిసినట్టు నరసయ్యని సరిదిద్దుకు రావడంలో ఇద్దరి చేతులూ చాలాసార్లు కలిశాయి. ఇద్దరి కళ్ళూ మెరిశాయి. ఒకరి పట్ల ఒకరు మనసుల్లో జాలిపడ్డారు. ఒకరి త్యాగానికి ఒకరు తమకు తెలిసిన భావాలతోనే అభినందనలు పలుక్కున్నారు. చిరిగిపోతున్న ఆమె చీరెలకు మారుగా కొత్తవి కొని ఇచ్చే బాధ్యత అతని మీదే పడిందిప్పుడు.

*సంతోషం మనిషిని తేలిక చేసి, గాలిలో ఎగరేస్తుంది. గాలి పూరించిన బుగ్గలాగ ఊరిస్తుంది. ఎక్కువయితే పేలుస్తుంది. దుఃఖం మనిషి కుదేస్తుంది. నిలదీస్తుంది. మరొక మనిషికి దగ్గర చేస్తుంది. ఇద్దరినీ కలబోస్తుంది. అందుకే కష్టాల్లో భాగాలు పంచుకున స్నేహం కలకాలం నిలుస్తుంది.*

వివాహమనే సాంఘిక న్యాయానికి ఇంకా సమాధానం చెప్పకుండానే - ఉద్రేకాలు మినహా, ఉద్దేశపూర్వకంగా దాదాపు భార్యాభర్తలుగానే జీవిక సాగిస్తున్నారు వారిద్దరూ. మధ్య నరసయ్య అనే ముసలి ప్రాణి సాక్షిగా. దానికి 'ప్రేమ' అని పేరు పెట్టుకోవాలని వాళ్ళకి తెలీదు. చంద్రుడికి ప్రేమ గురించి తెలీదు, ఏ సాయంకాలమయినా చేతికందిన చేమంతి పూలదండని ఆమెకోసం కొనుక్కురావడం తప్ప ఆ విషయం అసలు అర్థంకాదు, అతని అవసరానికి వెచ్చటి నీళ్ళని స్నానానికి సిద్ధం చెయ్యడం తప్ప. ఏ అపూర్వ అనుభూతులను మనస్సులోనే పదిలంగా ఉండాలో వాటినలాగే ఉంచుకుని ఏవి బయటికి కనిపించాలో అవే బయలుపరుస్తూ, నిరాడంబరత నిర్ణీత అక్షాంశంగా వాళ్ళ సాంసారిక జీవితం 'సంసారం' అనే పేరు పొందక ముందే ఆ నాలుగు గోడల మధ్య నడక ప్రారంభించింది.

ఓ రోజు నరసయ్య నిద్రనుంచి లేచి, చంద్రుడు తెచ్చి ఇచ్చిన కాఫీ తాగుతూ, "ఒరే రాముడూ! నేనిక చచ్చిపోతానురా" అన్నాడు. అప్పటికాయనకి అనారోగ్యం లేదు.

అనుభవాల తాకిడికి నలిగి, అలసిపోయిన ప్రాణిలోని నిర్వేదం ఆ గొంతులో కనిపించి ఆశ్చర్యపోయాడు చంద్రుడు.

నలుగురికి అర్థమయే భాషలో చాలా రోజుల తర్వాత మొదటిసారిగా ఆయన మాట్లాడిన మాటలివి:

"అంటే ఉరిపోసుకు చావననుకో! కాని, ఇంకా ఇలా నులకమంచం మీద బ్రతకాలని లేదు. ఏం చెయ్యమంటావు చెప్పు!" అన్నాడు.

"మళ్ళీ బూల్ చంద్ దగ్గరకి రండి" అన్నాడు చంద్రుడు.

తల అడ్డంగా తిప్పాడు ముసలాయన. "రుక్కు తల్లి చచ్చిపోయిందనగానే నా కెక్కడికేనా పారిపోదా మనిపించింది. ఎవడి పీకయినా పిసుకుదామనిపించింది. అదెందుకు చచ్చిపోవాలి? - ప్రేమించడం దాని తప్పా? వాడెవడో దాన్నెందుకు పెళ్ళిచేసుకోలేదు? వాడికి పెళ్ళిచేసుకునే ధైర్యం ఎందుకు లేదు? ధైర్యం లేని వెధవలుగా ఎందుకు బ్రతుకుతున్నాం మనం? 'ఒరే, నా కూతుర్ని నువ్వు చేసుకో అని నేను నలుగురిలో వాణ్ణెందుకు అడగలేదు? వాడికి పుట్టబోయే పిల్లని ప్రపంచానికి నా రుక్కు తల్లి ఎందుకు చూపించలేకపోయింది? ఈ ప్రశ్నలకి సమాధానం ఎవడు చెపుతాడురా? నాకు నేనే వేసుకున్నాను ఈ ప్రశ్నలు. అంతా చెప్పాలి. మనమంతా సమాధానం చెప్పాలనిపించింది. అసలు దాని మంచి బతుక్కి ఈ తులసమ్మని ఎందుకు కష్టాలు పడనివ్వాలి? - నా కూతురు బాగుకి నా చెల్లెలు కూతురు ఎందుకు కడుపుకట్టుకోవాలి? - దానికి బాగా బతికే దిక్కులేదు కనక. నువ్వెందుకు నా దగ్గరుండాలి? నాకున్న పదిరూపాయల ఆదాయం నీకు లేదు కనక. మనల్ని సరిగ్గా బ్రతకనివ్వకుండా ఎవరో మనల్ని కోరల్లో బిగించేశార్రా? ఆ వెధవలన్నందరినీ చంపెయ్యాలనిపించింది. కాని, ఎవడు వాడు? ఎక్కడుంటాడు? ఎలా ఉంటాడు? పెద్ద బుర్రమీసాల్తో ఉంటాడా? సిల్కులాల్చీ వేసుకుంటాడా? పెద్ద కారులో తిరుగుతాడా? ఏమో! - వాడన్నీ చెయ్యొచ్చు. వాడిని చంపెయాలి! కాని, నే నొక్కణ్ణి. నాకా శక్తిలేదు. ఈ నులక మంచమే నా గది. నులకమంచాలు వేసుకు పడుకున్నవాళ్ళే చాలామందున్నారు. వాళ్ళనలా నడుం విరిచి పడుకోబెట్టే వాళ్ళెప్పుడూ ఉంటారు. నా నడుం విరిగిపోయింది బాబూ! నేనింక లేవలేను. అందుకే మరింత చచ్చిపోవాలనిపించింది!" అని చెప్పుకుపోయాడు. అలా మాట్లాడడంలో, అతణ్ణి మాట్లాడనియ్యడంలో నరసయ్యకో సుఖం తోచి వింటూ కూచున్నాడు చంద్రుడు.

"అయితే ఇప్పుడేమిటంటారు?"

"ముందు నువ్వు నాకో సాయం చెయ్యి" అన్నాడు నరసయ్య.

"ఏమిటది?"

"నువ్వు ఈ తులసమ్మని పెళ్ళి చేసుకో! నీకూ ఎవరూ లేరు. దానికీ ఎవరూ లేనట్టే - నేనూ ఎప్పుడో రాలిపోతాను. నువ్వయినా దానికి దిక్కయితే - నేను రుక్మిణికి ఇవ్వలేనిది కనీసం దీనికయినా ఇచ్చిన వాణ్ణవుతాను," అన్నాడు.

చంద్రుడు మాట్లాడలేకపోయాడు. తమ బాంధవ్యానికి ఇప్పుడు ఆ పేరు పెట్టుకోవచ్చు కాని, ఆ జీవితం ఆ తోవలోనే నడుస్తోంది.

అయినా సంకోచంగా "ఆవిడని అడిగారా?" అన్నాడు.

"దానికేం తెలుసురా? నేను తినమన్ననాడు తిన్నది. కట్టుకోమన్న బట్ట కట్టుకుంది నా కూతురు పోతే నాతోపాటు ఏడ్చింది. నాతోపాటు నీకూ వండిపెట్టింది. నువ్వు దాని భర్తవంటే చేసుకుంటుంది. అది పల్లెటూళ్ళో పెరిగింది. దాన్ని కాపాడేవాడు కావాలి. వీధుల్లో తిప్పేవాడు కాదు. నువ్వా పని చెయ్యగలవు. అందుకని దాన్ని కట్టుకో!" అన్నాడు.

చంద్రుడు కాదనలేదు. కొద్ది మార్పులతో నరసయ్య చెప్పిన వాక్యాలు తనకీ వర్తిస్తాయి. తల్లి పెంచినచోట పెరిగి వలజ ఇచ్చిన ఉద్యోగం చేసి, నరసయ్య రమ్మంటే వచ్చి, ఇప్పుడిక్కడ బ్రతకడం తప్ప తను మాత్రం సొంతంగా చేసినదేముంది? అయితే, తన బ్రతుకు బయట ప్రపంచంలో, ఆమె జీవితం నాలుగు గోడల మధ్య "నా దగ్గర అయిదు వందలుంది. దానితో రుక్కు తల్లి జ్ఞాపకార్థం ఏదయినా మంచి పని చెయ్యాలనుకున్నాను. అదెలా చచ్చిపోయింది? - పుట్టబోయే కొడుకుని 'వీడు నా కొడుకు!' అని నలుగురికీ చెప్పుకోలేక చచ్చిపోయింది. నలుగురి అనుమతి పొందకుండా తల్లికావడానికి తొందరపడింది. నలుగురి అనుమతి లేకుండానే చచ్చిపోయింది. ఈ 'అనుమతి' ఉంది చూశావ్? - ఆడదాని ప్రాణానికి ఎక్కువ అవసరం. దాన్ని రుక్కు తల్లికి ఇచ్చేముందే పోయింది. దీన్ని మా తులసికి ఇచ్చి నేను పోతాను. దీని పెళ్ళి చేస్తాను. ఆ డబ్బుతోటి. ఇదే రుక్కు తల్లి జ్ఞాపకార్థం నేను చేసే పని," అన్నాడు.

ఆనాడు నరసయ్య కేదో ఆవేశంలాంటిది వచ్చింది. భోజనం చేసి బట్టలు వేసుకుని బజారుకి వెళ్ళిపోయేవాడు - నాలుగు రోజులపాటు పెళ్ళికి అవసరమయిన సామాన్లన్నీ సంసారపక్షంగా కొనుక్కువచ్చాడు. రుక్కు తల్లి చింతాకు పతకం చెరిపించి మంగళ సూత్రాలు చేయించాడు. అంతా సిద్ధం చేసి ముహూర్తం పెట్టించుకు వచ్చాడు. రేపు ముహూర్తమనగా "బయలుదేరండి" అన్నాడు.

"ఎక్కడికి?" అన్నాడు చంద్రుడు.

"అన్నవరం."

శుభలేఖల్లేవు, ఏమీలేవు. బంధువుల్లేరు. పిలుపుల్లేవు. సాయంకాలం బూల్ చంద్‌ని కలిసి వచ్చాడు. నరసయ్య రాత్రి చంద్రుడినీ, తులసిని తీసుకు రైలెక్కాడు. మర్నాడు ఉదయం పురోహితుణ్ణి మాట్లాడి దేవుడి సమక్షంలో పెళ్ళిచేసి, చంద్రుడికి కాళ్ళు కడిగి, అమ్మాయితో పాటు, పట్టుపంచెలు, నూటపదహార్లు ఇచ్చాడు. బూల్ చంద్ ఇచ్చిన పట్టుబట్టలు కట్టించాడు. రుక్కు తల్లి చీరె - ఇంకా. గట్టిగా ఉన్నదే - తులసి చేత కట్టించాడు. ఇద్దరిచేతా దగ్గర ఉండి సత్యనారాయణ వ్రతం చేయించాడు.

ఆ సాయంకాలం ఉన్న రెండు పంచెలు సంచిలో కుక్కుమని "ఒరే అబ్బాయి! నేను అనుకున్న పని అయిపోయింది. ఇక అవతారం చాలించేస్తాను," అన్నాడు.

ఏం చేస్తాడో తెలీక నివ్వెరపోయారు చంద్రుడూ, తులసీ.

"రాత్రి బండికి బయలుదేరి కాశీకి వెళ్ళిపోతాను. ఇంక తిరిగిరాను. నా గురించి ఇక ఆలోచించకండి. పెళ్ళి ఖర్చుపోను నూరు రూపాయలు మిగిలినయి. అవి పట్టుకుపోతాను," అన్నాడు.

వెళ్ళొద్దని కాళ్ళుపట్టుకు ఏడ్చింది తులసి. చేతులు పట్టుకు బతిమాలాడు చంద్రుడు. కాని, పట్టుదల వదలలేదు నరసయ్య.

"చచ్చే పీనుగుని నన్ను పట్టుకు దేవులాడతారేం? మీరు హాయిగా ఉండండి. నాకిక విశాఖపట్నం రావాలని లేదు. ఇటునుంచి ఇటే పోతా"నని కూచున్నాడు.

ఇది తప్పదని ఇద్దరూ అన్నవరం రైలు స్టేషనుకి వచ్చారు. ఆ వేళ ఉన్నంత తృప్తిగా ఎప్పుడూ తులసికాని, చంద్రుడు కాని నరసయ్యని చూడలేదు. రైలు రాగానే చంద్రుడి రెండు చేతులూ పట్టుకుని "నా రెండో కూతురు రాముడూ అది. చచ్చిపోయిన దాని కోసం మేమిద్దరం కష్టాలు పడ్డాం. నువ్వయినా సుఖమేమిటో దానికి చూపించు," అన్నాడు.

తులసి ముఖాన్ని రెండుచేతుల్తో పట్టుకుని బుగ్గల మీద ముద్దు పెట్టుకుని, "పోతానే అమ్మడూ! నీకు కూతురు పుడితే రుక్కు తల్లి పేరు పెట్టుకో. కొడుకు పుడితే మాత్రం నా పేరు పెట్టకు. అది నీకు జ్ఞాపకం రావాలి. నేను జ్ఞాపకం లేకపోయినా ఫరవాలేదు," అన్నాడు.

మసక చీకటివేళ రైలు కదులుతూంటే వాళ్ళిద్దరూ కనిపించినంతసేపు నరసయ్య ముఖం దీపంలాగ వెలగడం వాళ్ళకి గుర్తుండిపోయింది.

***

## 16

**నల్లటి తారుడబ్బా మీద** అంటించిన ముచ్చిరేకులాగా ఉన్నాడు చంద్రుడు. రాత్రి ఇటు ఒరిగింది.

నిరాశ్రయంగా పడి ఉన్న ప్లాట్ ఫారాన్ని కొత్త ప్రయాణికులు ఆక్రమించుకుంటున్నారు.

తూరుపు ఆకాశం ఎక్కడో టపాకాయల పేలుడికి భయపడుతూంది. చంద్రుడికి నీరసం వచ్చింది.

నిద్రమత్తులో తూగుతున్న టీస్టాలు వాడిని లేపి, చప్పగా చల్లారిపోయిన ఉప్పటి 'టీ'తాగాడు చంద్రుడు. పంచదార చాలా మట్టుకు ఉప్పగా ఉంది.

రుక్మిణి చేసిన పనే చెయ్యబోవడానికి తులసికి ఇంకా రుక్మిణి జ్ఞాపకం ఉందా అని ఆశ్చర్యపోయాడు. తులసి జీవితంలో చూసిన ఒకే ఒక ఆత్మహత్య అది. కాని కారణంలో దానికి దీనికి పోలిక లేదు. లేకపోతే స్త్రీకి ఆత్మహత్యను గురించిన ఆలోచన స్వత సిద్ధమేమో!

"నా రెండో కూతురురా ఇది!" అని మసక వెలుగులో సంవత్సరాల క్రితం నరసయ్య చేసిన హెచ్చరిక ఇంకా గుర్తుంది.

ఇప్పుడు నరసయ్య ఎక్కడున్నాడు? ఎనభై సంవత్సరాలు బ్రతక గలిగితే, ఏ మారుమూలో, ఏ హిమాలయాల్లోనో ఉండి ఉంటాడు. మృత్యువు దయతలచి ఉంటే, ఎప్పుడో సుఖంగా ఆవిడ ఒడిలో నిద్రపోయి ఉంటాడు.

పాత బ్రతుకు మీది ఆలోచనలతో మనస్సు ఆలోడితమయింది. టీ వాంతి అయేటట్టుంది. కొళాయి దగ్గరకి వెళ్ళి నీళ్ళు పుక్కిలించి ఉమ్మేశాడు. ముఖం మీద చన్నీళ్ళు జల్లుకున్నాడు.

ఎదుటి ప్లాట్ ఫారం మీద అప్పుడే ఆగిన రైలులోంచి తనని రాత్రి మోసం చేసిన ఆంగ్లో ఇండియన్ అమ్మాయి రోజ్ దిగుతూంది. కళ్ళు నిద్రమత్తులోనో, మరే మత్తులోనో వాచి ఉన్నాయి. బట్టలు నలిగాయి. ఏ స్టేషన్లోనో నాలుగుకంటె ఎక్కువ ధరకు అమ్ముడు పోయి ఉంటుంది. ఎవరో ముసలాయన ఆమెను దింపాడు తండ్రి గావును. భుజం మీద చెయ్యి వేసి తీసుకు వెళుతున్నాడు.

ఆసక్తి తీరక - పక్కనే ఉన్న ఆర్.ఎమ్.ఎస్. ఉద్యోగిని అడిగాడు. "ఆ అమ్మాయి మీకు తెలుసా?" అని.

ఆ ఉద్యోగి అటు చూసి చిరునవ్వు నవ్వాడు.

"పావని. ఏం బాబూ! - టోపీ వేసిందా ఏమిటి?" అన్నాడు నవ్వుతూ.

"ఆ పక్కనే నడిచే ముసలాయన ఎవరు?"

"వాళ్ళనాన్నలే. గార్డుగా పనిచేశాడు ఎప్పుడో. ఉద్యోగం పోయింది, ఏదో బ్రతకడానికి సవాలక్ష మార్గాలు, హుషారైన పిల్ల," అన్నాడు - మళ్ళీ తన పనిలో పడుతూ.

*ఉపాధికోసం తమ నీతితో రాజీ పడ్డారు వాళ్ళు. నీతిని ఉపాధిగా చేసుకున్నవాళ్ళు కొందరుంటారు.*

నీతితో రాజీపడి, సంఘంతో రాజీపడడానికి భయపడి చచ్చిపోయింది రుక్మిణి.

మరి - తనమీద దెబ్బతీయడానికి పులిలాగ రెచ్చిపోయిన వలజ నీతివేరు. అది ఆమె బ్రతికే సమాజంలో, సడలి సర్దుకుని నిలదొక్కుకున్న నీతి.

ప్లాట్ ఫారం బయట నిలబడి చూస్తే మొగల్రాజపురం కొండ అలసి నిద్రపోతున్న వెలయాలి రొమ్ములాగ ఉంది.

ఈ పాటికి తులసి నిద్రపోయి ఉంటుంది. ఆత్మహత్యను గురించిన ఆలోచన, ఆ ప్రయత్నం ఆమెను పూర్తిగా అలసిపోయేటట్టు చేసి ఉంటుంది.

వలజ గుర్తుకొచ్చింది. మనస్సుని విలవిలలాడించే అవమానం తను చేసినా, వెంటనే తేరుకుని తులసి సాయానికి వచ్చిన ఆమెపట్ల జాలికలిగింది. అసలు ఇద్దరి మధ్యా ఈర్ష్యాద్వేషాలు ఉండడానికి అవకాశం ఎక్కడ? అజీర్ణరోగి మృష్టాన్న భోజనం చేసే మహారాజుని చూసి, ఈర్ష్య పడితే ప్రయోజనం ఏముంది? *పేదవాడు ఈర్ష్య పడినా కొంత అర్థం ఉంది. ఆర్థిక తారతమ్యం వల్ల కాకపోతే, తనకీ ఆ భోజనం చేసే అవకాశం ఉండును కదా అనుకోవచ్చు. అజీర్ణరోగి ఆవేశపడితే మాత్రం ఏం లాభం?*

మొదటి నుంచీ స్వేచ్ఛాజీవనానికి అలవాటు పడింది వలజ. తన చిన్న పరిధిలోనే కట్టుబాట్లకి ఒదిగిన వాడు తను. ఆ రోజుల్లోనే తనతో మామిడితోపుల్లో తిరిగేది. ఈ రోజు తన భార్యతోనయినా ప్లాట్‌ఫారం మీద కూచోడానికి సిగ్గుపడుతున్న వ్యక్తి తను. తనమాట నెగ్గించుకునేందుకు ముద్దుని ఎరచూపి కోరల్ని గుచ్చగలదు ఆమె. తన కోరికకు నాలుగు రూపాయలను దానంగా ఇచ్చయినా ముద్దును సంపాదించుకోలేడు తను.

వలజ మీద జాలికలిగిన కొద్దీ - తన ప్రవర్తనకి తనకే అసహ్యం కలిగింది. వెంటనే క్షమాపణ చెప్పుకోవడం భావ్యమని అనిపించింది.

అహం దెబ్బతిని, కొన్ని గంటల క్రితం ఎంత ఉద్రేకంగా మెట్లెక్కాడో, అహాన్ని అణగద్రొక్కి అంత ఉద్రేకంగానూ మెట్లెక్కాడు. క్షమాపణ చెప్పుకునేందుకు. ఆమె భర్త అక్కడ ఉన్నాడన్న విషయం కూడా మరిచిపోయి.

పధ్నాలుగో నెంబరు గది తలుపును రెండుసార్లు తట్టినా ఎవరూ పలకలేదు లోపల్నుంచి. లోపల లైటు వెలుగుతూంది. వసారా అంతా చీకటిగా ఉంది. మూడోసారి పిలుపుకి "ఎవరది?" అన్నారు. ఆ ప్రశ్నకి త్రుళ్ళిపడ్డాడు, ఆ ప్రశ్న తను ఊహించినట్టు గదిలోంచి రాలేదు. శబ్దం ముద్దయి, చిదికి ద్రవించి బయట నుంచి - తన పక్క చీకటిలోంచి - నేలమీంచి వచ్చింది. త్రుళ్ళిపడ్డాడు.

శక్తిమేరకు కళ్ళు చీకటిలోకి చూశాయి. స్థంభాన్ని ఆనుకుని ఎవరో కూచున్నారు. లేస్తే, వలజని గుర్తుపట్టి నిర్విణ్ణుడయి పోయాడు.

"వలజా!" అన్నాడు.

"ఇష్! మెల్లగా, అరవకు బాబూ - నీకు పుణ్యం ఉంటుంది." అంది - భుజం పట్టుకు లాగుతూ.

"ఇప్పుడే ఆయనకి నిద్రపట్టింది," అంది కాస్సేపాగి, ఆ గొంతులో ఆమెలో సహజంగా కనిపించే ఠీవి, దర్పం, నిలకడా అన్నీ చిదికిపోయి వికృతంగా తయారయాయి. ఇంకా అక్కడ మసక వెలుగుగానే ఉంది.

"ఎందుకొచ్చావ్? వెళ్ళిపో ఇక్కణ్ణుంచి," అంది వలజ దీనంగా. ఆ దైన్యం జన్మలో తాను ఆమె కంఠంలో ఊహించనిది. ఆమెకీ కొత్తలాగానే ఉంది,

"అదేమిటి వలజా?"

"వెళ్ళు బాబూ! నీకు దండం పెడతాను, ఇటురాకు," అంది మళ్ళీ.

"ఇందాక నేను నీ పట్ల తొందరపాటుతో ప్రవర్తించాను. క్షమాపణ చెప్పుకోవాలని,"

"ఎందుకు చాంద్, నన్ను అవమానిస్తావు? అసభ్యంగా ప్రవర్తించింది నేను; మీరంతా దిగ్భ్రాంతి చెందేటట్టు - మాకు డబ్బుంది. అదే మా రక్షణ. అదే మా గర్వం. మా ముందు మీరెంత? చీమలు, దోమలు, వెళ్ళిక!" ఆ మాటల్లో ఏదో ఉద్రేకం, ఆవేశం కనిపెట్టి అప్రతిభుడయాడు. "నీ హోదా అంటే నాకు ఈర్ష్యలేదు వలజా? - నన్ను నమ్ము." అన్నాడు.

"అబ్బబ్బ! చెపితే నీకు అర్ధంకాదేం? మమ్మల్ని చూసి నువ్వెందుకు ఈర్ష్యపడాలి! మిమ్మల్ని చూసి మేమే ఈర్ష్యపడతాం. ఆ విషయం బయటికి చెప్పుకోం. అంతే తేడా. నీలాంటి వాళ్ళ ముందు నైట్ గౌన్లతో చిరునవ్వుతో నవ్వి, మనసుల్లో అగ్ని సెలయేరుల్లాగా సాగుతూ బ్రతుకుతారు. మీరు మీ పెళ్ళాలకి ఖరీదయిన డ్రింకులు కొని తాగిస్తారు. మేం వాటిని కొనుక్కుంటాం. మా భర్తలు కొనివ్వరు. కొనిచ్చే అనుభవం వారికీ, ఇస్తే పుచ్చుకునే అనుభూతి మాకూ కొత్త. మా భర్తలు తాగివచ్చి మా తలలు బద్దలు కొడతారు, మా అంతస్తుకి రావడానికి మీకెన్ని గుండెలు? వెళ్ళు కిందకి," అంది ఉదుటుగా.

చంద్రుడు భయపడిపోయాడు. "ఎందుకు వలజా. అంత ఉద్రేకం?" అన్నాడు మళ్ళీ.

"యూ స్టుపిడ్! నీ భాషలో చెపితే నీ కర్ధంకాదు.ఇలారా." అని స్థంభానికీ స్థంభానికి మధ్య వసారాలోకి పడే వెలుగులోకి అతన్ని లాక్కొచ్చి, తలమీద చెయ్యేసి చూపింది. "నీ చేతికి తగిలిన వెచ్చటి ద్రవ్యం నా రక్తం. చాలా ఖరీదయిన విస్కీ సీసాతో మా ఆయన ఇచ్చిన బహుమానం." చెంపలకి చేతులు రాసుకుని - "నునుపు రంగు చూసి ఇందాక నువ్వు మూర్చపోయిన ఈ చెక్కిళ్ళ మీద వేళ్ళ గుర్తులు మా ఆయనవి, అయిదు వేళ్ళూ సరిగా లెక్కపెట్టు. ఇంక చాలా?" అంది.

"ఇంత పని అతను చేశాడా? నువ్వేం తప్పు చేశావని?" నిర్ఘాంతపోతూ అడిగాడు.

"నేనేం తప్పు చెయ్యనక్కరలేదు చాంద్! ***డబ్బు మనిషికి కొన్ని స్వేచ్ఛలు ఇస్తుంది.*** ఆయన ఇష్టం వచ్చినట్టు ఆయన బ్రతకవచ్చు. నా ఇష్టం వచ్చినట్టు నేను బ్రతుక వచ్చు. అప్పుడు తగాదా లేదు. ఆయన ఇష్టం వచ్చినట్టూ నేను బ్రతకాలనుకోవడం - పతివ్రత అనుకునే పిచ్చి ఆలోచన. భార్య ఇష్టాన్ని గౌరవించడం - పేదవాడి బలహీనత. ఈ రెండిట్లో ఏది కావాలన్నా ప్రతిఫలం ఇంత ఘాటుగా ఉంటుంది. డబ్బుతో ప్రేమని కొనుక్కోలేమని ఇందాక నువ్వే నిరూపించావు."

"ఏమిటో అనుకున్నాను. నిన్ను చూస్తే నాకు జాలేస్తోంది."

కన్నీళ్ళ మధ్య నవ్వింది. "పిచ్చి చాంద్! ఆ మాట పగటికల. ఏ ధనవంతురాలి తోటీ అనకు. 'అలా అనడానికి నీకెన్ని గుండెలు?' అనగలదావిడ! మా దుఃఖానికి కూడా బయట ప్రపంచాన్ని చూసే అర్హత లేదు. మీ ఆవిడ ప్లాట్ ఫారం మీద కన్నీరు కార్చగలదు. కాని, నేను ఈ చీకటి కోణంలోనే కూచుని ఏడవాలి. నన్ను దెబ్బలాడి, తగాదపడి నువ్వెందుకు పెళ్ళిచేసుకోలేదు చాంద్! నన్నెంతగా శిక్షించావ్?" అంటూ వలవలా ఏడ్చేసింది. అతని గుండె మీద తల ఆనించుకుని.

చంద్రుడు నిశ్చేష్టుడయి అలాగే ఉండిపోయాడు. అంతలో దుఃఖాన్ని ఆకట్టుకుంది. "మన గ్రామం వదిలాక ఆయన ఎన్నో ఎదురు దెబ్బలు తిన్నారు. ఎందరి కొంపలో ముంచారు. ఎందరినో నమ్మించి మోసం చేసారు. తప్పేముంది? - అది ఆయనకి చేతనైన విద్య. నన్ను కట్టుకోవడం కూడా ఆయన చేసిన లౌక్యంలో ఒక భాగమే. చివరికి సినిమా తీస్తానన్నారు. తీస్తానంటూ వచ్చిన మనుషుల డబ్బుమీద ఆరేళ్ళు గడిపారు. ఆస్తి పెరిగింది. తీసే సూచనలు తరిగాయి. ప్లేటు మార్చేశారు. ఇవాళ నిజంగానే సినిమా తీస్తున్నారు. మరో కొత్తరకం జీవితం ప్రారంభమయింది. ఇన్నాళ్ళూ డబ్బునీ హోదానీ అనుభవిస్తూనే ఉన్నాం. ***సినిమా ప్రపంచంలో పతనమయే వాడుకూడా - ఏదో అంతస్తులోంచి జారిపోతున్నా, టెర్లిన్ బట్టలతోనే ఉంటాడు. ఇంట్లో భోజనం లేకపోయినా - పక్కవాడి చెవర్లెట్ కారుని డ్రైవ్***

***చేస్తుంటాడు.*** ఆయనకా హంగులన్నీ తెలుసు. అలా తిరిగే వాళ్ళని తెలుసు. తిరగడం తెలుసు. జీవితం డాబుగా, గంభీరంగా నడుస్తోంది. బయట భౌతిక శరీరం ఊరిపోతూంది. లోపల నైతిక శరీరం కుళ్ళిపోతూంది. మీరు మాసిన చొక్కాలు వేసుకున్న ఆరోగ్యవంతులు. మేము చెమ్కీ దుస్తులు కట్టుకున్న రోగిష్టులం. మా దగ్గరికి రాకండి, పొండి!" అంది పిట్టగోడమీద తల ఆనించి.

ఇలా మాట్లాడటం - ఇంత నగ్నంగా వలజ మనస్సు విప్పుకోవడం చంద్రుడు జీవితంలో ఊహించని విషయం. మంత్ర ముగ్ధుడిలాగ ఆమె మాటలు వింటూ నిలబడిపోయాడు.

ఇంకా నిశ్శబ్దంగా ఉండటం చూసి - అతని భుజం పట్టుకుని మెట్లవరకూ నడిపించుకు వచ్చింది. "ఇలా మాట్లాడినందుకు రేపు మళ్ళీ సిగ్గుపడాలి చాంద్! నన్నింక మాట్లాడించకు. వెళ్ళు. మేం ఎక్కే రైలు ఎక్కకు. మా గమ్యాలు వేరు. మేం అక్కడికి అసలు చేరుతామో లేదో తెలియదు. మీరు గమ్యం చేరకపోయినా సుఖంగా ప్రయాణమయినా చేస్తారు." అనేసి వెళ్ళిపోయింది చీకట్లోకి.

ఆమెని ఇంక మాట్లాడించడం మంచిది కాదనిపించింది. బహుశా, ఇదీ ఒక రకం హిస్టీరియాయేమో. అసంతృప్తీ, భంగపాటూ కలసి దిగజార్చిన వింత మైకమేమో.

అప్రతిభుడయి మెల్లగా మెట్లు దిగిపోయాడు చంద్రుడు. వలజ సూచించిన స్వర్గంలోకి.

అది విజయవాడ ప్లాట్ ఫారమ్.

## 17

సంవత్సరం తర్వాత అనుకోకుండా ఓ విచిత్రమయిన ఉత్తరం వచ్చింది. ఉత్తరం మీద రుక్మిణి పేరూ, అడ్రసూ ఉంది. విస్తుపోతూ చంద్రుడు విప్పిచూస్తే - కింద 'ఇస్మాయిల్' అని సంతకం ఉంది. ఆలోచించిన మీదట చంద్రుడికి గిరిజాల అబ్బాయి పొడవాటి విగ్రహం గుర్తుకొచ్చింది.

ఉత్తరం ఒక జీవితకాలం ఆలస్యంగా రుక్మిణికి ఒక మంచి వార్తను తెచ్చింది. "ఇప్పటికి కుటుంబ పరిస్థితులు చక్కబడ్డాయి. మా నాన్నగారు ఈ మధ్యనే పోయారు. ఇప్పుడిక మతం పేరిటా, సంప్రదాయం పేరిటా అభ్యంతరం పెట్టేవాళ్ళెవరూ లేరు. ఎప్పుడు రమ్మంటావో రాయి- ఇస్మాయిల్." కింద ఒక వాక్యం వ్రాశాడు. "ఇక్కడికి వచ్చేటప్పుడు నీకు చెప్పకుండా వచ్చేశాను. పరిస్థితుల గురించిన భయమే అందుకు కారణం. ఏమనుకున్నావో ఏమిటో! -"

అతని భయానికి ఆమె జీవితాన్నే నష్టపోయిందని తెలిసినప్పుడు ఇస్మాయిల్ ఎలా చలిస్తాడో చూడాలనిపించింది చంద్రుడికి. జాడ తెలియని ఆ ఇస్మాయిల్ని ఎన్నిసార్లు తనూ, తులసీ - ఎక్కడో ఉన్న నరసయ్యా ఎంత శపించారో ఆలోచించి నవ్వుకున్నాడు. ***మనిషి పరిస్థితులకి బానిస అవుతాడు. కొందరు పారిపోతారు. కొందరు వ్యవధి తీసుకుని నిలదొక్కుకుంటారు. కాని, ఆ వ్యవధిలో నిలదొక్కుకునే ఫలితానికే కాలదోషం పట్టవచ్చు.***

చంద్రుడు సమాధానంగా చిన్న ఉత్తరం వ్రాశాడు. "మీ అభ్యంతరాలు ఇప్పటికయినా తీరినందుకు చాలా సంతోషం. కాని ఇప్పుడు మీ పెళ్ళికి మరో అభ్యంతరం ఎదురయింది. దాని పేరు మృత్యువు. ఆమె అన్న - చంద్రుడు." కింద ఒక వాక్యం వ్రాశాడు. "రుక్మిణి పుట్టబోయిన మీ బిడ్డతో సహా ఆత్మహత్య చేసుకుని సంవత్సర మయింది."

దానికి సమాధానాన్ని ఆశించలేదు చంద్రుడు - అది మానిపోతున్న పాతగాయం. దాన్ని మళ్ళీ కెలకడం ఇష్టంలేదు. కాని, తిరుగు రైలులో ఇస్మాయిల్ ఇల్లు వెదుక్కుంటూ వచ్చేశాడు.

ఈ వార్త అతనిమీద ఎలా పనిచేసిందో అతని ముఖం చూడగానే అర్థమయింది. ఒక పదిరోజుల క్రితం వరకూ ఆ వ్యక్తి కనిపిస్తే పీక నులిమి చంపాలన్న కసి, అతన్ని చూడగానే నీరు కారిపోయింది. ఎంతో నష్టపోయిన దైన్యం, బాధ, దిద్దుకోలేని పొరపాటు జరిగిపోయిందన్న తపన - అన్నీ ఇస్మాయిల్‌లో చూశాడు.

"ఎందుకు ఆవిడకి చెప్పి వెళ్ళలేదంటే, చెప్పాలనే ఉద్దేశం. కాని మనిషి చాలా స్థిమితం. తొందరపడే తరహా కాదు. చెప్పకపోయినా నిలబడగలదకున్నాను. నేను తండ్రిని కాబోతున్న విషయం నాకు తెలీదు."

నవ్వొచ్చింది చంద్రుడికి. వెనక్కి తిరిగి ఆలోచిస్తే, తన మనోనిశ్చయానికి రుక్మిణి చాలా పెద్ద ఖరీదు చెల్లించింది. జీవితంలో ఏ స్త్రీకయినా వరం కావలసిన మాతృత్వం ఆమె విషయంలో శాపమయిపోయింది.

ఇంకా అవశేషాలుగా ఉన్న ఆమె చీరలు, పుస్తకాలు, ఫోటో, పెట్టె అన్నీ చూసి ఇస్మాయిల్ కూడా దుఃఖం ఆపుకోలేకపోయాడు. రెండురోజులు అక్కడవాళ్ళతో గడిపి వెళ్ళిపోయాడు.

మళ్ళీ రుక్మిణి జీవితం మీద తీయనవసరంలేని మూతపడి పోయింది. అదిప్పుడిక బిగుసుకుపోయినా ఫరవాలేదు.

పెళ్ళి అయిన నాలుగు నెలలకి ఇల్లు మార్చాడు చంద్రుడు. పాత ఇంట్లో ఆలోచనలు అడపాతడపా రాలే బూజుల్లాగ భయపెట్టేవి. ఒక వ్యక్తిని విధీ, ఒక వ్యక్తిని పరిస్థితులు లాక్కుపోయాక ఆ ఇంట్లో మరింక ఉండాలనిపించలేదు. పక్కసందులోనే ఏడు రూపాయల అద్దెకు రెండు గదుల వాటా తీసుకున్నాడు. కాని, ఆ ఇల్లన్నమాటేమిటి? - ఆ ఊరు - రుక్మిణిని చంపిన ఆ సముద్రం, నరసయ్య కూచున్న ఆ కుర్చీ, రుక్మిణితో అర్ధరాత్రి నడిచిన ఆ రోడ్లూ, అన్నీ దిగాలుపడ్డ పాత జీవితాన్ని గుర్తు చేస్తూండేవి. అప్పుడప్పుడు ఎక్కడికయినా పారిపోతే బాగుణ్ణనిపించేది.

తులసిది సహజంగా ఎక్కువ మాట్లాడే స్వభావం కాదు. మాట్లాడే అలవాటు, ఆలోచనా లేనిపిల్ల. దానికి తోడు భర్తంటే భక్తి, గౌరవం స్వతసిద్ధంగా అబ్బి, ఆమె నోటిని మరింత కట్టేశాయి. చంద్రుడికీ, ఆమెకీ మధ్య దైనందిన జీవితంలో కదిలే మాటలు తప్పిస్తే, ఎప్పుడన్నా తీరికగా కూర్చున్నా, రుక్మిణి ప్రసక్తో నరసయ్య ప్రసక్తో వచ్చేది. వాళ్ళిద్దరికీ మధ్య ఉన్న సామాన్యపు అనుభవం అది. ఆ ప్రసక్తి అంత ప్రసన్నతలోనూ దిగులునే తెచ్చిపోసేది. అందుకని వాళ్ళ మధ్య అలవాటుచేత, ప్రయత్నం చేతా నిశ్శబ్దమే నిలిచిపోయింది. కాక, మాట్లాడుకునేటప్పుడు కాస్త భయమూ ఇద్దరికీ కలిగేది - పాత కథ ఛాయలు ఎప్పుడు తొంగిచూస్తాయోనని.. చంద్రుడిపట్ల తులసి భక్తిప్రపత్తులు, వలజ పట్ల చంద్రుడి ప్రేమానురాగాలు మనసులోనే నిలిచి మాటలు కరువయాయి. ***నిశ్శబ్దం ఓ శక్తి. అది మనిషిని అంతర్ముఖం చేసినట్టే అవసరమయితే ఆర్పివేస్తుంది.*** ఈ రెండూ వాళ్ళిద్దరిలో వేర్వేరు ప్రతిఫలించాయి. చంద్రుడిలో జీవనం ఒక విధమైన అనాసక్తకాండగానూ, తులసిలో ఈ బ్రతుకు పారమార్థిక సాధనంగానూ నిలిచిపోయింది.

ఇది ఇక ఇద్దరు పిచ్చివాళ్ళ కథ.

ఈ పరిస్థితుల్లో కాస్త ఆటవిడుపును కలిగించింది - ఇస్మాయిల్ రాసిన ఉత్తరం. హైదరాబాద్ వెళ్ళిపోయిన నాలుగయిదు నెలలకి పెద్ద ఉత్తరం వ్రాశాడు చంద్రుడికి. మిగతా విషయాల మాట ఎలా ఉన్నా, ఒక్క విషయం చంద్రుడిని ఆకర్షించింది. "మీ ఉద్యోగం పెద్ద ప్రయోజనకరంగా ఉన్నట్టులేదని, మీ ఇల్లూ అదీ చూశాక నాకనిపించింది. మా మిత్రుడొకాయన మీకు ఇక్కడ రేషన్ షాపులో ఉద్యోగం ఇప్పిస్తానన్నాడు. మీ కిష్టమయితే హైదరాబాద్ రండి. ఇక్కడ ఉద్యోగాలు బాగుంటాయి."

బాగోగుల మాట ఎలా వున్నా, ఈ ఊరు వదిలిపోవాలన్న ఆరాటం ఇన్నాళ్ళకి తీరబోతున్నందుకు సంతోషించాడు. తులసి కూడా ఇష్టంగా తలూపింది. వస్తున్నట్టు చంద్రుడు ఉత్తరం రాశాడు. ఆ నెల బూల్ చంద్ గారికి చెప్పి జీతం తీసుకుని రైలెక్కేశాడు.

హైదరాబాదులో ఇస్మాయిల్ మంచి స్థితిలో ఉన్నాడని అక్కడ అర్థమయింది చంద్రుడికి. స్టేషనుకి వచ్చి స్వయంగా స్వాగతం చెప్పాడు. ఇల్లు అద్దెకి సిద్ధం చేసి ఉంచాడు. దాని అద్దె ముప్పై రూపాయలంటే భయపడిపోయాడు చంద్రుడు. అప్పటికే బూల్ చెంద్ డెబ్బయి పైన ఇస్తున్నాడు. కాని, ఇది తన తాహతకి అందని ఖర్చు.

''భయపడకండి. ఇక్కడ మీ జీతం నూట ఇరవై'' అన్నాడు ఇస్మాయిల్.

ఉద్యోగం బాగానే కుదిరింది. గుమాస్తా ఉద్యోగమయినా సుఖంగా ఉన్నట్టు అనిపించింది. స్థలం మార్పుతో ఇద్దరి మనస్సులూ తేలిక అయినట్టు - గాలిలేని కూపంలోంచి మైదానంలోకి వచ్చినట్లు చంద్రుడు, తులసీ వేర్వేరుగా మనస్సుల్లో అనుకున్నారు. ఇప్పుడు ఇద్దరూ మాట్లాడుకోడానికీ, కలిసి చిరునవ్వు నవ్వుకోడానికి భయపడడంలేదు. క్రమంగా ప్రవృత్తిలో, ప్రవర్తనలో మార్పులు వచ్చాయి. పాలిపోయిన తులసి ముఖం ఎరుపెక్కడం ప్రారంభించింది. చంద్రుడి శరీరం కాస్త బరువయింది. అక్కడ నీరు మంచిది. గాలి మంచిది. అదీగాక, మంచిది కావాలనుకుంటూ బయలుదేరిన వాళ్ళ ఉద్దేశం మంచిది. ఉద్యోగం మంచిది. ఆ రోజుల్లోనే చంద్రుడి జీవితంలో వెన్నెల రాత్రులు ప్రారంభమయాయి. ఆ వెన్నెల రాత్రులలో నిండు పున్నమిలాగ మరో సంవత్సరం తిరగకుండా అమ్మాయి పుట్టింది.

పురిటి మంచం మీద ఆ పిల్లని చూస్తూనే, తన బుగ్గలు పుణికి పుచ్చుకుని మామయ్య కోరిన ఆఖరి కోరికను గుర్తుచేసింది తులసి. ఆ క్షణమే 'రుక్కు' అని పిలుచుకుంది పాపాయిని. ఇప్పుడిక రుక్కు' పుట్టాక రుక్మిణి జ్ఞాపకాలు, నరసయ్య జ్ఞాపకాలు దిగులుగా కాక దివ్యమైన అనుభూతులయి, అమ్మాయితోపాటు పెరిగాయి. ***పసిపాప ఆశకు చిహ్నం.*** ఆ లాలనలో ఆశే కనిపించింది కాని, పాత ఆవేదన, ఆరాటం తొంగిచూడలేదు.

అయితే ఈ ఆనందానికి అనుకోని అవరోధం ఎదురయింది. అది దైవికం, కొంత స్వయంకృతం కూడాను.

భర్తలో ఈ మాత్రపు అన్యోన్యతే వరమనుకుని, ఆ సంతోషంలో శారీరకమయిన రుగ్మతల్ని లక్ష్యం చెయ్యక, ఇల్లంతా తానే అయి భర్తకి సేవలు చేసింది తులసి. అతను ఇచ్చే ఆనందానికి వెయ్యిరెట్లు ప్రతిఫలాన్ని, అతను వేసే ప్రతీ అడుగుకీ ముగ్గులు చెక్కి చూపించింది. అజ్ఞానంవల్ల వచ్చిన మొండితనంతో అడపా తడపా ఎగదన్నే నీరసాన్ని తొక్కేసింది. ఆమె జీవితం మూడు పువ్వులూ, ఆరుకాయలుగా సాగిన దినాలు ఆ కొద్దే. అయితే అవి చాలా అపూర్వమయినవి - ఇప్పటికీ. భర్త కోరికలకి, సేవలకీ, ఎర అయిన బలహీనపు పంజరం మరో పుష్టికరమయిన ప్రాణిని తొమ్మిది నెలలు పోషించి బయటపడేశాక మరింత దిగనాసిల్లిపోయింది. కళ్ళు వెళ్ళుకొచ్చి, ముఖం పాలిపోయి, భర్తా బిడ్డల మధ్య నలిగిపోయింది తులసి. అయినా, అది అనారోగ్యమని, దానికి చికిత్స అవసరమని ఆమె మనస్సు గుర్తుపట్టలేదు. స్వభావం ఇంకా ఎదురు తిరుగుతూనే ఉంది.

చంద్రుడికి ఖాజీపేట బదిలీ అయినప్పుడు ఈసారి స్థలంలో మార్పు, తులసికి పుష్టి ఇవ్వలేదు. కాగా, మరింత ప్రమాదకరమయిన ఫలితాలను తెచ్చిపెట్టింది. రాత్రి అయేసరికి అలసట ప్రారంభమయేది. ఉదయం లేచేసరికి మత్తు, బద్ధకం ఇంకా నిలిచిపోయేవి, భర్త ఆఫీసువేళకి తీసే పరుగులూ, రుక్కు అవసరాలకు అదిరిపాటూ మధ్యాహ్నమయేసరికి శరీరాన్ని కుదిపివేసేవి. ఇంతకీ కారణం రక్తం తగ్గి, ప్రతీ చిన్న పనీ ఏదో అవయవాన్ని ఆర్చుకు తినేది. చంద్రుడు గుర్తించి శ్రద్ధ తీసుకునేలోగానే - తులసి కదలికలో నీరసం ప్రవేశించింది. తొందరపాటు తగ్గింది. మెరికలాగ ఇల్లంతా కలియ తిరిగే వేగం మాయమయింది. ఒకసారి పనిలో ఉండగా - మరిగే పాలకోసం పరుగుతీసే రుక్కుని ఆపాలన్న ఉద్దేశం ఆచరణకు వచ్చేలోగానే రుక్కు పాలగిన్నె తనమీద పోసుకుంది. ఆ భయానికి తులసి కాళ్ళు కదల్లేదు. ఆ షాక్ కాళ్ళలో అశక్తత, రక్తం పోటు అన్నీ కారణమయి, వాతంలాంటిదేదో కమ్ముకొచ్చి కాళ్ళు పనిచెయ్యడం మానుకున్నాయి.

కాలిన చేతులతో రుక్కు తల్లి, నడవరాని కాళ్ళతో తులసి మంచం పడితే - అన్నిటికీ తనే అయి - గత్యంతరం లేక మూడు నెలలు నలిగిపోయాడు చంద్రుడు. ఆ తర్వాతయినా మచ్చలు మినహా రుక్కు తల్లి చేతులు బాగుపడ్డాయి కాని, తులసి కాళ్ళు బాగుపడే ఆశ లేదని అంతకుముందే తేలిపోయింది.

అప్పటినుంచే చంద్రుడి జీవితంలో మళ్ళీ చీకటి రాత్రులు ప్రారంభమయాయి.

## 18

నాలుగుంపావు అయింది.

చిన్న కునుకు తీయాలని చేసే ప్రయత్నాన్ని ఎవరో చెదరగొట్టారు. కళ్ళిప్పితే వేలుపిళ్ళై కనిపించాడు.

"అమ్మగారు దిండు తెమ్మని చెప్పిరిసార్. ఈడ ఉందటనే!" అన్నాడు. తులసి నిద్రపోతూంది నిర్లిప్తంగా. మళ్ళీ చీరలూ, పంచా మడతపెట్టి తలకింద తోసి, తలగడని కదిపాడు. దాన్ని తీసుకుని వేలు పిళ్ళై వెళ్ళిపోయాడు.

ప్లాట్ ఫారం ఇప్పుడు మరీ రద్దీగా ఉంది. మరో పది నిముషాల్లో ఢిల్లీ - మద్రాసు జనతా వస్తోందని మైకులో చెపుతోంది. నిద్రమత్తు గొంతు. నిద్ర ఎగిరిపోయింది చంద్రుడికి.

వలజ తలగడ అవసరమయి పంపిందా, తనని లేపడానికా అని ఆలోచించేలోగానే - మేడమీంచి పెట్టెలు, బెడ్డింగులు దిగాయి. మళ్ళీ పోర్టర్లు హడావిడి పడుతున్నారు.

ప్లాట్ ఫారమంతా ఒళ్ళు విరిచి మేలుకొంటోంది. బల్లమీద కూచుని బద్ధకంగా ఆవలించాడు చంద్రుడు.

తెల్లటి మల్లెపువ్వులాంటి సిల్కు చీరెతో మెట్లు దిగింది వలజ. వెన్నెల చారలాగ అంతా తెలుపు ముద్ద. తెల్లటి బ్లౌజు. చెవులకి తెల్లటి డ్రాప్సు. తెల్లటి ఆకు చెప్పులూ - తలచుట్టూ తెల్లటి రుమాలు. చేతిలో తెల్లటి షామ్యాయ్. హాండ్ బాగ్. జుత్తుని నిన్న రాత్రిలాగ కాకుండా ముందుకు వంచి పిన్నులు పెట్టింది. పిన్నుల మధ్య దెబ్బ తగిలిన చోట పాలాస్త్రీ అంతించిన తెలుపు దూరానికి తెలియడంలేదు. అది గాయాన్ని దాచే ప్రయత్నంగాకాక, కొత్త శిరోజాలంకరణగా భావించింది. నాగరికతలో ఇలాంటి ప్రమాదాలకు అందమయిన ముసుగులుంటాయని అర్థం చేసుకున్నాడు. ఎర్రటి పెదవులు ఎప్పుడూ దగ్గర పడకుండా తెల్లటి పళ్ళవరస కనిపించేలాగ ముఖం మీద తెల్లటి చిరునవ్వు ఘనీభవించిపోయింది. ప్లాట్ ఫారం మీద దిగుతూనే అందుకు తర్ఫీదయిన కళ్ళు అతి నేర్పుగా చుట్టూ వెదికాయి. చంద్రుడు కనిపించగానే కళ్ళు నవ్వాయి. పెదవుల ప్రసక్తిలేకుండానే ఇంగ్లీషులో 'గుడ్ మార్నింగ్' చెప్పాయి. చంద్రుడికి అర్థమయేలోగానే - వేళు పిళ్ళై అయ్యగారి ప్రత్యేకమయిన హాండ్ బాగ్ - సీసాలతో నిండుగా ఉన్నది తీసుకుని వచ్చేశాడు. వెనకనే అయ్యగారు వచ్చారు. రంగరాజు క్రేప్ నీపాల్ టెర్లిన్ సూటులో టిప్ టాప్ గా వచ్చాడు. చేతిలో చిన్న కర్ర. ముఖం కాస్త వాడినట్టు, అలసినట్టు కనిపించినా, ఉత్సాహం మాత్రం చెడకుండా మనిషి కదులుతున్నాడు. వేలు పిళ్ళై అందించిన పైపుని వెలిగించాడు.

ఉన్నట్టుండి పదిమంది దండలు పట్టుకుని ప్లాట్ ఫారం మీదకి తోసుకు వచ్చారు. ఆ గుంపులో మద్రాస్ చెట్టియార్, సిల్కు లాల్చీ లుంగీ కట్టుకున్న నెల్లూరు చౌదరీగారు, భవిష్యత్తులో పెద్ద నటుడు కావాలని కలలు కనే నటుడూ, ఇంకా రకరకాలవారు ఉన్నారు. వాళ్ళంతా తలో దండా ఆయన మెడలో వేశారు. వాళ్ళకోసమే ఎదురు చూస్తున్నట్టూ చిరునవ్వులు చిందించే వలజ చేతుల్లో కూడా తలో దండా ఉంచారు. అవన్నీ విషనాగుల్లాగ, ఆమె చేతుల్లో పడిందే తడవుగా తీసేస్తున్నాడు వేలు పిళ్ళై. అక్కడ ఉన్నవాళ్ళందరికీ అది ఎన్నో సంవత్సరాలుగా అలవాటయిన రిహార్సల్‌లాగ జరిగిపోతూంది. ఎవరి పాత్ర వారు సునాయాసంగా నటిస్తున్నారు. ప్లాట్ ఫారం చివర నెమ్మదిగా అడుగులు వేస్తోంది. వచ్చినవాళ్ళతో మాట్లాడుతూ రంగరాజు అటు చివరికి నడిచాడు. వేలుపిళ్ళై అతని వెనకనే ఉన్నాడు.

ఈ సమయం చూసి దగ్గరికి వచ్చింది వలజ.

"ఆయన్ని చూశావా? చాలా మారిపోయారు కదూ?" అంది.

ఆమెనింకా నిర్ఘాంతపోయి చూస్తున్నాడు. "నిన్న రాత్రి మాట్లాడిన వలజేనా నువ్వు?" అని అడగాలనిపించింది. కాని ఆమె ఉత్సాహాన్ని, హంగునీ చూసి ఆ ప్రశ్న అడగడానికి భయం వేసింది. ఆ గుంజాటన అర్థమయినట్టు నవ్విందే కాని వలజకూడా ఆ ప్రసక్తి తేలేదు - తీసుకొస్తే ఎలా? ఇది ధనవంతుడి పగలు!

"మారిపోయారు" అన్నాడు చంద్రుడు పొడిగా.

"నిన్ను పరిచయం చేసేదా?" అని, అంతలో సర్దుకుని, "పోనీ వద్దులే. నువ్వు ఏదో సినిమా ఛాన్సు కోసం వచ్చావనుకుంటారు. ఆయనకి పాత విషయాలు గుర్తుంచుకోవడం అలవాటు లేదు" అంది మళ్ళీ.

పడుకున్న తులసివేపు చూస్తూ, "మీ ఆవిడకి ఎలా ఉంది?" అంది.

నిద్రపోతున్న తులసిని చూపించాడు. ఒక్క క్షణం తదేకంగా చూసింది తులసిని. ఆ చూపులో ఆకాశం అంచున ఎగిరే విహంగం నేలమీద పురివిప్పుకున్న నెమలిని చూసే విచిత్రం గోచరించింది.

ఉన్నట్టుండి మాటమార్చి, "నిన్నరాత్రి నా దగ్గర నిలబడ్డ ఎనుబోతులాంటి పోర్టరు కనిపించాడా నీకు?" అంది.

తల అడ్డంగా తిప్పాడు "ఏం?"

"నిన్నరాత్రి మీ ఆవిడని చూడ్డానికి వచ్చినప్పుడు ఆపిల్స్ కావాలని తాళాలిచ్చి వాడిని గదికి పంపాను. పర్సులో రెండువందలుండాలి. ఆ నోట్లన్నీ కొట్టేశాడు -"

"అరెరె! కంప్లెయింటు ఇవ్వలేకపోయావా?"

నవ్వింది. "అందుకే ఆలోచనకి ఆడది ఉండాలన్నారు. కంప్లయింటు ఇస్తే నా గదికి వచ్చిన చాలామంది పేర్లు బయటికి వస్తాయి - దాంట్లో చంద్రుడు అనే ఆయన కూడా ఉంటాడు. ఆయన మధ్యతరగతి మనిషి. మా వంటి ధనవంతుల గదికి ఎందుకు రావాలి అతను? ఆయన నానా హడావుడీ చేస్తారు. పోలీసులకి రిపోర్టు ఇస్తే.. పోనీలే. పోయింది రెండువందలేగా?" అంది.

దూరంగా రంగరాజు చుట్టూవున్న పరివారంతో వెనక్కి తిరగడం కనిపించింది - "అదిగో, వెనక్కి వస్తున్నారు. ఆయనది అసలే గద్దచూపు" అని దూరంగా నడిచింది.

పోర్టర్ల తోనూ, అందరితోనూ చిరునవ్వులు చిందిస్తూ మాట్లాడే వలజ తనని ఎందుకు రహస్యంగా దాస్తూందా అని విస్తుపోయాడు చంద్రుడు. ***ఆడవాళ్ళు తమకు ఇష్టమయిన దానికి ఒక అందమయిన రంగు పూస్తారు. దానికి రహస్యమనో, వినోదమనో పేరుపెట్టుకుంటారు.*** అలాంటి వినోదమది - అనుకున్నాడు.

రైలు వచ్చాక తొక్కిసలాట ఎక్కువయింది. అయినా, చెక్కుచెదరకుండా వలజ నిలబడే ఉంది. రంగరాజు తనకి సంబంధం లేనట్టు ఎవరితోనో మాట్లాడుతున్నాడు. కానీ లుంగీ కట్టుకున్న సిల్కులాల్చీ చౌదరి మాత్రం రైలంతా పరుగులు తీశాడు.

చేతులు ఊపుకుంటూ రైలంతా నడిచాడు చంద్రుడు. రైలు సగం నిద్రపోతూంది.

సిల్కులాల్చీ ఆయన గార్డుని వెంటబెట్టుకు తిరుగుతున్నాడు. రైలుకి దాదాపు చివర్లో ఫస్టుక్లాసు కంపార్టుమెంటు వచ్చినందుకు చికాకు పడుతున్నాడు చౌదరి. గార్డ్ ఏవో కారణాలు చెపుతున్నాడు. రంగరాజు సామాన్లు ఎక్కుతున్నాయి, పెద్ద కంపార్టుమెంటులో. అటు మూలకి పరివారమంతా నడిచింది. రంగరాజు బట్టతల కంపార్టుమెంటులో మాయమయింది. వలజ హిగ్గిన్ బాదమ్స్ దగ్గరికి వచ్చి చేతికందినన్ని పుస్తకాలు కొంది. వాటినన్నిటినీ మోసుకెళ్ళడానికి వేలుపిళ్ళై వచ్చాడు. తనని ఓ కంట గమనిస్తున్నట్టు గుర్తించాడు.

ప్లాట్ ఫారం మళ్ళీ ఖాళీ అయింది. రైలు గార్డు విజిల్‌తో దూకడానికి సిద్ధంగా ఉంది. మూగ అమ్మాయి ఆ రైల్లో సంపాదించిన డబ్బుల్ని లెక్కపెట్టుకుంటోంది. చివర కంపార్టుమెంటు దగ్గరే నిలబడ్డాడు చంద్రుడు.

రంగరాజు పరివారమంతా రైలు దిగి - కంపార్టుమెంటుకు అటు చివర చేరారు. కిటికీలోంచి విన్నపాలనీ, విట్లనీ విసురుతూ. ఆ రైలుకంతటికీ రాణీలాగ ఈ గుమ్మానికి ఆనుకునినిలబడింది వలజ. అలాంటి బ్రతుకు పట్ల నిరుత్సాహం కాని, నిర్వేదం కాని ఏకోశానా ఆ ముఖాన లేదు. నిన్నరాత్రి ప్రవర్తన నటన అయితే ఆమె గొప్ప ఊహాప్రపంచంలో బ్రతుకుతూ ఉండి ఉండాలి. నిన్నటిది నిజమయితే. ఇప్పటి ఈ ప్రవర్తన ఆత్మవంచన అయితీరాలి.

తను ఆమె నిలబడ్డ చోటుకి దగ్గరగానే ఉన్నాడు. "నువ్వు ఎప్పుడు వస్తావు మద్రాసుకి?" అంది మెల్లగా.

ఆ మాటలు తనకోసం పూరించిన బాణంలాగ - సూటిగా తనవేపే ప్రయాణం చేశాయి.

"అమ్మాయి రావాలింకా" అన్నాడు.

నవ్వింది గర్వంగా, పొగరుగా.

"ఎప్పుడో కోరికలకి ఇంకా రూపం దిద్దుకోలేని రోజుల్లో *ఒకసారి రైలు తప్పిపోయింది నీకు. ఇప్పుడు మళ్ళీ రైలు తప్పిపోతోంది.* గుడ్ లక్!" అంది గుండెదాటనివ్వకుండా చేతివేళ్ళని ఆడిస్తూ - వాటి కదలిక ఇటే కనిపించింది. ఆ నేర్పు అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఈ అంతస్తూ, హోదా ఆమె చిన్నప్పట్నుంచీ అలవాటు చేసుకున్న మత్తుమందు. అది ఎప్పుడయినా దిగిపోతే, ఆమెకి భయమేస్తూంటుంది. కాని, ఆ భయం ఎన్నేళ్ళకోసారో? - "క్రిందటి రాత్రిలాంటి నిర్వేదం ఎన్నేళ్ళ క్రిందట కలిగింది నీకు?" అని అడగాలనిపించింది. కాని ఆ ముఖంలో ఆ ప్రశ్నకు జవాబు దొరకదు. అడిగినా సమాధానం చెప్పదు.

గార్డు విజిల్ వేశాడు.

దాటిపోతున్న పరివారం వేపు చూస్తున్నాడు రంగరాజు.

వదిలిపోతున్న చంద్రుడి వేపూ, ప్లాట్‌ఫారం వేపూ చూస్తోంది వలజ. "మళ్ళీ రైలు తప్పిపోతోంది నీకు" అన్న పరిహాసం ఆ కళ్ళలో ఇంకా కొట్టొచ్చినట్టు తెలుస్తోంది.

ఎర్రటి రైలు పెట్టి ప్లాట్‌ఫారం దాటి వెళ్ళిపోయేవరకూ తెల్లటి చుక్కలాగ ఆమె కనిపిస్తూనే ఉంది.

ఉన్నట్టుండి చంద్రుడికి దిగులుతో క్రుంగిపోతున్నట్టనిపించింది. అందుకు కారణం వలజ ఎత్తి చూపించిన ఆలోచనో, వలజ వెళ్ళిపోవడమో తెలియలేదు. ప్లాట్ ఫారం మళ్ళీ మిగిలిపోయిన రాత్రిని గడపడానికి ముసుగుతన్నినట్టు హఠాత్తుగా నిశ్శబ్దమయింది.

చంద్రుడు వెనక్కి తిరిగాడు. బల్లమీద పడుకున్న తులసి నేలమీద పక్కవేసుకుని కూచుంది.

"ఎక్కడికి వెళ్ళారు? ఎంత భయపడ్డాను! రండి పడుకోండి, మీ కళ్ళు ఎర్రగా ఉన్నాయి," అంది.

వంకర్లు లేని ఆ ఆప్యాయతలోని సూటిదనం హఠాత్తుగా అతని మనస్సుకి తాకింది. మల్లెపువ్వు సువాసనలాగ ఆమె సాన్నిధ్యం అతనికి కాస్త ఉపశమనాన్ని చ్చింది.

"నిద్రపట్టడంలేదా తులసీ!" అన్నాడు బల్లమీద కూచుంటూ. బల్లమీద అతనికోసం శుభ్రంగా దుప్పటిపరిచి సంచి తలకింద అమర్చింది.

"నాకు నిద్రవస్తోంది లెండి. పడుకోండి" అంది తలవాల్చి.

ఆమె కంటె కాస్త ఎత్తుగానయినా - తనకు తెలిసినంత, ఆమె అందేంత ఎత్తులో పడుకున్నాడు చంద్రుడు! రాత్రి అలసట నుంచి మెల్లిగా మనస్సు సెలవు తీసుకుంటుంది.

క్రమంగా శరీరం సుషుప్తిలోకి జారిపోయింది.

## 19

జీవితంలో ఇక చంద్రుడి అవసరాలకు ఉపయోగపడలేనేమోనని భయపడిపోయింది తులసి. దాంతో ప్రతి చిన్న విషయం దుఃఖానికి కారణమయి, దుఃఖం పిరికితనంగా స్థిరపడిపోయేది. భారా భర్తల మధ్య ఏర్పడిన వెసులుబాటు చంద్రుడి ఆశాభంగంతో తులసి పిరికితనంతో మళ్ళీ బిగుసుకుపోయింది. చంద్రుడి జీవితంలో సగం భాగం తప్పనిసరిగా ఇప్పుడు వంటగదికి అంకితమయిపోయింది; ఒక చోటనుంచి కదలకుండా చెయ్యగల ఏ కొద్ది పనులో తప్ప మిగతా వన్నీ అతనే చేసుకోవలసి వచ్చేది. దానికి తోడు పసిపాప. ఒకనాటి మంచి బ్రతుక్కి సాక్ష్యంగా కనిపించే ఆ పాప కూడా ఇప్పుడు ఈ జీవితాన్ని వెక్కిరిస్తున్నట్టనిపించేది. ఆ రోజుల్లోనే చంద్రుడికి విసుగు ఎక్కువయింది. కరుకుదనం ప్రబలింది. ఆమె మీదకాదు, జీవితం పట్ల. ఒక్కోరోజున, వంట సరిగా కుదరకపోయినప్పుడూ, చెయ్యో, కాలో కాల్చుకున్నప్పుడూ, ఆ గిన్నెలు అక్కడ పారేసిపోయేవాడు. కాని, పసిపిల్ల ఏడుపు విని మళ్ళీ వచ్చి పనిలో కూరుకునేవాడు. ఆ విసుగుదల ఆమెమీద కాదు. తన దురదృష్టం మీదా, కలిసి రానిరోజుల మీదా. అతని నొసలు ముడత పడితే భయంతో అక్కడినుంచి తప్పించుకుపోయేది గోడపట్టుకుని ఈడ్చుకుపోతూ. ఆ చికాకులో తన జ్ఞాపకం నుంచయినా అతనికి కాస్తపాటి విశ్రాంతినివ్వాలని ఆమె తపన.

తను పడే కష్టం కన్న అతనికి కలుగుతున్న ఇబ్బంది వల్ల దిగులు ఆమెనూ, తన కష్టంతో పాటు, ఆమె ఇబ్బందుల్ని పంచుకోవలసిన బాధ్యత అతన్ని త్వరగా ముసలివాళ్ళని చేశాయి. చిన్నప్పట్నుంచీ నిర్లిప్తంగా గడిచిన జీవితాలు - హఠాత్తుగా యవనాన్ని మరిచిపోయి ముది వయస్సులో అడుగుపెట్టాయి.

ఇక ఇప్పుడూ రుక్కు పెద్దదయింది. తులసికి అతని చికాకు అలవాటయిపోయింది. కోపంలో అతను తిట్టే తిట్లు ఆమెకు దీవెనలయిపోయాయి. వాటిని నవ్వుతూ గ్రహించడం అలవాటు చేసుకుంది. చంద్రుడు సంతోషాన్ని వ్యక్తంచెయ్యడానికి, కోపంతో తిట్టడానికీ వ్యత్యాసమనేది మరిచిపోయాడు. "నోరుముయ్యవే మొద్దు!" అని కోపంలోను అంటాడు. ఆమె మీద ఆప్యాయతతోనూ అంటాడు. ఆ భావం ఆవిడకి అర్థమవుతూంది. ఆ మాత్రం ఆప్యాయత తన బ్రతుక్కి చాలు..

జ్ఞానం వచ్చేవరకూ, రుక్కు తల్లిని ఏడిపించుకు తినేది. 'కుంటికాలు, కుంటికాలు' అంటూ తల్లిని ఆటలు పట్టించేది. ఇప్పుడు తన కుంటిని చూసి తనే కూతుర్ని నవ్వించే స్థితికి వచ్చేసింది తులసి.

***ఒక కన్ను పోయిన వ్యక్తి ఉన్న దృష్టిలోనే ప్రపంచాన్నంతా కుదించుకుంటాడు. ఆ కంటికే ఇంద్రధనస్సు రంగుల అందం, సూర్యోదయంలోని కొత్తదనం, వికసించే పువ్వులోని స్వచ్ఛతా అర్థమవుతుంది.***

ఇదివరకు ప్రేమగా ఇద్దరి మధ్యా స్థిరపడిన బాంధవ్యం ఇప్పుడూ కాస్త రంగు మార్చుకుంది. చంద్రుడి ప్రేమ ఆమె పట్ల జాలిగా స్థిరపడితే, ఆమె ప్రేమ కృతజ్ఞతగా నిలిచిపోయింది. ఇది మళ్ళీ ఇద్దరినీ ఏకం చేసింది.

ఆ రోజుల్లో కాస్త డబ్బు జాగ్రత్తచేసుకోగలిగాడు. ఒకసారి ఇస్మాయిల్ హైదరాబాద్ నుంచి చూడడానికి వస్తూ జీవితం మరికాస్త వేగాన్ని, వినియోగాన్ని పొందే అవకాశం చెప్పాడు. రెండు చక్రాల బండి ఆలోచనని అతనే తీసుకువచ్చాడు. ఆమె పట్ల జాలికి చిహ్నంగా - తను అంతవరకూ కూడబెట్టిన ఆరువందల రూపాయలతో రెండు చక్రాలబండిని హైదరాబాద్ వెళ్ళికొని తెచ్చాడు చంద్రుడు. ఆ ఇంట్లో చాలా ఖరీదయిన వస్తువు అది. తులసికది చాలా విలువయినది. సౌలభ్యం వల్లకాదు. భర్తకి తన పట్లగల సానుభూతికి అది సాక్ష్యం. నిజంగానే ఆ బండి నిరుపయోగమనిపించిన జీవితాన్ని కాస్త ప్రయోజనకరం చేసింది - ఆమె పనులు ఆమె చేసుకోగలగడం, పనిపాటలు కాస్త చురుకుగా చక్కపెట్టుకోగలగడం అలవాటయింది.

కష్టాన్ని పోగొట్టుకోగలగడంలో కాక కష్టాన్ని కాస్త అనువుగా మలుచుకున్న సంతోషంలో చంద్రుడి జీవితంలో బహుళ పంచమి జోత్స్న తొంగిచూసింది. ఆ రోజుల్లోనే నరసయ్య ఆమె కడుపున పడ్డాడు.

కొడుకు పుట్టినందుకు చంద్రుడు కూడా సంతోషించాడు. నరసయ్య అప్పటికి బ్రతికున్నాడో లేదో తెలీదు. అయినా ఆయన జ్ఞాపకం ఇలా మళ్ళీ ఇంట్లో నిలిచే అవకాశం దొరి కిందనుకున్నాడు.

బాబుకి 'నరసయ్య' అని నామకరణం చేస్తున్నప్పుడు - తన పేరు పెట్టొద్దని మావయ్య అనడం తులసికి జ్ఞాపకం రాకపోలేదు అది ఆయన నిర్వేదంలో అన్నమాట అని సరిపెట్టుకుంది.

కాని. ఒక్కోసారి ఇలాంటి ఆలోచనలే మనస్సుమీద తీవ్రంగా పనిచేస్తాయి. ***రోడ్డు మీద కనిపించే ఎర్రకాగితాన్ని చూసి పువ్వు అనుకుని ఊహించుకోవడంలో వచ్చే అనుభూతి వేరు. తేలు అని భయపడడంలో కలిగే అనుభూతి వేరు.***

నరసయ్య పుట్టి తల్లితండ్రుల్ని ఏమీ సంతోషపెట్టలేకపోయాడు.

అన్ని అవలక్షణాలనూ పుణికిపుచ్చుకు పుట్టాడు. వాడు బ్రతికింది ఆరునెలలే. కాని ఆ ఆరునెలలూ ఒక పీడకలలాగా చేసి - ఒక అర్ధరాత్రి అకస్మాత్తుగా కన్నుమూశాడు. ఉధ్రుతంగా గాలివాన ప్రారంభమయి, ధారకట్టి వర్షం కురిసి - ఒక్కసారి వెలిసిపోయినట్టయి పోయింది. బయటికి చెప్పుకోలేదు కాని, ఎందుకనో ఆ కుర్రాడు పోవడం వాడి మంచికేనని మనస్సుల్లో ఇద్దరికీ అనిపించింది. అలా అనుకోవల్సి వచ్చినందుకు తల్లి ప్రాణం గిజగిజలాడి భోరుమనేది. ఆ తల్లిని ఓదార్చే బాధ్యత చంద్రుడిది.

"నోరు ముయ్యవే పిచ్చిమొద్దా! అలాంటి రోగిష్టిని కన్నావు. పోయాడు. ఏడవకు!" అని ఓదార్చేవాడు. అంతకన్న ఓదార్చడం అతనికి తెలీదు.

రుక్కు తల్లీ జ్ఞానం తెలిసీ తెలియని రోజుల్లో - వేరులాంటి పసికందు పుట్టడం, వాడిని తమ్ముడిగా గుర్తించే రోజుల్లోనే పోవడం గుర్తుంది. కాస్త పెద్దదయి పరికిణీ కట్టుకునేటప్పటికే ఆ ఇంటి వాతావరణంలో భాగం పంచుకోవడం అలవాటు చేసుకుంది. తండ్రికి సాయంగా వంటపనికి కూచునేది. ఇద్దరూ కలిసి పని జరిగిందనిపించేవారు. బడికి వెళ్ళేముందు తల్లి జుత్తుకి నూనె రాసి జడదువ్వి ముడివేసేది. ఆడపిల్ల ఇంట్లో తిరుగుతూంటే ఏ గుమ్మం దగ్గరో బండిని ఆపి చూస్తూ, చిన్నప్పుడు తనూ ఇలాగే ఉండేదనుకుని అబ్బురపడుతూండేది తులసి. చంద్రుడిలాగే కోలముఖం, కళ్ళుపొడిచినట్టు సూటిగా చూసేవి. తండ్రిలాగే మాట క్లుప్తం.

రుక్కు హైస్కూలు చదువుకి వచ్చేసరికి గొంతు విప్పిపాడితే, ఎన్నో సంవత్సరాల కిందట పోయిన తల్లి గుర్తుకొచ్చి రహస్యంగా కన్నీళ్ళు తుడుచుకునేవాడు చంద్రుడు. తల్లి పాడే పాత పాటలు గుర్తుచేసి తన బండ గొంతులో కనీసం రాగాలు తెలిసేటట్టు చెప్పి పాటలు పాడించుకు వినేవాడు. పులుసులో తాళింపు పెడుతూనో, కూరకి పోపువేస్తూనో, తండ్రికి సామాన్లు అందిస్తూనో పాటలు పాడేది రుక్మిణి.

నాలుగో ఫారం పాసయేసరికి రుక్మిణి నిగనిగలాడే దంతపు బొమ్మ అయిపోయింది. ఆ చురుకుతనం, తియ్యటి కంఠం, వయస్సుకి తగ్గ స్థిమితం చూసి చచ్చిపోయిన రుక్మిణిని గుర్తుచేసుకుని వణికేవాడు చంద్రుడు. తన కూతురు అలాకాకూడదని మనస్సులో పదే పదే అనుకునేవాడు. రుక్మిణి భయం మనస్సులో ఏమూలో పాతుకుపోయింది. అందుకని అయిదో ఫారంలో చేరతానని రుక్మిణి అనప్పుడు ససేమిరా వీల్లేదన్నాడు. రుక్మిణి బిత్తరపోయింది. తులసి కూడా ఆశ్చర్యపోయింది.

"నీకింక చదువొద్దు. ఇప్పటికిది చాలు. నువ్వు తెలివయినదానివి. ఈ తెలివి తేటలతో సంసారాన్ని చక్కబెట్టుకోగలిగితే అంతే చాలు."

"నాకు పెళ్ళివద్దు," అనడం చాతకాదు ఆ పిల్లకి.

"చదవనిస్తే ఏం?" అని రెట్టించింది తులసి బలహీనంగానే.

"చదువులేక నువ్వేం చెడిపోయావు? మా అమ్మ పాటలు పాడి నన్ను పోషించింది. చదువుకుని అమ్మాయి ఎవడితోనైనా పోయేకంటే - చదువు లేకుండా కాళ్ళు లేకుండా పడివున్నా ఫరవాలేదు." మాట కఠినంగా కనిపించినా, అతని మనస్సుని అర్థంచేసుకుని పాత సంఘటన చటుక్కున స్మృతిలో కదిలి మరి కాదనలేకపోయింది. అవును. జీవితంలో ఎక్కువమంది ఇస్మాయిల్‌లే ఉన్నారు.

ఒకసారి ఎర్రగా పొట్టిగా ఉండే ఒక కుర్రాడిని ఆఫీసునుంచి ఇంటికి తీసుకువచ్చాడు చంద్రుడు. ఆ కుర్రాడి పేరు చిట్టిబాబు. నల్లటి బట్టలు వేసుకుని ఉన్నాడు. బట్టలకి మసి మరకలు కూడా ఉన్నాయి. ఆ అబ్బాయికి రుక్కు తల్లిచేత కాఫీ ఇప్పించి, తులసి బండిని పక్కకి తోసుకెళ్ళి "అబ్బాయి ఎలా ఉన్నాడే?" అని అడిగాడు.

"ఏమిటండీ ఆ నల్లటి బట్టలు?" అని ఎదురు ప్రశ్న వేసింది.

"ప్రెస్సులో పనిచేస్తున్నాడు. వాళ్ళది తూర్పు గోదావరి జిల్లా. ప్రెస్సు పని నేర్చుకోవాలని ఓ స్నేహితుడి దగ్గర కొచ్చాడు. మళ్ళీ వాళ్ళ ఊరు వెళ్ళిపోతాడు. మనవాడే! చెప్పు, ఎలా ఉన్నాడో?"

"బాగానే ఉన్నాడు," అని తలూపింది.

"అతనికి మన రుక్కుతల్లిని ఇవ్వాలనుకుంటున్నాను," అని తేల్చాడు.

"ఇంత త్వరగా దానికి పెళ్ళేమిటండీ?" అంది తులసి.

కాని చంద్రుడి మనస్సులో నిర్ణయం అప్పుడే జరిగిపోయింది. తనకి కావలసిన వ్యక్తి ఒక్కడే ఉన్నాడు. ఇస్మాయిల్‌కి ఉత్తరం రాశాడు. అతను మూడోరోజే కారులో వచ్చాడు. వస్తూ ఈసారి భార్యని కూడా వెంటబెట్టుకు వచ్చాడు. తెల్లగా, నాజూకుగా, గాజుబొమ్మలాగా ఉంటుంది సుల్తానీ.

"రుక్మిణి అన్నయ్య" అని పరిచయం చేశాడు ఇస్మాయిల్ భార్యకి. "రుక్మిణి సంగతంతా ఈవిడకి తెలుసు. పెళ్ళయిన కొత్తల్లోనే చెప్పేశాను" అన్నాడు, సుల్తానీకి అంతగా తెలుగురాదు. అప్పుడే లోకంలో కళ్ళు తెరిచిన పసిపాపలాగా అన్నిటినీ, అందరినీ విచిత్రంగా చూస్తూంది.

ఒకపూటంతా కూచుని ఇస్మాయిల్, చంద్రుడూ సమాలోచనలు జరిపారు. అబ్బాయి ట్రైయినింగ్ అయి భీమవరం చేరితే, ఏదో ప్రెస్సులో వర్కింగ్ పార్టనర్‌గా చేరతాడట. అడ్వాన్సుగా అయిదువందలు కట్టాలట. ఏమయినా కానీ తన పెళ్ళాన్ని తను పోషించుకోగలడు. ఇస్మాయిల్‌ని తీసుకువెళ్ళి చిట్టిబాబుని చూపించాడు. మసిబారిన చేతులు పట్లాంకి రాసుకుని చేతులెత్తి నమస్కారం చేశాడు చిట్టిబాబు. ఇద్దరూ బయటికి వచ్చాక, "ఐ లైక్ ది బాయ్.. చేసెయ్యండి పెళ్ళి" అన్నాడు ఇస్మాయిల్.

మరో నెలరోజుల్లో ఒక ఎనిమిది వందలు కట్నం ఇచ్చి యధోచితంగా కన్యాదానం చేశాడు చంద్రుడు.

అమ్మాయిని అల్లుడితో భీమవరం పంపించాక - మళ్ళీ ఆ ఇంట్లో వాళ్ళిద్దరే మిగిలారు. పదిహేనేళ్ళ తర్వాత.. ఏదో తీరని శూన్యం ఏర్పడినట్టూ, అనిపించింది. నిజానికి అప్పటికి చంద్రుడి వయస్సు నలభై దరిదాపు. అయితే ఈ ముసలితనం శరీరానిది కాదు - మనస్సుది. మనిషి జీవితంలో జరిగే అన్ని దశలూ త్వరగా జరిగిపోయాయి. ఇప్పుడిక వాళ్ళు చేయవలసిందేమీ లేదు.

కొన్ని రోజుల పాటు వాళ్ళిద్దరూ ఎక్కువ మాట్లాడుకోకుండా ఎవరి ప్రపంచంలో వాళ్ళుండిపోయేవారు. మరికొన్ని రోజులు ఏవో కథల్లాగ రకరకాల కబుర్లు వాళ్ళ మధ్య దొర్లిపోయేవి. మాట్లాడుకుని మాట్లాడుకుని ఆకలయితే వండుకునేవారు. లేకపోతే ఏ మజ్జిగో తాగి నిద్రపోయేవారు. కూతురు నీళ్ళుపోసుకున్నదని తెలిసినప్పుడు ఇద్దరూ సంతోషించారే కాని, పురుడు తులసి చేతుల్లో జరగదని

చంద్రుడికి తెలుసు. కూతురు పురుడు పొయ్యలేక పోయినందుకు మళ్ళీ కంట తడి పెట్టుకుంది తులసి. చంద్రుడి మాత్రం వెళ్ళి అమ్మాయిని చూసి, అల్లుడి చేతిలో పురిటికి ఓ అరవై పెట్టి వచ్చాడు. పండగకి మనవడిని ఎత్తుకుని కూతురు అల్లుడూ వచ్చినప్పుడు పెద్దపండగే అయిపోయింది ఆ ఇంటికి.

పెద్ద వర్షం కురిసిన తరవాత కోనేరులోని ప్రశాంతతలాంటిది ఆ సంసారంలోని నిశ్శబ్దం. అక్కడ రాయిపడినా చప్పుడవుతుంది. కెరటాలు వస్తాయి. అంతా కాస్సేపు. మరి కెరటాలు ఒడ్డువరకూ పోయి సర్దుకుంటాయి. ఆ తర్వాత మళ్ళీ కోనేరు నిశ్చలమయి పోతుంది. పెద్ద పెద్ద గాలివానలు చూసిన కోనేరది – ఈ చిన్న కదలికలు లెక్కకి రావు.

ఉన్నట్టుండి, చచ్చుబడిపోయిన కాళ్ళు బాగుచేసే అవకాశం ఉన్నదన్న విషయం పేపర్లో చూశాడు. రాయవెల్లూరులో ఆపరేషన్‌తో ఆ పని సాధ్యమని అక్కడ రాసి ఉంది. వెంటనే ఇస్మాయిల్ కి ఉత్తరం రాశాడు. వారం రోజుల్లో వివరాలన్నీ రాసి పంపాడు ఇస్మాయిల్. దాదాపు వెయ్యిరూపాయలదాకా డబ్బు ఖర్చవుతుందట.

ఎన్నో సంవత్సరాల కిందట తునిగిపోయిన ఆశ మళ్ళీ చంద్రుడిలో కలిగింది. జీవితాన్ని జీవన యోగ్యం చేసుకోవాలన్న ఆసక్తి ఎక్కువయింది. కష్టపడి కొంత డబ్బు సేకరించగలిగాడు. మరికాస్త అక్కడా ఇక్కడా అప్పుతీసుకున్నాడు.

తన మీద అంత డబ్బు ఖర్చుచెయ్యడం తులసికి ఇష్టంలేక పోయింది. ఇక తనకి ఆ కాళ్ళతో పనిలేదు. మంచితనం ద్వారా తన భర్త దగ్గర్నుంచి సంపాదించుకున్న 'దయ' తనకి చాలు. తన కుంటితనంతో పాటు ఆ 'జాలి'ని కూడా కోల్పోతే తను ఏమవుతానో అన్న భయం ఆమెకు ఎక్కువయ్యింది.

కష్టాల నుంచి విముక్తికి ఎదురుచూసే ఈ లోకంలో ఆ మాత్రం అదృష్టానికయినా కారణమయిన ఆ కష్టాన్ని పదిలంగా దాచుకోడానికే తులసి సిద్ధపడింది.

చంద్రుడు కోపం తెచ్చుకున్నాడు, తిట్టాడు. విసుక్కున్నాడు – చివరికి ఏదో గొప్ప అదృష్టాన్ని జీవితంలో నష్టపోతున్న దానిలాగ భోరున ఏడ్చి ఒప్పుకుంది.

ఆపరేషన్ జరిగేటప్పుడు ఆడమనిషి సాయం అవసరమని అమ్మాయిని పంపమని అల్లుడికి ఉత్తరం వ్రాశాడు. అతని దగ్గర్నుంచి సమాధానం వచ్చేవరకూ కూడా ఆగడానికి ఇష్టంలేకపోయింది. అందుకని, విజయవాడ పంపమని అల్లుడికి ఉత్తరం వ్రాసి బయలుదేరాడు.

## 20

"నాన్నా! నాన్నా!" అనే పిలుపుకి తెలివొచ్చింది చంద్రుడికి.

ఎవరో తనని తట్టి లేపుతున్నారు. కళ్ళు విప్పితే రుక్కు తల్లి ముఖం దగ్గరగా తన ముఖంలోకి తొంగి చూస్తూ కనిపించింది.

"బాగా నిద్రపట్టిందా నాన్నా!" అంది రుక్కు తల్లి.

ఎన్నో రోజుల తర్వాత ఆ గొంతు వీణ మీటినట్టు వినిపించింది.

"అమ్మా వచ్చావా?" అన్నాడు ఆప్యాయంగా, ఆప్యాయత పలకడం తెలియని ఆ కంఠం కూడా ఇన్ని సంవత్సరాల తర్వాత మొదటిసారిగా ఆర్ద్రతను పూరించుకుంది. ఆమె చేతిలో మనవఁడు తనని వింతగా చూస్తున్నాడు.

"తాతయ్యరా!" అంటూ అందించింది కొడుకుని.

"తాతా!" అంటూ చేతుల్లోకి ఎగరేసుకున్నాడు చంద్రుడు మనవఁడిని. అతనూ చంద్రుడే!

అప్పుడే సన్నని ఎండతెర ప్లాట్ ఫారం మీదకి వస్తోంది. విజయవాడ ప్లాట్ ఫారమంతా కొత్తరోజుకి సిద్ధపడుతూంది. అలసి పోయిన పాతజ్ఞాపకాల్ని తుడిచేస్తున్నారు పనివాళ్ళు.

చిలకాకుపచ్చ రంగు చీరె కట్టుకుంది రుక్కు తల్లి. మాతృత్వం ఆమెని మరింక పొందికగా, కుదిమట్టంగా తయారు చేసింది.

"అమ్మ ఏది నాన్నా?" అన్నాక మొదటిసారి తులసి పడుకున్న పక్కని చుశాడు. ఆమె దగ్గర్లో లేకపోతే గతుక్కుమన్నాడు. దూరాన - కొళాయి దగ్గర చెంబులోకి నీళ్ళు పడూతుంది. చూపించాడు రుక్మిణికి.

తల్లిని చూసి అటువేపు పరిగెత్తింది. దూరం నుంచి ఆ తల్లీ కూతుళ్ళ ఆత్మీయత ఎంతో హృద్యంగా, సజీవంగా కనిపించింది. ఆ దృశ్యం తియ్యగా, ముచ్చటగా ఉంది. చక్రం వంగిపోయిన బండిని చూస్తోంది రుక్కు తల్లి. తనకి జ్ఞానం వచ్చినప్పటి నుంచీ అమ్మకి ఆస్కారమయిన బండి అంటే ఆమెకీ ఇష్టమే. బండి కుంటుతూనే నడుస్తోంది. ఇక త్వరలో దాని అవసరం తీరిపోతుంది - అనుకున్నాడు చంద్రుడు అటు చూస్తూ.

తాత మాసిపోయిన గడ్డాన్ని సవరిస్తున్నాడు - మనవఁడు.

"లేచారా! ఇవిగో నీళ్ళు, పలుదోముపుల్ల. ముఖం కడుక్కోండి కాఫీ తీసుకురమ్మని ఆ హోటలు కుర్రాడికి చెప్పాను." అంది. ఆ అవిటితనంలో కూడా బాధ్యతల్ని మరిచిపోని భార్య ముఖాన్ని ఆప్యాయంగా చూశాడు చంద్రుడు. ఎప్పుడు లేచిందో ఏమో! ముఖం స్వచ్ఛంగా, పవిత్రంగా ఉంది. కిరిమింజి రంగుతో నూరిన చవకబారు కుంకుమ ఆమె ముఖం మీద ఎంతో విలువని ఆర్జించుకుంది. మనమడిని ఎత్తుకోడానికి తొందరపడుతూంది తులసి. లేచి అందించాడు.

"నువ్వు ఒంటరిగానే వచ్చావా అమ్మా?" అనడిగాడు.

"లేదు నాన్నా! ఆయనా వచ్చారు. బాబుకోసం ఫ్లాస్కులో పాలు పోయించుకు రావడానికి వెళ్ళారు."

"అల్లుడు వచ్చాడా?"

ప్లాట్ ఫారమంతా వెదికాయి చంద్రుడి కళ్ళు. ఇప్పుడు ప్లాట్ ఫారం నిశ్చలంగా ఉంది. అక్కడక్కడా ఉన్న ప్రయాణీకులు కొత్తరోజుని మెల్లగా తెరుస్తున్నారు. నిన్నటి ప్లాట్ ఫారానికీ, ఇవాళ్టికీ చాలా తేడా ఉన్నట్టనిపించింది. ఇప్పుడు ఈ ప్లాట్‌ఫారమ్ ఎంతో ఆత్మీయతలు నిండిన విశాలమయిన ఇంటిలాగా తోచింది చంద్రుడికి. గబగబా ముఖం కడుక్కున్నాడు.

చిట్టిబాబు ఫ్లాస్కుతో వచ్చాడు. అల్లుడు మరీ బొద్దుగా బలంగా తయారయాడు. "బాగున్నావోయ్?" అని పలకరించాడు చంద్రుడు.

నిన్న రోజ్‌తో మాట్లాడినప్పటికంటే, జోగులతో సంభాషణకంటే, పద్నాలుగో నెంబరు గదిలో సంఘటనల్లో కంటే, ఈ పలకరింతలో పెద్దరికం ఎంతో గొప్పగా, నిండుగా ఉంది.

వినయంగా తలూపాడు చిట్టిబాబు.

"వ్యాపారం ఎలా ఉంది?"

"బాగానే ఉందండి, మా ప్రెస్ బాగా నడుస్తోంది. అంతా రుక్కు అదృష్టం అంటారు మా వాళ్ళు."

తల్లితండ్రులిద్దరూ అమ్మాయిని ఒక్కసారి గర్వంగా చూసుకున్నారు.

"వీడిది మీ పోలికేనట - మీ అమ్మాయి అంటుంది - కోపం ఎక్కువ." అన్నాడు చిట్టిబాబు - కళ్ళు చికిలించే కొడుకుని చూస్తూ.

ఎప్పుడూ లేనిది తులసి ఆ మాటలకి ఫకాలున నవ్వేసింది. ఆ నవ్వుకి వయసొచ్చినా అంత అందం ఉన్నదని ఎప్పుడూ గుర్తించలేకపోయింది. మనవఁడన్నారానీ ఆయనకి బుద్ధిచెప్పడానికి" అంది.

"నోరుముయ్యవే మొద్దూ!" అన్నాడు చంద్రుడు - ఓరగా చూసి.

"మీ బండి విరిగిపోయిందేం?" అన్నాడు చిట్టిబాబు.

"ఇక ఎలాగూ కాళ్ళు వస్తాయని ధైర్యం వచ్చి నిన్న విరుచుకుందిలే!" అని సమాధానం చెప్పాడు చంద్రుడు. భార్యవేపు చూస్తూ. కృతజ్ఞత నిండిన ఆమె కళ్ళు ఎదురయాయి. నిన్నరాత్రి తను చేసుకున్న నిర్ణయం నుంచి అంత హాయిగా బయటపడగలిగినందుకు ఆమె కళ్ళలో ఒక 'విముక్తి' కనిపించింది.

"ఈ బండి అంటే నాకు చాలా ఇష్టమోయ్! మీ మామగారు నాకు ఖరీదయిన వస్తువులేవీ చేయించలేదు. కాని, ఈ బండి ఆయన నాకు కొనిచ్చిన ఖరీదయిన వస్తువు. నాకు భగవంతుడు మేలు చేసి - కాళ్ళొచ్చినా దీన్ని భద్రంగా దాచుకుంటాను" అంది.

కుర్రాడు అందరికీ కాఫీలు తెచ్చాడు.

"రాత్రి నువ్వు అమ్మాయిని పంపిస్తే తెల్లవారు ఝామున నాలుగున్నర బండికి వెళదామనుకున్నాం." అన్నాడు చంద్రుడు.

"పంపేవాణ్ణే, కాని నేనూ రావాలని పట్టుబట్టింది, మీకు తోడుగా ఉంటానట. పనులన్నీ పూర్తిచేసుకుని, చెప్పివచ్చేసరికి బండి వేళ దాటిపోయింది. రాత్రి బయలుదేరాం."

పరచిన దుప్పట్లన్నిటినీ సర్దుతూంది రుక్కుతల్లి. విశాలమయిన సామ్రాజ్యాన్ని ఆక్రమించుకున్న చక్రవర్తిలాగా ఠీవిగా ప్లాట్ ఫారమంతా పచార్లు చేస్తున్నాడు చిన్న చంద్రుడు.

"మీరు బాగా చిక్కిపోయారు. ఆరోగ్యానికేదయినా మందు పుచ్చుకోవాలి," అన్నాడు చిట్టిబాబు మామగారిపక్కనే బల్లమీద కూర్చుని.

"మరికొంచెం కాఫీ కావాలా నాన్నా?" అంది రుక్కు తల్లి.

తాతయ్యని దూరం నుంచే వెక్కిరిస్తున్నాడు మనుమడు. తులసికి నవ్వొస్తోంది.

"ఆయన అందానికి మోసపోయింది నేనొక్కతేనే బాబూ! నువ్వయినా గుర్తు చెయ్యి ఆయనకి," అంది దగ్గరకి తీసుకుని.

తన అందాన్ని అధిక్షేపించిన మరొక వక్తి హఠాత్తుగా గుర్తుకొచ్చింది చంద్రుడికి. వలజ ఈ పాటికి చాలా దూరం ప్రయాణం చేసివుంటుంది. తామింకా ఇక్కడే ఇలాగే కూర్చుని ఉన్నారు.

కూతురుకి జుత్తు దువ్వి జడవేస్తోంది తులసి.

గాలివానలకి, తుఫానుల తాకిడికి తట్టుకుని నిలిచిన మంచి గంధపు చెట్టులాగ కనిపించింది తులసి.

కొద్దిరోజుల్లోనే ఆవిడ నడుస్తుంది. ఈడిగిల బడుతున్న తమ జీవితాలు కాస్త చురుకుగా సాగుతాయి.

మనవఁడు కేరింతలు కొడుతున్నాడు. ఆ వయస్సులో - తన తల్లి ఒడిలో - ఒక మారుమూల గ్రామంలో తనని ఊహించుకుని క్షణకాలం ఆలోచనల్లోకి జారిపోయాడు. అక్కడినుంచి ఇక్కడికి - ఈ ప్లాట్ ఫారం మీదకి - ఈ మజిలీకి ఎంతదూరం ప్రయాణమో! ఇప్పటి కప్పుడే ఒక తరందాటి మరో తరం కూడా జీవికను ప్రారంభించింది.

అక్కడ ఆడుకునే చిన్నతాత - ఓ మారుమూల గ్రామంలోని పాత చంద్రుడికి కొత్త ప్రతిబింబం.

తన పాతదనాన్ని ఇప్పుడిక గర్వంగా అంగీకరిస్తోంది మనస్సు. ***వచ్చేతరాన్ని వయస్సు నిండు మనస్సుతో ఆహ్వానిస్తుంది. పెరిగిన తరం పెరిగే తరానికి చోటిచ్చి రాలిపోతూంటుంది - అందుకు సిద్ధపడుతూనే*** తన చుట్టూ ఉన్న నలుగురినీ చూసుకుని - తను జీవితంలో ఏమీ నష్టపోలేదనుకున్నాడు చంద్రుడు. నిన్న రాత్రంతా ఓ వింత కల - చల్లని జీవితాన్ని భయంకరంగా, బాధాకరంగా చిత్రించిన రాత్రి. చంద్రుడిని కూడా చీకటిలో చిదిపేసిన రాత్రి.

రాత్రంతా చీకటికి పహరా ఇచ్చి అలసిపోయిన చంద్రుడు పగటి ఆకాశం మీద ఓ మూల ఇంకా వెలవెలా పోతున్నాడు. ఇప్పుడిక ఆ చంద్రుణ్ణి ఆనందంతో, తృప్తినిండిన ముఖంతో జయించేశాడు బాలచంద్రుడూ.

ఎక్కడో ఉన్నట్టుండి సైరన్ కూత ప్రారంభమయితే కుర్రాడు భయపడ్డాడు. చిట్టిబాబు పరిగెత్తుకు వెళ్ళి, ఎత్తుకున్నాడు కొడుకుని.

ప్లాట్ ఫారం మీద చిన్న లజడి బయలుదేరింది.

"డివిజనల్ కంట్రోల్ ఆఫీసులో సైరన్!" అన్నారెవరో.

కొందరు స్టేషను మాస్టరు గదివేపు పరిగెత్తారు.

రైల్వే ఉద్యోగులు హడావిడి పడుతున్నారు. పరిగెత్తేవాళ్ళ ముఖాలు పాలిపోయి ఉండడంతో ఏదో జరిగిందనుకున్నాడు చంద్రుడు.

పదిపదిహేను నిమిషాల సేపు ఏమీ అర్థకాలేదు. ఉన్నట్టుండి ప్లాట్ ఫారం మీది వాతావరణంలో గాంభీర్యం అలుముకుంది.

"ఇంకో పదినిముషాల్లో ఫార్మేషన్ స్పెషల్ బయలుదేరుతుంది," అని అటు ప్లాట్ ఫారం నుంచి తెల్లబట్టలు వేసుకున్న ఉద్యోగి ఎవరో అరిచాడు - ఇటు ఉన్న ఉద్యోగితో.

"ఏమైనా తెలిసిందా?" అన్నాడు ఇటు -

స్టేషన్ మాష్టరు గదిలో ఫోన్‌లు మోగుతున్నాయి. మరో అయిదు నిముషాలకి చిట్టిబాబు వార్త తీసుకొచ్చాడు.

"బాపట్ల దగ్గర రైలు ఆక్సిడెంటట!"

తులసి, రుక్మిణి ముఖాల్లో ఆందోళన కనిపించింది.

"ఎవరి ప్రాణాలకయినా ప్రమాదమా?" అంది రుక్మిణి.

"చివరి పెట్టెలు బాగా దెబ్బతిన్నాయట - విచిత్రంగా. చాలామందే పోయి ఉండవచ్చునని భయపడుతున్నారు."

"ఏ ట్రైయిన్?"

"ఢిల్లీ - మద్రాసు జనతా. తెల్లవారు ఝామున ఇక్కడికి నాలుగున్నరకి వస్తుందే! - అది."

గతుక్కుమన్నాడు చంద్రుడు. అతనికి హఠాత్తుగా వలజ, రంగరాజు గుర్తుకొచ్చారు.

"ఏమన్నావ్? చివరి పెట్టెలు దెబ్బతిన్నాయా?"

తలూపాడు చిట్టిబాబు.

నెల్లూరి చౌదరి - చివరలో ఫస్ట్‌క్లాసు కంపార్టుమెంటున్నందుకు గార్డుతో వాదించడం గుర్తుకొచ్చింది చంద్రుడికి.

ఓ భయంకరమయిన ఆలోచనతో వణికిపోయాడు.

"ఏం, అలా ఉన్నారు?" అనడిగాడు చిట్టిబాబు.

"ఏం లేదు. ఏమయిందో కనుక్కొందాం పద!" అన్నాడు లేచి, చిట్టిబాబు భుజం మీద చెయ్యివేసి.

"చాలమంది పోయి ఉండొచ్చు సార్ - ఇన్ దిస్ ఏక్సిడెంటు ఉయ్ కాంట్" అన్నాడొక రైల్వే ఉద్యోగి.

శిలా ప్రతిమలాగ నిలబడిపోయాడు చంద్రుడు. కొన్ని గంటల క్రితం - తనకు వీడ్కోలు ఇచ్చిన వలజ నవ్వు,

**"మళ్ళీ రైలు తప్పిపోయింది!"** అన్న హేళన కళ్ళముందు కదిలాయి.

తులసి, రుక్మిణి కూచున్న దగ్గరికి ఇద్దరూ వచ్చారు.

"చూశావా నాన్నా - మనం ఆ రైల్లో వెళ్ళకపోవడమే మంచిదయింది. రైలు తప్పిపోయింది కనకనే బ్రతికిపోయాం" అంది రుక్మిణి.

తన వాళ్ళందరినీ నీళ్ళు నిండిన కళ్ళతో చూసుకుంటూ "ఆవునమ్మా, రైలు తప్పిపోయింది. ఒకసారి కాదు - రెండుసార్లు. కాని రెండుసార్లూ నా మంచికే తప్పిపోయిందమ్మా!" అన్నాడు అపస్వరంలో.

రెండుసార్లు ఎప్పుడో ఎవరికీ అర్థంకాకపోయినా అతని కళ్ళలో నీటితెర అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

కాని, ఎవరూ మరి ప్రశ్న వెయ్యలేదు.

*(అయిపోయింది)*